www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గంటకు 450 కి.మీ. వేగం
2
సరికొత్త బుల్లెట్ రైలును పరీక్షించిన చైనా
సీఆర్ 450గా పేరు.. త్వరలో అందుబాటులోకి



సోమవారం | 30-12-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 255
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య తె. 3.57 తదుపరి పాడ్యమి; నక్షత్రం: మూల రా. 11.57 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ. 7.33-9.12, రా. 10.18-11.57; దుర్ముహూర్తం: మ. 12.39-1.23, మ. 2.51-3.35; అమృతఘడియలు: సా. 5.23-7.02; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 5.47
విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రన్‌వేపై దూసుకెళ్లి..
రక్షణ గోడను ఢీకొట్టి..

పేలిపోయిన విమానం.. 179 మంది దుర్మరణం
దక్షిణ కొరియాలో ఘోరం.. బతికింది ఇద్దరే
బ్యాంకాక్ నుంచి మువాన్ వచ్చిన 'జెజు' విమానం
ల్యాండింగ్ గేర్ విఫలమవడంతోనే ప్రమాదం!
పక్షి ఢీకొట్టడంతోనే విఫలమైందన్న అనుమానాలు
మరో రెండు విమానాలకు తప్పిన ప్రమాదం 2
ఎయిర్ కెనడాలో మంటలు.. నార్వేలో మరో ఘటన


మువాన్ విమానాశ్రయంలో కుప్పకూలిన విమానం వద్ద రక్షణ చర్యలు

తరం మారనన్నది!
భారత్ వద్ద ప్రస్తుతం 4వ తరం యుద్ధ విమానాలే


చైనా ప్రదర్శించిన జే-36 ఫైటర్ జెట్

ఆరో తరం ఫైటర్‌జెట్‌నూ ప్రదర్శించిన చైనా
రెండేళ్లలో చైనా నుంచి 40 జే-35 ఫైటర్‌జెట్లు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్న పాక్
ఆ తరహా ఫైటర్ జెట్ల తయారీకి భారత్ 'ఏఎంసీఏ' ప్రాజెక్ట్
2034లో మనకు అందుబాటులోకి వచ్చే అవకాశం!
తాజా పరిణామాలపై మన రక్షణ రంగ నిపుణుల ఆందోళన
భారత్ తన ప్రయత్నాలను వేగవంతం చేయాలని సూచన

వాయుశక్తిలో పాకిస్థాన్‌తో పోలిస్తే ప్రస్తుతానికి భారత్‌దే పైచేయి! కానీ.. పాకిస్థాన్ తన వైమానిక దళ శక్తిసామర్థ్యాలను మెరుగుపరుచుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది!! అందులో భాగంగా.. రాడార్లకు అందని, సూపర్ క్రూయిజ్ సామర్థ్యాలున్న అత్యంత అధునాతన ఐదో తరం యుద్ధవిమానాలను చైనా నుంచి కొనుగోలు చేయడానికి పాక్ ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం. దాని ప్రకారం.. వచ్చే రెండేళ్లలో పాకిస్థాన్‌కు చైనా నలభై 'జే-35' యుద్ధ విమానాలను సరఫరా చేయనుంది. ఇవి చైనా రూపొందించిన ఐదో తరం ఫైటర్ జెట్లు. అమెరికా వద్ద ఉన్న 'ఎఫ్-35 లైట్నింగ్ 2' యుద్ధవిమానాలతో సమానమైన శక్తిసామర్థ్యాలు కలిగినవని సమాచారం. అవి అందుబాటులోకి

మిగతా 2వ పేజీలో...


ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

మళ్లీ తెలుగు వెలుగులు
అన్ని బడుల్లో త్వరలో తెలుగు మాధ్యమం

ప్రాథమిక స్థాయి నుంచి అమలుకు చర్యలు
ఆ దిశగా ప్రభుత్వ ప్రయత్నాలు ప్రారంభం
తెలుగు భాష పరిరక్షణ, ప్రోత్సాహానికి సిద్ధం
రాష్ట్రంలో సాహితీ టూరిజాన్ని అభివృద్ధి చేస్తాం
ప్రకటించిన పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
'తెలుగు' కోసం కలసి కదులుదాం: మంత్రి సత్యకుమార్
ముగిసిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

విజయవాడ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): భాషాభిమానులు, కవులు, రచయితలు, మేధావులు కోరుతున్నట్టుగా రాష్ట్రంలో అన్ని విద్యాలయాల్లోనూ ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు మాధ్యమం అమలు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు సభకు

మిగతా 11వ పేజీలో...

సంధానానికి జై

గోదావరి-పెన్నా అనుసంధానానికి గ్రీన్‌సిగ్నల్
3 నెలల్లో పనులు ప్రారంభించి మూడేళ్లలో పూర్తి



జల హారం.. సీమకు వరం
80 లక్షల మందికి తాగునీరు
కొత్తగా ఏడున్నర లక్షల ఎకరాల ఆయకట్టు
22.5 లక్షల ఎకరాలకు సాగునీటి స్థిరీకరణ
పరిశ్రమలకు 20 టీఎంసీల జలాలు

ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం నిర్దేశం
కేంద్రం నుంచి సానుకూల స్పందన
మంత్రి నిర్మలతో ప్రాజెక్టుపై మాట్లాడిన బాబు
ఏషియా బ్యాంక్ నుంచి సహకారానికి హామీ
రూ.40వేల కోట్లు లభించే అవకాశం
ప్రకాశం, నెల్లూరుతోపాటు సీమ జిల్లాలకు వరం
పోలవరం నుంచి బనకచర్ల రెగ్యులేటరుకు...
బొల్లాపల్లి రిజర్వాయర్ మీదుగా 2టీఎంసీలు
దూరాన్ని తగ్గించడం, అక్కడక్కడ రిజర్వాయర్లు నిర్మించడంపై అధికారులకు సీఎం సూచనలు
యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణకు ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్భిక్ష జిల్లాలకు జలదానం చేసేందుకు ఉద్దేశించిన గోదావరి - పెన్నా నదుల అనుసంధానానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. క్షామం నుంచి రాష్ట్రాన్ని శాశ్వతంగా బయటపడేసే కీలక ప్రాజెక్టుకు కేంద్రం నుంచీ సానుకూల స్పందన లభించింది. ఈ మేరకు తన ఢిల్లీ పర్యటనలో సీఎం గట్టి ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే జల సంధానానికి సై అంటూ కూటమి ప్రభుత్వం తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతోంది. ఆదివారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో గోదావరి-పెన్నా అనుసంధాన పథకంపై చంద్రబాబు సమీక్షించారు. ఉన్నతాధికారులంతా పాల్గొన్న ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ప్రాజెక్టును మూడు నెలల్లో ప్రారంభించి మూడేళ్లలో యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని చంద్రబాబు నిర్దేశించారు. తొలిదశలో గోదావరి-బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు రోజుకు రెండు టీఎంసీల చొప్పున పంపే ప్రతిపాదనకు ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. గోదావరి- పెన్నా అనుసంధాన ప్రక్రియలో భాగంగా తొలిదశలో పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు రోజుకు రెండు టీఎంసీలను ఎత్తిపోసేలా కార్యాచరణను సిద్ధం చేయాలని జల వనరులు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు సాయిప్రసాద్, పీయూష్‌లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. విశ్వసనీయ సమాచారం మేరకు...సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారు చేసి .. టెండర్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో గోదావరి - పెన్నా నదుల అనుసంధానంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను ముఖ్యమంత్రి

మిగతా 12వ పేజీలో...



ప్రపంచ చాంపియన్
మన హంపి

ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ కైవసం
రెండోసారి సాధించి సరికొత్త చరిత్ర
ద్రోణవల్లి హారిక, అర్జున్‌లకు ఐదో స్థానం

తెలుగమ్మాయి, చెస్ ధ్రువతార కోనేరు హంపి విశ్వవేదికపై అద్భుత ప్రదర్శన కనబరిచింది. న్యూయార్క్‌లో జరిగిన ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలిచి అదరహో అనిపించింది. మొత్తం 11 రౌండ్లకు గాను 8.5 పాయింట్లు సాధించిన హంపి అగ్రస్థానంతో టైటిల్ కైవసం చేసుకుంది. 37 ఏళ్ల హంపికిది రెండో ర్యాపిడ్ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. 2019లోనూ విజేతగా నిలిచిన హంపి.. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ తర్వాత ఈ టోర్నీని ఒకటికంటే ఎక్కువసార్లు గెలిచిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. మరో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఎనిమిది పాయింట్లతో ఐదోస్థానంతో సరిపెట్టుకుంది. మిగతా భారత క్రీడాకారిణుల్లో దివ్య దేశ్‌ముఖ్ 21వ, వైశాలి 52వ స్థానాలతో టోర్నీని ముగించారు. ఓపెన్ విభాగంలో రష్యా టీనేజర్, 18 ఏళ్ల వొలొదార్ ముర్జిన్ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించాడు. 13 రౌండ్ల నుంచి 10 పాయింట్లతో టాప్‌లో నిలిచిన ముర్జిన్.. పిన్న వయసులో ఈ టైటిల్ నెగ్గిన రెండో ఆటగాడిగా రికార్డులకెక్కాడు. టైటిల్ ఫేవరెట్‌గా పోటీపడ్డ అర్జున్ ఇరిగేసి 9 పాయింట్లతో ఐదో స్థానానికి పరిమితమవగా.. ప్రజ్ఞానంద (8.5) 17వ, హర్ష భరత్‌కోటి (6.5) 98వ స్థానాలతో నిరాశపరిచారు. 10



సోషల్ మీడియాలో చెడు పోస్ట్ చేయొద్దంటూ పెట్టిన భారీ హోర్డింగ్

చెప్పి చూద్దాం.. చేసి చూపిద్దాం
జనాల్లో ధైర్యం, ఉద్యోగుల్లో స్థైర్యం నింపుదాం

సోషల్ మీడియాను సన్మార్గంలోకి తెచ్చే యత్నం
నాడంతా వైసీపీ మూకలు, సోషల్ సైకోల వీరంగం
ఉద్యోగులపై దూషణలు.. పోలీసులతో దాడులు
నేతలు, మహిళలపై అసభ్య పోస్టులతో వేధింపులు
ఆ ఐదేళ్లూ భీతిల్లిన రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులు
తిరిగి గాడిలో పెట్టే దిశగా కూటమి చర్యలు
గట్టు దాటిన వారిని ఉపేక్షించబోమన్న సంకేతాలు
డిప్యూటీ సీఎం తక్షణ పరామర్శతో తొలి అడుగు
నేడు ఉద్యోగులతో పవన్ వీడియో కాన్ఫరెన్స్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
రాష్ట్రంలో గత సర్కారు కొనసాగించిన మానసిక, భౌతికదాడులకు చరమగీతం పాడాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై చెయ్యి వేయడానికి భయపడే పరిస్థితిని తీసుకురావాలని భావిస్తోంది. ఒకవైపు సోషల్ మీడియా సైకోలకు చెక్ పెట్టే చర్యలు క్షేత్రస్థాయిలోనే మొదలయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఎక్కడికక్కడ దీనిపై అవగాహన కోసం భారీ హోర్డింగులు, బ్యానర్లు పెడుతున్నారు. మరోవైపు వైసీపీ మూక దాడుల నుంచి ప్రజలకు, ఉద్యోగులకు రక్షణ కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులోభాగంగానే గాలివీడు మండలం ఎంపీడీఓ జవహర్‌బాబుపై

మిగతా 12వ పేజీలో...



కొత్త సీఎస్ విజయానంద్
నియామక ఉత్తర్వులు జారీ

రాష్ట్రాభివృద్ధికి ఇద్దరూ కలిసి పనిచేయండి 2
సాయిప్రసాద్, విజయానంద్‌లకు సీఎం సూచన
నియామకానికి ముందు ఇరువురితో భేటీ

రేపే పింఛన్ల పంపిణీ
ఈనెల కూడా ఒకరోజు ముందే
పల్నాడు జిల్లాలో పాల్గొననున్న సీఎం
12

అరబిందో 'అత్యవసర'
అక్రమాలు!
108, 104 ఉద్యోగాల భర్తీలో చేతివాటం



నియామకాల పేరుతో లక్షల్లో వసూళ్లు
శిక్షణకు మరో 10 వేలు గుంజిన వైనం
108 అంబులెన్సుల్లో ప్రైవేటుకు రోగులు
బిల్లుల్లో పర్సంటేజీలు తీసుకున్న సిబ్బంది
గుంటూరులో భారీగా అందిన ఫిర్యాదులు
విచారణకు రంగంలోకి దిగిన విజిలెన్స్
అక్రమాలపై కూపీ లాగుతున్న అధికారులు

ఫోన్ చెయ్యగానే కుయ్.. కుయ్.. కుయ్ మని హారన్ కొట్టుకుంటూ 108, 104 వాహనాలు రావడం తెలిసిందే. కానీ, ఈ వాహనాల రాక, ఆస్పత్రులకు పోక మధ్య అత్యవసర సేవలు నిర్వహించే అరబిందో సంస్థ అనేక అక్రమాలకు పాల్పడినట్టు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఉద్యోగుల నియామకం నుంచి రోగులను ఆస్పత్రులకు తరలించడం వరకు వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
రాష్ట్రంలో 108, 104 వాహనాల ద్వారా అత్యవసర సేవలు అందించే అరబిందో సంస్థ అక్రమాల్లో కూరుకుపోయింది. జగన్ హయాంలో అరబిందో సంస్థ వ్యవహారం ఆడిందే ఆటగా సాగింది. దీంతో 108 అంబులెన్స్‌లు, 104 వాహనాల నిర్వహణలో సంస్థ పూర్తిగా విఫలమైంది. ఆ వాహనాలు తిరగకుండానే తిరిగినట్లు చూపించి రూ.వందల కోట్లు

మిగతా 12వ పేజీలో...



టాలీవుడ్‌పై 'అక్కినేని'
చెరగని ముద్ర
తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారు 2
రాజ్‌కపూర్, మొహమ్మద్ రఫీ, తపన్ సిన్హా జీవితాలు యావత్ సినీ పరిశ్రమకు స్ఫూర్తి
'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ

వివాదాల జైళ్లు
ఖైదీలకు లాఠీ దెబ్బలు.. సిబ్బందికి వేధింపులు
శాఖలో అవినీతి'కిరణం'పై తీవ్ర ఆరోపణలు
రాజమండ్రి జైలులో ఖైదీ పట్ల రాక్షసత్వం
విశాఖ జైలులో ఖైదీల ముందే ఇద్దరు వార్డర్ల దుస్తులు విప్పించి అవమానపరచిన అధికారి
సిబ్బంది ఆందోళన.. కుటుంబ సభ్యుల మద్దతు
ఆదివారం 66 మంది వార్డర్లకు అటాచ్‌మెంట్లు
రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో సిబ్బంది నిరసనలు 3
సరిదిద్దాల్సిన ఉన్నతాధికారుల మీనమేషాలు


ఐడీఎఫ్ బందీలుగా పట్టుకున్న వైద్యులు, పౌరులు

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు..
43 మంది దుర్మరణం
కమల్ అద్వాన్ ఆస్పత్రిలో 20 మంది హతం 2
వైద్యులు సహా 240 మందిని బంధించిన ఐడీఎఫ్

తరం మారనన్నది!

(మొదటి పేజీ తరువాయి)

వస్తే భారత వైమానిక దళం (ఐఏఎఫ్)పై పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ (పీఏఎఫ్) పైచేయి సాధించినట్లవుతుంది. పాక్‌కు ఐదో తరం యుద్ధవిమానాలు సరఫరా చేయడమే కాదు.. తాజాగా తాను తయారుచేసిన ఆరోతరం యుద్ధ విమానాన్ని సైతం చైనా ప్రదర్శించింది. ఈ పరిణామాల నేపథ్యంలో.. అధునాతన యుద్ధ విమాన సాంకేతిక పరిజ్ఞానం పోటీలో భారత్ వెనుకబడిపోతోందని హెచ్‌ఏఎల్ మాజీ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్ భదోరియా ఆందోళన వ్యక్తం చేశారు. "నా హృదయం ముక్కలైంది. డ్రాగన్ (చైనా) మనల్ని భారీ తేడాతో ఓడించింది" అంటూ ఆయన ఇటీవల ట్వీట్ చేశారు. భారతదేశం వద్ద ప్రస్తుతం ఉన్నవి నాలుగోతరం యుద్ధ విమానాలు. ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన రఫెల్ యుద్ధ విమానాలు కూడా ఆ తరానివే. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన తదుపరి తరం యుద్ధవిమానాల అభివృద్ధి దిశగా భారత్ రూ.15వేల కోట్లతో 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)' ప్రాజెక్టు చేపట్టినప్పటికీ.. అవి 2034కు గానీ మన వైమానిక దళానికి అందుబాటులోకి రావని అంచనా. ఈ క్రమంలోనే.. "జే-35లు పాక్‌కు అందుబాటులోకి వస్తే వచ్చే 12-14 సంవత్సరాలూ భారతదేశంపై పాకిస్థాన్‌కు పైచేయి లభిస్తుంది" అని పీఏఎఫ్ రిటైర్డ్ అధికారి జియా ఉల్ హక్ షమ్సీ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పాక్ వద్ద ఉన్న ఎఫ్-16, జే-10సిలకు జే-35లు తోడైతే పాక్ శక్తిసామర్థ్యాలు గణనీయంగా పెరుగుతాయని ఐఏఎఫ్ రిటైర్డ్ స్క్వాడ్రన్ లీడర్ విజయేందర్ కె.ఠాకూర్ హెచ్చరించారు.

ఏమిటీ ఐదోతరం?

స్టెల్త్.. అంటే శత్రు రాడార్లకు చిక్కకుండా ఉండగలగడం, మళ్లీ మళ్లీ ఇంధనం సరఫరా చేయాల్సిన అవసరం లేకుండానే గంటకు 1200కిలోమీటర్లకు పైబడిన వేగంతో ప్రయాణించగలగడం, వేగంగా ప్రయాణిస్తూనే సమతూకాన్ని కోల్పోకుండా ఎట్టినా తిరగగలిగే సత్తా.. ఇలా నిర్దిష్ట ఫీచర్లను కలిగి ఉన్న విమానాలను ఐదో తరం యుద్ధ విమానాలుగా పరిగణిస్తారు. అలాంటి కంబాట్ రెడీ ఫైటర్ జెట్లు ప్రస్తుతానికి అమెరికా, రష్యా, చైనా వద్ద మాత్రమే ఉన్నాయి. అమెరికా వద్ద ఎఫ్-22 ర్యాప్టర్ (2005లో అందుబాటులోకి వచ్చింది), ఎఫ్-35 లైట్నింగ్ 2 (2015) అనే రెండు రకాల ఐదో తరం ఫైటర్ జెట్లు ఉండగా.. చైనా వద్ద జే-20 (2017లో అందుబాటులోకి వచ్చింది), ఈ ఏడాది నవంబరులో అందుబాటులోకి వచ్చిన జే-35 ఉన్నాయి. తాజాగా చైనా ప్రదర్శించిన ఆరోతరం యుద్ధవిమానం దానికి అదనం. చైనా దాన్ని వైట్ ఎంపరర్/జే-36గా వ్యవహరిస్తోంది. ఇక రష్యా వద్ద ఉన్న ఎస్‌యు-57 యుద్ధవిమానం 2020లో అందుబాటులోకి వచ్చింది.

-సెంట్రల్ డెస్క్

చైనా దూకుడు..

అమెరికా, రష్యాతో పోలిస్తే ఈ యుద్ధవిమానాల తయారీలో చైనా చాలా దూకుడుగా ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇప్పటికే చైనా వద్ద 300కు పైగా జే-20లు ఉన్నాయి. 2030 నాటికి 800కు పైగా జే-20, 2030 నాటికి 1500 జే-35 యుద్ధవిమానాల తయారీని ఆ దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే.. 2035 నాటికి చైనా వద్ద ఒక్క ఐదో తరం యుద్ధ విమానాలే 2,300కు పైగా ఉండబోతున్నాయి. ఇటువైపు చైనా.. మరోవైపు ఆ దేశం నుంచి కొన్న ఐదో తరం యుద్ధ విమానాలతో పాకిస్థాన్.. పక్కలో బల్లేల్లా బలపడడం భారత్‌కు ఆందోళన కలిగించే విషయమే.

పీఎస్ఎల్వీ-సీ60 ప్రయోగం నేడే

సూళ్లూరుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో సరికొత్త అంతరిక్ష ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం ద్వారా సోమవారం స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పాడెక్స్) ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమైంది. దీని ద్వారా స్పేస్ డాకింగ్ టెక్నాలజీకి సంబంధించి 440 కిలోల బరువున్న స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి సోమవారం రాత్రి 9:58 గంటలకు పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. దీనికి సంబంధించిన కౌంట్‌డౌన్ ఆదివారం రాత్రి 8.58 గంటలకు మొదలైంది. 25 గంటల పాటు కొనసాగే ఈ కౌంట్‌డౌన్ పూర్తికాగానే షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే ప్రపంచంలో స్పేస్ డాకింగ్ టెక్నాలజీ కలిగిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. భూమికి 470 కిలోమీటర్ల దూరంలోని వృత్తాకార కక్ష్యలో స్పాడెక్స్ ఉపగ్రహాలు తిరుగుతూ పరిశోధనలు చేస్తాయి. విజయ పరీక్షణ నిమిత్తం ఇస్రో అధికారులు రాకెట్ నాలుగో దశలో 24 ఉపకరణాలను పంపిస్తున్నారు.

విజయానంద్‌కే పగ్గాలు

» తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంపిక

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్ నియమితులయ్యారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(పొలిటికల్) కార్యదర్శి ఎస్. సురేశ్‌కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ మంగళవారం(31వ తేదీ) పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్‌ను సీఎం చంద్రబాబు ఎంపిక చేశారు. అనంతరం ఆయన నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయి. కాగా, ఈ పోస్టుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లు వినిపించాయి. వీరిలో జి. సాయి ప్రసాద్ పేరు ప్రముఖంగా తెరమీదికి వచ్చింది. అయితే, ఆయనకు సర్వీసు ఇంకా ఉండడంతో విజయానంద్ వైపే చంద్రబాబు మొగ్గు చూపారు. కాగా, తనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విజయానంద్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్యేక పరిస్థితులు: చంద్రబాబు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకానికి సంబంధించిన జీవో జారీకి ముందు సీనియర్ ఐఏఎస్ అధికారులు సాయిప్రసాద్, విజయానంద్‌లతో ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఇద్దరూ సీనియర్లే అయినప్పటికీ ప్రత్యేక పరిస్థితుల్లో విజయానంద్‌కు సీఎస్‌గా అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇద్దరూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సీనియర్ ఐఏఎస్‌ల సహాయ, సహకారాలు ప్రభుత్వానికి చాలా అవసరమని వివరించారు.

పలు రంగాలపై పట్టు

తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. విజయానంద్ ఉమ్మడి కడప జిల్లాకు చెందినవారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన ఆయన ఉమ్మడి, విభజిత ఏపీలలో కీలక పోస్టుల్లో పనిచేశారు. విద్యుత్ సహా పలు రంగాల మంచి పట్టుసాధించారు. 1993లో తొలుత ఆదిలాబాద్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధుల్లో చేరిన ఆయన.. 1996లో రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేశారు. 1997-2007 మధ్య ఉమ్మడి ఏపీలో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం శ్రీకాకుళం, నల్లగొండ జిల్లాల్లో కలెక్టర్‌గా సేవలందించారు. 2016-2019 మధ్య ఏపీ ట్రాన్స్‌కో ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 2019-2021 మధ్య రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2022లో ఏపీ జెన్‌కో చైర్మన్‌గా ఉన్న ఆయన 2023లో ఏపీ ట్రాన్స్‌కో చైర్మన్, ఎండీగా సేవలందించారు. విద్యుత్ రంగంలో ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ రంగంపై అవగాహన ఉండడంతో పాటు విద్యుత్, ప్రసారం, పంపిణీపై అపారమైన అనుభవం సొంతం చేసుకున్నారు. ఏపీతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు ఎంతో దోహదపడ్డాయి.

హోంగార్డు పోస్టులంటూ నకిలీ నోటిఫికేషన్

» సృష్టించినోడి తాట తీస్తామన్న డీజీపీ

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ పోలీసు శాఖలో హోంగార్డు ఉద్యోగాల నియామకాలంటూ తన పేరిట సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నకిలీ లేఖపై డీజీపీ ద్వారకా తిరుమల రావు తీవ్రంగా స్పందించారు. దాన్ని సృష్టించిన వ్యక్తి ఎక్కడున్నా అరెస్టు చేసి తాట తీస్తామని హెచ్చరించారు. ఆ లేఖను ఎవరైనా సోషల్ మీడియాలో పంచుకున్నా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డీజీపీ కార్యాలయం, పోలీసు హెడ్ క్వార్టర్స్, విజయవాడ' పేరుతో లెటర్ సృష్టించారు. అందులో డీజీపీ ద్వారకా తిరుమల రావు పేరుతో నిరుద్యోగులకు ఒక ఆఫర్ ఇచ్చారు. రాష్ట్ర సివిల్ పోలీసు విభాగంలో సంగీతం బ్యాండ్ వాయించేందుకు హోంగార్డులుగా అభ్యర్థులను 2025 జనవరి 10న ప్లేస్‌మెంట్ నిర్వహించి ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ లేఖ శనివారం డీజీపీ దృష్టికి రావడంతో నకిలీ ఆఫర్ లెటర్ సృష్టించిన వారిని గుర్తించాలని ఆదేశించారు.

రన్‌వేపై దూసుకెళ్లి.. రక్షణ గోడను ఢీకొట్టి..

పేలిపోయిన విమానం!

179 మంది దుర్మరణం

» దక్షిణ కొరియాలో ఘోర ప్రమాదం

» ల్యాండింగ్ గేర్ విఫలంతోనే ప్రమాదం!



ప్రమాదానికి ముందు రన్‌వేపై విమానం

గోడను ఢీకొని పేలిపోయిన విమానం

సియోల్, డిసెంబరు 29: దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రాజధాని సియోల్‌కు 290 కిలోమీటర్ల దూరంలోని మువాన్ నగరంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి బయల్దేరిన జెజు ఎయిర్‌కు చెందిన 7సీ2216 నంబర్ బోయింగ్ 737-800 విమానం మువాన్ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతూ అదుపుతప్పింది. ఈ విమానం 15 ఏళ్ల నాటిదని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల సమయంలో రన్‌వే పైనుంచి అతివేగంగా దూసుకెళ్లి, రక్షణ గోడను ఢీకొని మంటల్లో చిక్కుకొని పేలిపోయింది. విమానంలో 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో 179 మంది మంటల్లో చిక్కుకొని, మరణించినట్లు వెల్లడించారు. ఇద్దరు సిబ్బందిని కాపాడారు. ప్రమాదానికి గల కారణాలపై వివిధ కోణాల్లో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విమానం ఇంజిన్‌ను పక్షి ఢీకొనడం, ల్యాండింగ్ గేర్‌లో సమస్య ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ విమానం అప్పటికే ల్యాండింగ్‌కు యత్నించి విఫలమైందని అధికారులు చెబుతున్నారు. నేలపైకి దిగిన తర్వాత, రన్‌వే పై వేగాన్ని నియంత్రించుకోవడంలో విఫలమైనట్లు చెప్పారు. విమానం నేలపైకి దిగే సమయంలో ల్యాండింగ్ గేర్, టైర్లు పనిచేయడం లేదని కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. ఏవైనా పక్షిని ఢీకొనడం వల్లే అవి పనిచేయక పోయి ఉండొచ్చన్న అనుమానాలున్నాయి. వీటిని బలపర్చేలా విమానం ల్యాండింగ్ సమయంలో ఓ ఇంజిన్ నుంచి నిప్పులు వచ్చిన దృశ్యాలను స్థానిక టీవీ చానల్ ప్రసారం చేసింది. ప్రమాద వీడియోలో కూడా విమానం రన్‌వేపై అదుపుతప్పి దూసుకెళుతూ గోడను ఢీకొనే సమయానికి ల్యాండింగ్ గేర్ తెరుచుకోకుండా ఉన్నట్లు భావిస్తున్నారు. విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ టవర్ నుంచి సందేశం వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం ఉందని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

జెజు ఎయిర్ క్షమాపణలు

ఈ ప్రమాదం పట్ల థాయ్‌లాండ్‌కు చెందిన జెజు ఎయిర్ సంస్థ క్షమాపణలు తెలిపింది. బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని పేర్కొంది. దక్షిణ కొరియాలో 1997లో జరిగిన విమాన ప్రమాదంలో 228 మంది మృతి చెందారు. ఆ తర్వాత ఇదే అతిపెద్ద ప్రమాదం కావడం గమనార్హం. కాగా, ఈ విమాన ప్రమాదంపై దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ స్పందించారు. తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నా చివరి మాటలు చెప్పనా?

మువాన్‌లో విమాన ప్రమాదం జరగడానికి కొన్ని క్షణాల ముందు ఓ ప్రయాణికుడు తన బంధువుకు పంపిన మెసేజ్ వైరల్‌గా మారింది. విమానం రెక్కలో పక్షి ఇరుక్కుందని మెసేజ్‌లో తెలిపారు. తర్వాత 'నా చివరి మాటలు చెప్పనా' అని ఉన్నట్లు ఓ వార్తా సంస్థ తెలిపింది.

మరో రెండు విమానాలకు తప్పిన ప్రమాదం



పక్కకు ఒరిగిన ఎయిర్ కెనడా విమానం ఇదే

న్యూఢిల్లీ, డిసెంబరు 29: దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం జరిగిన కొన్ని గంటల తర్వాత మరో రెండు విమానాలు వేర్వేరు ప్రాంతాల్లో అదే తరహా ప్రమాదాలకు గురై తృటిలో తప్పించుకున్నాయి. ఎయిర్ కెనడాకు చెందిన ఏసీ 2259 విమానం కెనడాలోని హాలీఫాక్స్ విమానాశ్రయంలో శనివారం రాత్రి ప్రమాదానికి గురైంది. సెయింట్ జాన్స్ నగరం నుంచి వచ్చిన ఆ విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో ల్యాండింగ్ గేర్ విరిగిపోవడంతో అదుపు తప్పి, ఓ పక్కకు ఒరిగిపోయి రన్‌వేపై కొంత దూరం ప్రయాణించింది. ఈ క్రమంలో విమానం ఎడమ వైపు రెక్క రన్‌వేకు రాసుకోవడంతో మంటలు చెలరేగాయి. అయితే, పైలట్ విమానాన్ని నియంత్రించి ఆపగలగడంతో పెను ప్రమాదం తప్పింది. విమానం ఆగిన వెంటనే ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరోవైపు, రాయల్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737-800 విమానం ఒకటి నార్వేలోని టోర్ప్ శాండిఫ్జోర్డ్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యే క్రమంలో అదుపు తప్పి జారింది. కాగా, నార్వేలోని ఓస్లో నుంచి ఆమ్‌స్టర్‌డామ్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయ్యాక.. విమానం హైడ్రాలిక్ వ్యవస్థ విఫలమైనట్లు గుర్తించారు. విమానాన్ని అత్యవసరంగా టోర్ప్‌కు దారి మళ్లించారు. టోర్ప్‌లో ల్యాండ్ అయ్యే క్రమంలో అదుపు తప్పి రన్‌వేపై జారిన విమానం.. రన్‌వేను ఆనుకుని పెంచిన గడ్డిలోకి వెళ్లి ఆగింది. ఆ సమయంలో విమానంలో 182 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా, ఐదుగురు అమెరికా పౌరులతో నేపాల్‌లోని లుక్లా నుంచి కాఠ్మండుకు బయలుదేరిన ఓ ప్రైవేట్ హెలికాప్టర్‌ను ఆదివారం ఉదయం 11 గంటలప్పుడు ఓ పక్షి ఢీకొట్టింది. దీంతో కాఠ్మండుకు 50కిమీల దూరంలో ఉన్న బనేపా ప్రాంతంలో హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

మా విమానాన్ని కూల్చింది రష్యానే

అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం రష్యా చేసిన దాడి వల్లే కజకిస్థాన్‌లో కూలిపోయిందని అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్ ఆదివారం ఆరోపించారు. బుధవారం జరిగిన ఈ విమాన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లను ఎదుర్కొనేందుకు రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు చేసిన ప్రయత్నంలో భాగంగా తమ విమానం కూలిందని అలియేవ్ పేర్కొన్నారు. అయితే, ఈ విమాన ప్రమాదంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ అజర్‌బైజాన్ అధ్యక్షుడికి శనివారమే క్షమాపణ చెప్పారు.

లోకం తీరు



డిసెంబరులో 6 ప్రమాదాలు..

236 మంది మృతి

ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ప్రయాణికుల విమానాలు ప్రమాదాలకు గురవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ నెల 25న అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కజకిస్థాన్‌లో కూలిపోవడంతో 38 మంది చనిపోయారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలోనే అజర్‌బైజాన్ విమానం కూలింది. ఈ ఏడాది జనవరిలో రష్యా మిలిటరీ విమానం కూలి 74 మంది మరణించారు. ఉక్రెయిన్ దళాలే తమ విమానాన్ని కూల్చివేసినట్లు రష్యా ఆరోపించింది. మరోవైపు డిసెంబరు నెల విమాన ప్రయాణికులకు పీడకలగా మిగిలిపోనుంది. ఈ నెలలోనే 6 విమానాలు కూలిపోయాయి. 236 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం దక్షిణ కొరియాలో జెజు విమానం కూలిన ఘటనలో 179 మంది మరణించారు. ఈ నెల 22న బ్రెజిల్‌లో విమానం కూలి 10 మంది మరణించారు. అదేరోజు పపువా న్యూగినియాలో విమానం కూలి ఐదుగురు చనిపోయారు. అర్జెంటీనాలో ఈ నెల 18న విమానం కూలి ఇద్దరు పైలట్లు మరణించారు. హవాయిలో ఈ నెల 17న విమానం కూలి ఇద్దరు పైలట్లు చనిపోయారు.

యమునలో మన్మోహన్ అస్థికలు

న్యూఢిల్లీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అస్థికలను ఆయన కుటుంబసభ్యులు ఆదివారం యమునా నదిలో నిమజ్జనం చేశారు. అంత్యక్రియలు జరిగిన నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఉదయం అస్థికలను సేకరించి ఆపై మజ్ను కా టిలా గురుద్వారా సమీపంలో గల యమునా నది ఘాట్‌లో సిక్కు సంప్రదాయాల ప్రకారం నిమజ్జనం చేశారు. మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, ముగ్గురు కుమార్తెలు ఉపిందర్‌సింగ్, దమన్‌సింగ్, అమృత్‌సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మళ్లీ కయ్యానికి కాలు దువ్వుతున్న చైనా

» భారత సరిహద్దులో 2 గ్రామాల నిర్మాణం

న్యూఢిల్లీ, డిసెంబరు 29: చైనా మరోసారి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోంది. తాజాగా సరిహద్దులో రెండు పెద్ద గ్రామాలను నిర్మించింది. వాటిలో ఒకటి అక్సాయ్ చిన్‌లో భారత భూభాగాన్ని ఆక్రమించిన ప్రాంతంలో నిర్మించింది. భారత సరిహద్దుల్లో చైనా కొత్తగా హియాన్, హెకాంగ్ అనే రెండు కొత్త గ్రామాలను నిర్మించినట్టు చైనా ప్రభుత్వ అధికార వార్తాసంస్థ జిన్హువా వారం క్రితం ప్రకటించింది. ఈ గ్రామాల పరిపాలన కేంద్రాల్లో నిర్మించిన టౌన్‌షిప్‌లకు హాంగ్లియా, సెయిదుల అనే పేర్లు పెట్టారు. అక్సాయ్‌చిన్‌లో నిర్మించిన గ్రామం పేరు హియాన్. తాజా పరిణామం భారత ప్రభుత్వం దృష్టికి కూడా వచ్చింది. అయితే, ఇప్పటి వరకు దీనిపై భారత్ అధికారికంగా స్పందించలేదు. కాగా, సరిహద్దు వివాదం పరిష్కారానికి ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక చర్చలపై చైనా ఏకపక్షంగా చేస్తున్న ఇటువంటి చర్యలు ప్రభావం చూపుతాయని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద టిబెటన్ బౌద్ధుల స్టడీ సెంటర్ 'లరంగ్ గార్ బుద్ధిస్ట్ అకాడమీ' వద్ద సుమారు 400 దళాలను, అనేక హెలికాప్టర్లను చైనా మోహరించింది. మతపరమైన కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టేందుకే ఈ మోహరింపు చేపట్టినట్లు సీటీఏ(సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్) శుక్రవారం తెలిపింది. అలాగే, సెర్తార్ ప్రాంతంలోని బౌద్ధ మఠం వద్ద వచ్చే ఏడాది కఠిన నిబంధనలు అమలుకు చైనా ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే అక్కడున్న చైనా విద్యార్థులను ఆ ప్రాంతం వదిలి వెళ్లాలని ఆదేశించింది. 1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించింది.

గంటకు 450 కిలోమీటర్ల వేగం

» సరికొత్త బుల్లెట్ రైలును పరీక్షించిన చైనా

బీజింగ్, డిసెంబరు 29: గంటకు గరిష్ఠంగా 450కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల బుల్లెట్ రైలును చైనా పరీక్షించింది. ఈ రైలుకు సీఆర్ 450 అని పేరు పెట్టారు. రెండు మూడు నెలల్లో ఇది ప్రయాణ సేవలకు అందుబాటులోకి రానుంది. తద్వారా ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా రికార్డు సృష్టించనుంది. ఈ రైలు సగటున గంటకు 400కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. బుధవారం తియాన్‌జిన్, బీజింగ్ నగరాల మధ్య ఈ రైలును పరీక్షించారు. అంతకుముందు నవంబరులోనూ దీన్ని పరీక్షించారు. అప్పుడే ఈ రైలు పట్టాలపై వెళ్తున్న వీడియోలు లీక్ అయ్యాయి.


బీజేపీ చీఫ్‌గా దళితుడు?

» దక్షిణాది నుంచి యువనేతకు చాన్స్!

న్యూఢిల్లీ, డిసెంబరు 29: బీజేపీ సంస్థాగత ఎన్నికలు పూర్తయిన తర్వాత జనవరి లేదా ఫిబ్రవరి చివరి నాటికి ఆ పార్టీకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ప్రస్తుత బీజేపీ చీఫ్ జేపీ నడ్డా స్థానంలో దళిత వర్గానికి చెందిన యువనేతను ఎంపిక చేయవచ్చని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు మూడు కారణాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ఇటీవల అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడం, కాంగ్రెస్ అధ్యక్షుడిగా దళిత వర్గానికి చెందిన ఖర్గే ఉండటం, బీజేపీ దళితులకు వ్యతిరేకమని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దళితుడికి పార్టీ పగ్గాలు అప్పగించాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన నేతను బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమించే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి.

అక్కినేనితో తెలుగు సినిమా కొత్త శిఖరాలకు..

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారని ప్రధాని మోదీ కొనియాడారు. తన కళా వారసత్వంతో టాలీవుడ్‌పై చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఆయన సినిమాల్లో భారతీయ సంప్రదాయాలు, విలువలు ఉట్టిపడేవని పేర్కొన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్' 117వ ఎపిసోడ్‌లో భాగంగా ఆయన పలు అంశాలపై ప్రసంగించారు. అక్కినేనితో పాటు రాజ్‌కపూర్, మొహమ్మద్ రఫీ, తపన్ సిన్హా భారతీయ సినిమాకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చారని ప్రశంసించారు. వీరి జీవితాలు యావత్ సినీ పరిశ్రమకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు. వీరి సినిమాలు సామాజిక స్పృహ, జాతీయ ఐక్యత సందేశాన్ని కలిగి ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలు భారతీయ చలనచిత్ర రంగంవైపు చూస్తున్నాయని అన్నారు. వచ్చే ఏడాది తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (డబ్ల్యూఏవీఈఎస్)ను మన దేశంలో నిర్వహించనున్నట్లు ప్రధాని తెలిపారు. ప్రపంచ కంటెంట్ సృష్టి కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దే దిశగా ఈ సదస్సు ఒక ముఖ్యమైన అడుగుగా మోదీ అభివర్ణించారు.

ఐక్యతా సందేశం.. మహాకుంభ మేళా

ఉత్తరప్రదేశ్‌లో జనవరి 13 నుంచి జరగనున్న మహాకుంభ మేళా ఐక్యతా సందేశాన్ని ఇస్తుందని మోదీ అన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హాజరయ్యే ఈ కార్యక్రమం భిన్నత్వంలో ఏకత్వానికి చక్కటి నిదర్శనమన్నారు. ఈసారి డిజిటల్ మహాకుంభ్‌ను దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు వీక్షిస్తారని, కుంభమేళాలో తొలిసారి ఏఐ చాట్‌బాట్ సేవలు వినియోగించనున్నట్లు తెలిపారు. చాట్ బాట్‌లో కుంభ్‌కు సంబంధించిన అన్ని రకాల సమాచారం 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆమోదించిన టూర్ ప్యాకేజీలు, వసతి, హోమ్‌స్టే గురించి భక్తులకు వారి మొబైల్ ఫోన్లకు సమాచారం అందించనున్నట్లు మోదీ వివరించారు. కాగా, 2015-23 మధ్య కాలంలో దేశంలో మలేరియా కేసులు, మరణాల సంఖ్య 80% తగ్గిందని డబ్ల్యూహెచ్‌వో నివేదిక పేర్కొందని, ప్రధాని అన్నారు. భారత్‌లో కేన్సర్ చికిత్సను సకాలంలో ప్రారంభించే అవకాశాలు పెరిగాయని లాన్సెట్ మెడికల్ జర్నల్‌లో అధ్యయనం ప్రచురితమైందని గుర్తుచేస్తూ, ఇది దేశ ఆరోగ్య రంగంలో మరో మైలురాయి అని మోదీ అన్నారు. 90% మంది కేన్సర్ రోగులకు సకాలంలో చికిత్స అందించడంలో ఆయుష్మాన్ భారత్ పథకం కీలక పాత్ర పోషించిందని ప్రధాని తెలిపారు.

మహా కుంభమేళాకు.. రూ. 7,500 కోట్లు

న్యూఢిల్లీ/హైదరాబాద్(ఆంధ్రజ్యోతి) డిసెంబరు 29: పన్నెండేళ్లకోసారి జరిగే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. 45 రోజులపాటు ఉత్సవంలా సాగే ఈ కార్యక్రమం వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. దీనికోసం ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మందికిపైగా వస్తారని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీన్ని మనసులో పెట్టుకొని భారీ ప్రణాళికలతో సిద్ధమవుతోంది. భద్రత విషయంలో రాజీ పడకుండా 50 వేల మంది సిబ్బందిని మోహరించనున్నారు. నిరంతర నిఘా కోసం తొలిసారిగా నీటిలోపల 100 మీటర్ల లోతులోనూ వస్తువులను సైతం గుర్తించే సామర్థ్యం కలిగిన అండర్ వాటర్ (జలంతర్) డ్రోన్లను ఉపయోగించనున్నారు. కుంభమేళా కోసం కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన 2,700 సీసీ కెమెరాలతో 24 గంటలు రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించేలా అత్యాధునిక మల్టీ డిజాస్టర్ రెస్పాన్స్ వాహనాలను అందుబాటులో ఉంచనున్నారు. మరోవైపు, నేత్ర కుంభ్ శిబిరం ద్వారా 5 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 3 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహా కుంభమేళాకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక అనుభూతిని అందించేందుకు యూపీ ప్రభుత్వం 2వేలకు పైగా డ్రోన్లతో భారీ డ్రోన్ షోను కూడా ఏర్పాటు చేస్తోంది. మరోవైపు, కుంభమేళా యాత్రికుల కోసం మరో 12 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. 2025 జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 22 తేదీల్లో తిరుపతి- బనారస్ (07107), ఫిబ్రవరి 20, 10, 17, 24 తేదీల్లో బనారస్- విజయవాడ (07108) రైళ్లను నడుపనున్నారు.

142 ఏళ్లలో ఎంత మార్పు..!

మహా కుంభమేళాను ఘనంగా నిర్వహించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.7,500 కోట్లు ఖర్చుచేసి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ కుంభమేళాకు 40 కోట్ల మందికిపైగా వస్తారని అంచనా వేస్తోంది. 1882లో భారతదేశ జనాభా 22.5 కోట్లు. అప్పట్లోనే మౌని అమావాస్య నాడు 8 లక్షల మంది పవిత్ర సంగమంలో స్నానమాచరించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అప్పట్లో ఈ ఏర్పాట్ల కోసం ఖర్చు చేసింది రూ.20,288 మాత్రమే. ఇప్పుడు ఏకంగా రూ.7,500 కోట్లతో ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం.



గంగ, యమున, సరస్వతి సంగమం వద్ద ఏర్పాట్లు

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు..

43 మంది దుర్మరణం

టెల్‌అవీవ్, డిసెంబరు 29: గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు జరిపింది. వేర్వేరు ఘటనల్లో 43 మంది దుర్మరణం పాలయ్యారు. ఉత్తర గాజాలోని హమాస్ చిట్టచివరి కమాండ్ కంట్రోల్‌గా భావిస్తున్న కమల్ అద్వాన్ ఆస్పత్రిపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) మెరుపుదాడి చేసింది. 20 మంది హమాస్ మిలిటెంట్లను హతమార్చి, వైద్యులు, వైద్య సిబ్బంది సహా 240 మందిని నిర్బంధించింది. బందీల్లో ఆస్పత్రి డైరెక్టర్ అబూ సాఫియా కూడా ఉన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది కళ్లకు గంతలు కట్టి, ఆస్పత్రి ప్రాంగణంలో వేడిగా కూర్చోబెట్టడం, ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వారిని అర్ధనగ్నంగా ఒకచోట నిలబెట్టి రెక్కలు విరిచికట్టి కూర్చోబెట్టిన వీడియోలు, ఫొటోలను ఇజ్రాయెల్ వార్తా సంస్థ 'యెడియోత్ అహ్రోనోత్' ఆదివారం ప్రచురించింది. హమాస్‌కు చెందిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్ ఆ ఆస్పత్రిలోనే ఉందని, అక్కడి నుంచే ఇజ్రాయెల్ బలగాలపై పోరుకు వ్యూహ రచనలు జరుగుతున్నాయని ఐడీఎఫ్ ఆరోపించింది. "తాజాగా పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో.. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసిన వారు కూడా ఉన్నారు. పలువురు బందీలను షకీద్ బెటాలియన్‌కు చెందిన హమాస్ ఫైటర్లుగా గుర్తించాం" అని ఐడీఎఫ్ తన అధికారిక టెలిగ్రామ్ చానల్‌లో ప్రకటించింది. అదే సమయంలో ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిజమైన రోగులను ఐడీఎఫ్ 401 బ్రిగేడ్ కమాండర్లు ఇండోనేషియా ఆస్పత్రికి సురక్షితంగా తరలించినట్లు పేర్కొంది. ఈ అమానుషాలను ఐడీఎఫ్ నిర్ధారించిందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఈ ఘటనపై డబ్ల్యూహెచ్‌వో ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు, ఉత్తర గాజాలోని జబాలియా, హోసన్, లాహియాల్లో ఆదివారం కూడా ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి. నుసేరియత్ శరణార్థి శిబిరంపై జరిపిన దాడిలో 9 మంది మృతిచెందారని పాలస్తీనా న్యూస్ ఏజెన్సీ 'వఫా' వెల్లడించింది. జెయితూ హమాస్ శిబిరంలో ఏడుగురు పాలస్తీనియులు, సెంట్రల్ గాజాలోని అల్-ఫహ ఆస్పత్రిపై ఐడీఎఫ్ జరిపిన షెల్లింగ్‌లో ఏడుగురు మృతిచెందినట్లు తెలిపింది. అటు.. సిరియాలోని డమాస్కస్‌పై ఇజ్రాయెల్ జరిపిన డ్రోన్ దాడుల్లో ఆరుగురు మృతిచెందారు.



తిరుమల ఆలయం వద్ద జస్టిస్ ఎన్వీ రమణ

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల/పిట్టలవానిపాలెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆదివారం రాత్రి నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీబగళాముఖికి ప్రత్యేక పూజలు

బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలులోని శ్రీబగళాముఖి అమ్మవారికి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు ఆదివారం పూజలు జరిపారు.



తిరుమల ఆలయం ముందు శ్రీనివాసశర్మ, ద్వారకా తిరుమలరావు, చల్లా శ్రీనివాసశెట్టి

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఛైర్మన్ చల్లా శ్రీనివాసశెట్టి, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ విజయభారతి, రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ అడ్మిన్ వీఎస్ఎస్ శ్రీనివాసశర్మ కూడా తిరుమలేశుని దర్శించుకున్నారు.



శ్రీశైలంలో దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కిటకిటలాడిన శ్రీగిరి

శ్రీశైలం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సంవత్సరం ముగింపు రోజులు కావడంతో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వేల సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు, ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. స్వామి, అమ్మవార్ల దర్శనానికి 4 గంటలపైగా సమయం పట్టింది.

రాష్ట్రంలో నాలుగు స్ట్రీట్ ఫుడ్ హబ్స్

▸ దేశవ్యాప్తంగా 100.. కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తిరుపతి, కడప, విజయవాడ, విశాఖ జిల్లాల్లో స్ట్రీట్ ఫుడ్ హబ్స్ తీసుకొస్తున్నట్లు కేంద్ర ఆయుష్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. ప్రజలు తీసుకునే ఆహారం శుచి, శుభ్రత కలిగి నాణ్యతగా ఉండేలా దేశ వ్యాప్తంగా వంద స్ట్రీట్‌ఫుడ్ హబ్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన గుర్తుచేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ), రాష్ట్ర ఆహారభద్రత ప్రమాణాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆహార భద్రత ప్రమాణాలపై తినుబండారాల చిరువ్యాపారులకు ఆదివారం శిక్షణ నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్ట్రీట్‌ఫుడ్ వెండర్స్ ఆన్‌లైన్‌లో ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. సౌత్ రీజనల్ డైరెక్టర్ పంచమ్, రాష్ట్ర జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పందేలు గ్రామీణ సంస్కృతిలో భాగం: రఘురామ

రంగంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలు, కోడి పందేలు మన సంప్రదాయాలని, అవి గ్రామీణ సంస్కృతిలో భాగమని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. పందేలు లేకపోతే నాణ్యమైన పశుపక్ష్యాదుల సంపద అంతరించిపోతుందన్నారు. చట్టాన్ని అతిక్రమించకుండా ఇలాంటి పందేలను ఆదరించి పోషించుకోవాలని సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు వద్ద ఆదివారం గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలకు ఆయన విచ్చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

గొర్రెపాటికి తుది వీడ్కోలు



గొర్రెపాటి మాధవరావు అంతిమయాత్రలో పాల్గొన్న మానవ హక్కుల వేదిక, సీపీఐఎంఎల్ కార్యకర్తలు

సుభాష్ నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల ఉద్యమ నేత గొర్రెపాటి మాధవరావు అంతిమయాత్ర ఆదివారం జరిగింది. నిజామాబాద్‌లోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయం ఎస్ఆర్ భవన్ నుంచి ప్రధాన వీధుల గుండా వైద్య కళాశాల వరకు కొనసాగింది. అనంతరం కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని విద్యార్థుల పరిశోధనార్థం వైద్య కళాశాలకు అప్పగించారు. అంతిమయాత్రలో సీపీఐఎంఎల్, మానవ హక్కుల వేదిక, వామపక్షాల నాయకులు పాల్గొని గొర్రెపాటికి తుది వీడ్కోలు పలికారు.

విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు

▸ క్రియ పిల్లల పండుగలో డాక్టర్ జయప్రకాశ్ నారాయణ

సర్పవరం జంక్షన్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): "విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. అప్పుడే సమాజంలో ప్రతిభ వికసిస్తుంది" అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, రిటైర్డు ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. ఆదివారం కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీల క్రియ పిల్లల పండుగ ముగింపు వేడుకలో ఆయన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణకు చెందిన సుమారు 11 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్రియ సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు పాల్గొన్నారు.

గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం

▸ ఆలస్యంగా వెలుగులోకి.. నిందితుల్లో ఒకరి అరెస్టు

పాడేరు/జి.మాడుగుల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండలంలోని ఓ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన బాలికపై ముగ్గురు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై జి.మాడుగుల పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలివీ.. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలిక ఈ నెల 25న అదృశ్యమైంది. తల్లిదండ్రులు ఆమె కోసం గాలించి 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అదే రోజు సాయంత్రం పాడేరులో బాలికను గుర్తించారు. విచారణలో జి.మాడుగుల మండలంలో వేర్వేరు గ్రామాలకు చెందిన కొర్రా మల్లీశ్వరరావు(22), వంతాల సన్యాసిరావు(24)తో పాటు 16 ఏళ్ల బాలుడు మాయమాటలు చెప్పి పాడేరు తీసుకెళ్లి తనపై అత్యాచారానికి పాల్పడినట్టు చెప్పింది. అనంతరం పోలీసులు బాలికను తల్లిదండ్రులకు అప్పగించి, నిందితులపై పోక్సో కేసునమోదు చేశారు. వీరిలో వంతాల సన్యాసిరావును అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ బి.శ్రీనివాస్ తెలిపారు.



కాగడాల తుపాకులతో నావికుల కవాతు

జాతీయ పతాకంతో స్కై డైవింగ్ చేస్తున్న నావికుడు

రెండో రోజూ అబ్బురపరిచిన నేవీ రిహార్సల్స్

విశాఖపట్నం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): యుద్ధ వాతావరణాన్ని తలపించేలా సముద్రంలో, గగనతలంలో నేవీ సిబ్బంది చేసిన విన్యాసాల రిహార్సల్స్ వరుసగా రెండో రోజూ అబ్బురపరిచాయి. జనవరి నాలుగో తేదీన విశాఖ సాగర తీరంలో నావికాదళం సాహస విన్యాసాలను ప్రదర్శించనుంది. ఇందులో భాగంగా తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో శనివారం నుంచి సాగర తీరంలో రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రజలు భారీగా తరలివచ్చి నేవీ విన్యాసాల రిహార్సల్స్‌ను సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు.

వివాదాల జైళ్లు

ఖైదీలకు లాఠీ దెబ్బలు.. సిబ్బందికి వేధింపులు

▸ శాఖలో అవినీతి'కిరణం'పై తీవ్ర ఆరోపణలు

▸ రాజమండ్రి జైలులో ఖైదీ పట్ల రాక్షసత్వం

▸ విశాఖ జైలులో ఇద్దరు వార్డర్ల దుస్తులు విప్పించి ఖైదీల ముందే అవమానించిన ఓ అధికారి

▸ సిబ్బంది ఆందోళన.. మద్దతుగా కుటుంబ సభ్యులు

▸ ఆదివారం 66 మంది వార్డర్లకు అటాచ్‌మెంట్లు

▸ రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో సిబ్బంది నిరసనలు

▸ సరిదిద్దాల్సిన ఉన్నతాధికారులు మీనమేషాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

క్షణికావేశంలోనో, తెలిసీ తెలియకో తప్పులు చేసి జైలుపాలైన ఖైదీలను సంస్కరించాల్సిన కారాగారాలు వివాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఖైదీల్లో పరివర్తన తీసుకురావాల్సిన అధికారుల్లో కొందరు వారికి చిత్రహింసలు పెడుతూ జీవితంపైనే విరక్తి కలిగేలా చేస్తున్నారు. జైళ్లలో కొందరు అధికారుల పైశాచికత్వం ఇలా ఉండగా... ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అధికారుల గ్రూపు తగాదాలు, భారీగా సిబ్బంది కొరతతో పాటు పూర్తిస్థాయి డీజీ లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో జైళ్ల బాగోగుల గురించి హోంశాఖ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గత కొన్ని రోజులుగా విశాఖపట్నం, విజయవాడ, కడప, రాజమహేంద్రవరం జైళ్లలో జరిగిన ఘటనలు ఆ శాఖ పనితీరుపై చర్చకు దారితీశాయి. గతంలో వైసీపీకి అనుకూలంగా పనిచేసిన ఓ అధికారిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఓ అధికారి మామూళ్ల దాహానికి తాము బలయ్యామని విశాఖ సెంట్రల్ జైలులో వార్డర్లు గగ్గోలు పెడుతున్నారు. తమ వాళ్లు ఏ తప్పు చేశారని ఇంతలా వేధిస్తున్నారంటూ వార్డర్ల కుటుంబాల్లోని మహిళలు, పిల్లలు రాత్రి పొద్దు పోయేదాకా ధర్నాకు దిగడం జైళ్ల శాఖ గుట్టు రోడ్డున పడేసింది. ఈ తప్పును సరిదిద్దాల్సిన ఉన్నతాధికారులు ఆదివారం ఇచ్చిన అటాచ్‌మెంట్ ఆదేశాలు ఒక్కసారిగా రాష్ట్రంలోని జైళ్లలో సిబ్బంది నిరసన జ్వాలలకు కారణమయ్యాయి.

మామూళ్లు ఇవ్వలేదని...

రాష్ట్రంలో నాలుగు సెంట్రల్ జైళ్లు, 8 జిల్లా జైళ్లు, ఇతర సబ్ జైళ్లు కలిపి మొత్తం 129కి గానూ 79 జైళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వాటిలో 8 వేల మంది వరకూ రిమాండ్, శిక్షపడ్డ ఖైదీలు ఉన్నారు. వివిధ నేరాల్లో శిక్షలు పడిన ఖైదీలను సంస్కరించి సాధారణ జనజీవన స్రవంతిలో కలిసేలా చేయడమే జైళ్ల శాఖ పని. రాష్ట్రంలోని పెద్ద జైళ్లలో ఒకటైన విశాఖ సెంట్రల్ జైలులో సామర్థ్యానికి మించి ఖైదీలున్నారు. అక్కడి ఖైదీల పొట్టకొట్టి జైలు నిర్వహణలో భారీగా డబ్బులు మిగిలించి, ప్రతి నెలా మామూళ్ల కోసం ఇండెంట్ పెట్టిన ఓ ఉన్నతాధికారి అంచనాలను అందుకోలేకపోయిన అధికారిపై అభియోగాలు సృష్టించి తప్పించారు. జైళ్ల శాఖలో జూనియర్ అయిన ఒక అధికారిని తెచ్చి అక్కడ నియమించారు. అనంతపురం, కడప, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, విశాఖలో సీనియర్ అడిషనల్ ఎస్పీలుండగా జూనియర్‌ను తీసుకురావడం వెనుక ఉద్దేశం ఇదేనని జైళ్ల శాఖలో చర్చ జరుగుతోంది.

ఇంట్లో సరిగా పనిచేయలేదని..

ఖైదీలను అత్యంత దారుణంగా హింసించి జీవితాంతం జీవచ్ఛవాలుగా మార్చే అలవాటున్న ఒక అధికారి ఇటీవల రాజమండ్రి సెంట్రల్ జైలులో ఓ ఖైదీ పట్ల వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. ఓపెన్ ఎయిర్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఒక ఖైదీని సార్ తన ఇంట్లో పనికి వాడుకొంటున్నారు. ఆ ఖైదీ పనులు సరిగా చేయడం లేదంటూ లాఠీ తీసుకుని చితకబాదారు. గతంలో నెల్లూరు జైలు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సమయంలో తన ఇంట్లో పనిచేస్తున్న ఒక ఖైదీ సరిగా చేయడం లేదంటూ చిత్రహింసలు పెట్టారు. లాకప్‌లోకి లాక్కొచ్చి దుస్తులు విప్పేసి మల ద్వారంలోకి కర్ర చొప్పించినట్టు ఆరోపణలు వచ్చాయి. గతంలో కూడా ఆయనపై తీవ్ర ఆరోపణలున్నాయి. రాయలసీమకు చెందిన ఈ అధికారి వైసీపీ ప్రభుత్వంలో ఒక మంత్రికి సమీప బంధువు. అప్పట్లో వివేకా హత్యకేసు నిందితులు కడప జైలులో ఉండటంతో వైసీపీ ప్రభుత్వం ఆయన్ను వాడుకుంది. నిందితులను తెలంగాణ జైలుకు తరలించాక ఎన్నికల ముందు రాజమండ్రికి బదిలీ చేసింది. ఆ వార్త తెలిసిన వెంటనే సిబ్బంది యూనిఫామ్‌తోనే కడప జైలు ముందు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుని, స్వీట్లు తినిపించుకున్నారు.

విశాఖ జైలులోకి గంజాయి, సెల్‌ఫోన్లు

విశాఖ సెంట్రల్ జైలులో 900 మంది ఖైదీలకు మాత్రమే చోటుంది. అయితే అధికారులు 55 శాతం అదనంగా కుక్కేశారు. అక్కడ రాష్ట్రంలోనే ఎక్కువ మంది ఖైదీలు (2వేలు) ఉన్నారు. ఇతర జైళ్లకు పంపేందుకు కనీస ప్రయత్నాలు చేయట్లేదు. కేంద్ర కారాగారంలోకి సిబ్బంది టిఫిన్ క్యారియర్లలో గంజాయి తీసుకెళుతున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు బ్యారక్‌లలోకి అనధికారికంగా సెల్‌ఫోన్లు చేరుతున్నాయని గుర్తించారు. జైలు సూపరింటెండెంట్‌తో పాటు మరో అధికారిని సస్పెండ్ చేశారు. వర్గపోరు, ఆర్థిక వ్యవహారాలే ఆ ఇద్దరు అధికారుల సస్పెన్షన్‌కు కారణమని జైళ్ల శాఖ సిబ్బంది చర్చించుకొంటున్నారు. ఇదే సమయంలో జైలులోకి వార్డర్లు భోజనం క్యారియర్లు తీసుకెళ్లనివ్వకుండా కొత్తగా వచ్చిన జైలు అధికారి అడ్డు చెప్పారు. ఇద్దరు వార్డర్లను తనిఖీ పేరుతో ఖైదీల ముందు దుస్తులు విప్పించి నగ్నంగా కూర్చోబెట్టారు. రిమాండ్ లేదా శిక్షపడ్డ ఖైదీలు మొదటిసారి జైలుకు వచ్చినప్పుడు రహస్యంగా ఏవైనా బ్లేడ్ లాంటివి దాచుకున్నారా? అనే అనుమానంతో తనిఖీ చేస్తారు. ఖైదీల మాదిరిగా తమను అవమానకరంగా దుస్తులిప్పించి వారి ముందే నగ్నంగా నిల్చోబెడితే విధులు ఎలా నిర్వర్తించాలని ఆ ఇద్దరు తోటి సిబ్బంది వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల వేధింపులతో విసిగిపోయిన సిబ్బంది శనివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. వారికి కుటుంబ సభ్యులు, పిల్లలు తోడవడంతో వివాదం ముదిరింది. వెంటనే రంగంలోకి దిగి చాకచక్యంగా సమస్యను పరిష్కరించాల్సిన జైళ్ల శాఖ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించారు. కనీసం అటువైపు కూడా వెళ్లలేదు. నిరసనకు దిగిన 35 మంది సిబ్బందిని జైలు సూపరింటెండెంట్ విధులకు దూరంగా పెట్టేశారు.



విశాఖ కేంద్ర కారాగారం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న గార్డింగ్ సిబ్బంది

రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు..

విశాఖపట్నం సెంట్రల్ జైలు వివాదం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు ఎగిశాయి. ఆదివారం ఉదయం సిబ్బంది నల్లబ్యాడ్జీలతో జైళ్ల ముందు నిరసనకు దిగారు. వేధింపులు భరించలేమని, జైళ్ల మాన్యువల్ ప్రకారం డ్యూటీలు చేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అప్పటికైనా మేల్కోవాల్సిన ఉన్నతాధికారులు మరింత మంట రాజేసేలా నిర్ణయం తీసుకున్నారు. రాయలసీమ జిల్లాల్లోని జైళ్లలో పనిచేస్తున్న వార్డర్లలో 35 మందిని ఆదివారం అనూహ్యంగా విశాఖ సెంట్రల్ జైలుకు, అదేవిధంగా విశాఖ జైలు నుంచి 31 మందిని రాయలసీమ జిల్లాలకు అటాచ్‌మెంట్ ఇచ్చారు. 66 పేర్లతో కూడిన జాబితాను జైళ్ల శాఖ విడుదల చేసింది. దీంతో ఒక్కసారిగా రాష్ట్రంలోని జైళ్లలో నిరసనలు మరింత ఊపందుకున్నాయి. విశాఖలో తప్పు జరిగితే అందుకు కారణాలు విశ్లేషించి తప్పు సరిదిద్దాల్సిన ఉన్నతాధికారులు తమను ఎందుకు బలిపశువుల్ని చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇదే సమయంలో విశాఖ జైలులో విధుల్లో ఉన్న వార్డర్లను లోపలే బంధించడం మరో వివాదానికి తెరతీసింది. రెండు రోజుల పాటు విశ్రాంతి లేకుండా విధులు నిర్వహించడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. సీమలో సిబ్బంది కొరత రాయలసీమ జైళ్లలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. రాష్ట్ర జైళ్ల శాఖ సిబ్బంది మొత్తం మూడు వేలమంది కాగా, యూనిఫామ్ సిబ్బంది 1600 మందికి పైగా ఉండాలి. కానీ జైళ్ల శాఖ 900 మందితోనే నెట్టుకొస్తోంది. ఎక్కువ మంది ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన వారు ఉండటంతో అటువైపు వెళ్లారు. తాజా నిర్ణయంతో సీమ జైళ్లలో సిబ్బంది కొరత ఏర్పడింది. రాయలసీమ జిల్లాలకు కేంద్రమైన కడప రేంజ్‌కు జైళ్ల శాఖలో డీఐజీ లేరు. కడప జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు ఇన్‌చార్జిగా ఉన్నారు.

కాలుష్య కారక పరిశ్రమలపై పవన్ కన్నెర్ర


▸ కాకినాడలో యూనివర్సల్ బయో ఫ్యూయల్ సంస్థ మూసివేత

▸ సమగ్ర దర్యాప్తునకు డిప్యూటీ సీఎం ఆదేశం

▸ తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల మరణంపైనా విచారణ

సర్పవరం జంక్షన్ (కాకినాడ), అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ తీరప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతున్న పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలని డిప్యూటీ సీఎం, పర్యావరణ, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తీర ప్రాంతంలో యూనివర్సల్ బయో?ఫ్యూయల్స్ సంస్థ విడుదల చేస్తున్న కాలుష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాలతో కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని ఈ ఫ్యాక్టరీని పరిశీలించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు.. దీనిని తాత్కాలికంగా మూసివేయించారు. కొంతకాలంగా వాయు కాలుష్యంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంపై డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, జిల్లా పీసీబీ ఈఈ శంకరరావులతో ఫోన్‌లో మాట్లాడారు. యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ సంస్థ కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, వాస్తవ పరిస్థితిని పరిశీలించి తక్షణం నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రజలకు వాయు కాలుష్య సమస్యలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈమేరకు అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. అక్కడ ముడి పదార్థాల కింద వాడే ఫ్యాటీ యాసిడ్‌లో కల్తీ జరిగిందని, ఫలితంగా ఘాటైన, దుర్గంధపూరిత వాయువులు వెలువడుతున్నాయని తేల్చారు. సదరు కంపెనీకి నోటీసులు జారీ చేశారు. ముడి సరుకు ధరలు పెరడంతో కల్తీ రసాయనం వాడినట్టు ప్రాథమికంగా గుర్తించామని, ఈ నెల 24న ఫ్యాక్టరీని మూసివేయించామని పీసీబీ ఈఈ శంకరరావు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు మరింత సమగ్రంగా దర్యాప్తు చేస్తామని, సముద్ర తీర ప్రాంతంలోని మరిన్ని ఫ్యాక్టరీల్లో తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే, కాకినాడ బీచ్‌రోడ్డు, ఏపీఐఐసీ, వాకలపూడి ప్రాంతాల్లో అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు పెద్ద సంఖ్యలో మరణిస్తున్న విషయం డిప్యూటీ సీఎం దృష్టికి రావడంతో దీనిపై విచారణ జరిపి, తాబేళ్ల మరణానికి కారకులపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వన్యప్రాణుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరిని ఆదేశించారు.

స్త్రీవాద కవయిత్రుల తండ్రి ప్రేమ



ఒక నాన్న వేలుపట్టి నడిపించి మార్గదర్శనం చేసే దిక్సూచి కావొచ్చు. ఇంకో నాన్న మధ్యలోనే గాడి కింద పడేసి అనుబంధాల్ని విడిచినవాడు కావచ్చు. కొందరికి నాన్న ఇష్టుడు. మరికొందరికి పెత్తనం చెలాయించే అధికారం. అమ్మని బానిసగా చూసే నాన్నలూ ఉన్నారు. నాన్న పేరు మీదే కదా పితృ స్వామ్య వ్యవస్థ ఉంది. ఐతే, స్త్రీవాదాన్ని బలంగా వినిపించిన కవయిత్రులు కొందరు వాళ్ళ తండ్రిని హృదయాలకు హత్తుకున్నారు.

ఘంటసాల నిర్మల తన తండ్రి స్మృతిలో వెలువరించిన కవిత 'ఒక మామూలు నాన్నారి కోసం'. రైల్వే శాఖలో నలభై ఏళ్ల పాటు పనిచేసిన తండ్రి జీవితాన్ని కవయిత్రి మన ముందుంచుతారు. ఎక్కే రైలుతో దిగే రైలుతో దాదాపు 40ఏళ్ల జీవితం గడిచిపోయిందంటారు: "నాన్నారూ/ ఉన్నన్నాళ్ళూ మాకు జవజీవాల్ని సమకూర్చి/ జీవితాల్ని అమర్చి పెట్టినన్నాళ్ళూ మీరు/ సమాజం రుద్దిన విలువల చట్రంలో ఆపాదించిన/ సూత్రాల చక్రంలో నలుగుతూ/ నలుగుతున్నాననుకోకుండానే కాలాలు గడిపారు/ సగం జీవితం చద్ది అన్నమే! రెండు క్యారేజీలతో ఇవాళ తెల్లవారుజామున/ మెయిలుకో, సర్కారుకో డ్యూటీ ఎక్కితే మళ్ళీ రావడం రేపు రాత్రికే" అని దిగులుపడతారు కవయిత్రి. నాన్న తనకోసం లెక్కలు చెప్పడం, స్టీలు క్యారేజీ తనకు ఇచ్చి సత్తు క్యారేజీ మోసుకెళ్ళడం, పోటీలో బహుమతులు వస్తే ఆయనే గెలిచినట్టు ఆనంద పడటం, పెద్దమ్మాయి సంగీతానికి పరవశం చెందడం... ఇలా ఎన్నో తీపిగుర్తులను కవయిత్రి కవితలో నమోదు చేశారు. "అంత చిరంతపు తీపి బాల్యాన్ని/ ఇంత ఘాటయిన క్రమశిక్షణనీ/ రంగరించి ఇచ్చిన మీరు/ అలా చెప్పకుండా అధాటున/ వెళ్ళిపోయారేం/ నాన్నారూ! ఉద్యోగాసాంతం అసలెప్పుడూ ఆఖరి నిమిషంలోనే బండి అందుకున్న మీరు/ ఎంత డ్యూటీ అయిపోయిందనుకుంటే మాత్రం/ అంత అకస్మాత్తుగా వెళ్లిపోతారా!" అని విలపిస్తారు. ఆయన దూరమైన 'దిగులు దుఃఖం' ఉండ కడుతూనే ఉంది. కళ్ళ కాల్వలు ఎడ తెగడం లేదని కవయిత్రి కలం కన్నీరు కార్చింది.

పితృస్వామ్య వ్యవస్థపై తిరుగు బావుటా ఎగరేసిన కవయిత్రి మందరపు హైమవతికి నాన్న మాత్రం అమ్మలా కనపడ్డాడు. ఈ కవయిత్రి నాన్నను గుండెల్లో పెట్టుకున్నారు. "అమ్మ బొజ్జలో బజ్జున్నది/ ఆడపిల్లని తెలిస్తే/ విషం సూది గుచ్చి/ విముక్తి గీతం పాడుతారు/ కొందరు నాన్నలు/ నాన్నకు నేనంటే ఆరో ప్రాణం" అంటూ అక్షరాల్లో దాచుకున్నారు. కొందరికి నాన్నంటే చందమామ కథల్లో రాక్షసుడు. నాన్నని చూస్తే గుండెల్లో బాంబులు పేలతాయి. ఏం కావాలన్నా అమ్మే మధ్యవర్తి. కానీ కవయిత్రి నాన్న ఇందుకు మినహాయింపు: "బాల్యంలో నా అభీష్ట క్రీడాస్థలం/ నాన్న వక్షస్థల మైదానం/ చిన్నప్పుడు నిద్ర మంచం మీద నుంచి కింద పడి/ గుక్క పట్టి ఏడుస్తున్నప్పుడు/ భుజం మీద ఎత్తుకొని తెల్లవార్లు జోకొట్టి/ నిద్రపుచ్చిన లాలి పాట" అని నాన్నకి కితాబు ఇస్తారు. వానలో తనతో పాటు పడవలు వదిలిన బాలుడు నాన్న, గగన వీధి నుండి దిగి ఇంటికొచ్చిన చందమామ నాన్న, శీతాకాలం గోరువెచ్చని సూరీడు నాన్న, మార్కులు తగ్గినపుడు అమ్మ కోప్పడితే చల్లని మాటల ఛత్రం నాన్న... అంటూ కవయిత్రి నాన్నను పొదువుకుంటారు. "ప్రపంచ సాహిత్యంలో నా అభిమాన పదం నాన్న" అని ప్రకటిస్తారు. ఒక స్త్రీవాద కవయిత్రి 'నాన్న' నా అభిమాన పదం అని ప్రకటించారంటే తండ్రి ఆమెను ఎంత ప్రభావితం చేశాడో తెలిసిపోతుంది.

ఉన్నట్టుండి వెళ్లిపోతారని తెలిసినా, వెళ్ళిపోయిన తర్వాత ఆ జ్ఞాపకాల నుండి తేరుకోవడం కష్టమే. అవెప్పుడూ కళ్ళ ముందు కదులుతుంటాయి. అలాంటి జ్ఞాపకాల కలబోతతో 'కొనసాగింపు' అనే కవిత రాశారు శిలాలోలిత. "నాన్న వెళ్ళి తలుపేసుకున్నారు. అయితే, అది ఎప్పటికీ తీయని తలుపు" అని కవయిత్రి విలవిలలాడిపోతారు. "అర నిమిషం కరెంటు పోయినా/ ఊపిరాడని నాన్నను/ గాజు ముక్కల గదిలో మూసేశాం కదా/ చిన్నప్పుడు స్నానాలు చేయించిన నాన్నను/ బాకీ తీర్చుకోవడానికా అన్నట్లు తలలో చెంబూ నీళ్ళు పోసి స్నానాలు చేయించాం" అంటారు.

నాన్న ప్రేమను, ఆప్యాయతను, అనురాగాన్ని పొంది వెలిగిన మరో కవయిత్రి చల్లపల్లి స్వరూపారాణి. 'నాన్న కోసం' అనే కవితలో నాన్నను ఆమె ఆంతరంగిక మిత్రుడుగా చూస్తారు. బాల్య స్నేహితుడిగా చాటుతారు. తండ్రి ముందు భూమ్యాకాశాలు చిన్నబోతాయంటారు. తండ్రి స్మృతి తొలిపొద్దులా మెరుస్తూనే ఉంటుందట. "మా నాన్న రిమోట్ నాన్న కాదు, పోలీసు నాన్న కాదు" అంటూ పొంగిపోతారు. అంతలోనే నాన్న జ్ఞాపకాల 'అపరాధ శిలువ' గుండె కెత్తుకున్నాను అని ఇలా వేదనకు గురౌతారు: "నీ సమాధి తల వాకిట్లో/ వెలితి వెలితిగా నిలబడి/ బొట్లు బొట్లుగా కరిగే/ కొవ్వొత్తిని నేనే నాన్నా".

కొన్ని సందర్భాల్లో తండ్రి మాటలను పిల్లలు పెడచెవిన పెడతారు. 'నీకేం తెలుసు పో' అంటారు. కానీ వారు సంతానాన్ని పొందాక, తండ్రి పాత్ర ఏమిటో నెమ్మదిగా తెలుస్తుంది. తండ్రి దూరమయ్యాక అర్థం కావడం మొదలవుతాడు. ఈ నేపథ్యంలో శైలజామిత్ర 'తండ్రి స్మృతి' కవిత రాశారు: "నాన్నా! సగానికి పైగా జీవితం గడిచాక/ ఇప్పుడిప్పుడే నాకు అర్థం అవుతున్నావు/ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి/ కలిస్తేనే ఒక రోజవుతుందని తెలుసు కాని/ స్వార్థం, అసూయ, కపటం, అబద్ధం/ కలగలిపితేనే నేడొక మనిషని ఒకప్పుడు నువ్వు చెప్పింది గుర్తుకు వచ్చి/ ఇప్పుడిప్పుడే నాకు అర్థం అవుతున్నావు నాన్నా" అంటూ తండ్రి చెప్పిన సమాజ పోకడల్ని కవయిత్రి గుర్తు చేసుకున్నారు.

కొందరు నాన్నలు అపురూప జ్ఞాపకాలైతే, మరికొందరు చేదు జ్ఞాపకాలు. కె. గీత 'చివరి స్పర్శ' కవిత రెండు పార్శ్వాలనూ చూపిస్తుంది. నాన్న ఒక గుణపాఠంగా మిగిలాడు గానీ, ఏ ఒక్క గుండెలోనూ చిత్రపటం కాలేకపోయాడని కవయిత్రి బాధపడతారు. తండ్రి వీపు మీద ఆడిన బాక్సింగ్, భుజాలపై తిరిగిన రంగుల రాట్నం... ఇలా కొన్ని జ్ఞాపకాల్ని చెబుతారు. ఐతే తల్లిని కొట్టిన తండ్రిని పెట్రోలు పోసి తగలేయాలనిపించిందని కూడా నిక్కచ్చిగా చెప్తారు: "అమ్మ కళ్ళు నిండినప్పుడల్లా/ పెట్రోలేసి నిన్ను తగలెయ్యాలన్పించేది/ నిన్న ఎందుకో బతికితే బావుణ్ణనిపించింది/ హఠాత్తుగా పాడె మీంచి లేచి/ నువ్వు నడిచెళ్ళిపోతే బావుణ్ణనిపించింది" తండ్రి బతకాలని కవయిత్రి కోరుకున్నారు. "నువ్వు నాకు వద్దనిపించే నాన్నవి/ అమ్మని కష్టపెట్టిన రాక్షసుడివి/ అయినా నా శరీరంలో భాగం కాలిబూడిదైనట్లయింది/ పార్థివ కర్ణంలో అన్నయ్య 'డేడీ' అని పిల్చినపుడు/ నిన్ను పట్టి కుదిపి తీసుకెళ్ళి పోవాలన్పించింది" అంటారు.

ఈ కవితలన్నీ కూడా కవయిత్రులు వాళ్ల తండ్రులు చనిపోయాక రాసిన కవితలు. సాహితీ లోకంలో తమ తండ్రులకి వాళ్ళు ఇచ్చిన గొప్ప నివాళి. తండ్రి చనిపోయాక ఆయన కూర్చున్న కుర్చీ, పడుకునే మంచం, తినే కంచం, చదివే పుస్తకం దేన్ని చూసినా ఆ జ్ఞాపకాల లోకి వెళ్ళిపోతాం. చదవాలే గాని ప్రతీ తండ్రీ ఒక బతుకు పుస్తకం.

■ సుంకర గోపాలయ్య
✆ 94926 38547

బొమ్మలు: అక్బర్

దివాకర్ల వేంకటావధాని జీవితం, సాహిత్యంపై సదస్సు

సాహిత్య అకాడమీ, తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో దివాకర్ల వేంకటావధాని జీవితం, సాహిత్యంపై సదస్సు డిసెంబర్ 31 ఉ.10 గంటల నుంచి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజి, రూమ్ నెంబర్ 121లో జరుగుతుంది. అధ్యక్షత సాగి కమలాకర శర్మ, కీలకోపన్యాసం శలాక రఘునాథ శర్మ, పత్ర సమర్పణ అనుమాండ్ల భూమయ్య, సంగనభట్ల నరసయ్య, కసిరెడ్డి వెంకటరెడ్డి, పిల్లలమర్రి రాములు, జి అరుణకుమారి, గండ్ర లక్ష్మణరావు. కార్యక్రమంలో సి. మృణాళిని, సి. కాశీం, దివాకర్ల రాజేశ్వరి, ఏలే విజయలక్ష్మి, ఎస్. రఘు పాల్గొంటారు.

సి. మృణాళిని



పిల్లల బొమ్మల పుస్తకాల కోసం రచనలకు ఆహ్వానం

తానా – మంచి పుస్తకం ఆధ్వర్యంలో పదేళ్ళ లోపు పిల్లల కోసం తెలుగులో బొమ్మల కథల పుస్తకాలు – 2025 కోసం రచనలకు ఆహ్వానం. ఎంపిక ప్రక్రియ రెండు దశలు. మొదటి దశలో మొత్తం కథ, నమూనా బొమ్మలు మాకు 2025 మార్చి 31లోపు అందజెయ్యాలి. ఎంపికైన కథలు రెండవ దశలోకి వెళ్తాయి. ఈ దశలో సుమారు 5 కథాంశాలను ఎంపిక చేస్తాం. ఒక పుస్తకానికి కథ రాసిన వారికి, బొమ్మలు వేసిన వారికి రూ.15వేల చొప్పున పారితోషికం ఇస్తాం. 2025 మే 31లోపు బొమ్మలతో సహా ముద్రణకు సిద్ధంగా ఉన్న పుస్తకాన్ని అందజేయాలి. ఈ పుస్తకాలను తానా – మంచిపుస్తకం కలిసి 2025 జులై నాటికి ప్రచురిస్తాయి. మరిన్ని వివరాలకు: కె. సురేష్ (99638 62926), వాసిరెడ్డి నవీన్ (98483 10560). చిరునామా: మంచి పుస్తకం, 12-13-439, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాద్ 500017. ఈమెయిల్: info@manchipustakam.in.

కె. సురేష్

వేమన పద్య పోటీలు

వేమన ఫౌండేషన్, అనంతపురం ఆధ్వర్యంలో జనవరి 9లోగా వంద విద్యా సంస్థలలో వేమన పద్య పోటీలను నిర్వహించాలనుకొన్నాం. ఎంపికైన విద్యా సంస్థలకు ప్రసంశా పత్రాలు, పతకాలు, వేమన చిత్రం, పుస్తకాలు అందచేస్తాం. ఆసక్తి ఉన్నవారు 99639 17187 నెంబరులో సంప్రదించగలరు.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి

కథా సంపుటాలకు ఆహ్వానం

కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం కోసం 2023లో ముద్రితమైన కథా సంపుటాలు మూడు ప్రతులను జనవరి 31, 2024 లోపు పంపాలి. బహుమతి పొందిన కథా సంపుటికి నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరఫున ఏప్రిల్ నెలలో రూ.10వేల నగదు పురస్కారం, జ్ఞాపిక ప్రదానం జరుగును. ప్రతులు పంపే చిరునామా: పి. అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నెం. 15 120/4/1, రహత్ నాగర్ కాలనీ, నాగర్ కర్నూల్ – 509209, ఫోన్: 9441946909.

వనపట్ల సుబ్బయ్య

లాహిరి

మరో మజిలీ
ప్రతి ఏడూ ఒక విడిది.
అవును విడిపోయేది విడిచేవరకూ
ప్రయాణం ఎప్పటికప్పుడు 'విడిది'

కలిపి కుట్టేది ఏదోతెలియదు
బంధాలూ, బంధనాలూ
ఏర్పడుతూనే వుంటాయి
వదిలించుకుని విరాగి కావలసిన వయసునా
ప్రేమానురాగాలు పెనవేసుకుంటూనే వుంటాయి.
జీవన లాలస పట్టుకుని జీరాడుతూనే వుంటుంది.
తండ్రీ కొడుకు నుండి తాతా మనుమడుకు ఎదిగాక
బాధ్యత కావడి బరువు కాకున్నా
ఆపేక్ష సాపేక్షికమై
కొత్త ఆశల ఆనంద శ్వాసలందుకుంటుంది

వద్దనుకుంటే రద్దయ్యే చట్టం కాదు
పెనవేసుకునే బుల్లి చుట్టం.
కనపట్టం తరువాయి
విచ్చుకునే చిట్టిహాసరేఖలు
చుట్టుకునే వంశవృక్షశాఖలు
ఎంత వద్దనుకున్నా ఆరాటం
ఆటు వశీకరణమవుతూంటుంది.

ఎదుగుదల అక్కడిదే ఇక నవప్రభాతం
ఇక్కడిది కృష్ణపక్ష అవనతం
వెన్నెలకూ అమావాస్యకూ పొత్తు అంటే
గమ్మత్తు కావచ్చు కానీ
అదే జీవితం మత్తు.
నిజమే!
అమ్మా నాన్న, భార్యాభర్త,
కొడుకు కోడలు, తాతా మనుమడు
ఏమన్నా నాణేనికి ఇరు పార్శ్వాలే
బంధం 'విలువ' అదే.

అందుకే
పాడుకుంటాను ఆడుకుంటాను.
తోడు అంటాను వీడు తంటాను.
ఆఖరిచరణం తర్వాత కూడా పల్లవి వుంటుంది.
పాట సాగుతూనే వుంటుంది
బాట సాగుతూనే వుంటుంది.

మజిలీ మజిలీ లోనూ బిజిలీ వుంటుంది
వెలుగు నిజధారయై
ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంది
సమకాలీనం లోనే భవిష్యత్తు రూపుదిద్దుకుని
వర్తమానం గతమయ్యే 'వర్తమానం' వుంటుంది.

విడిదిని అలంకరించుకుంటూనే వుండాలి.
ఆఖరి మజిలీ వరకూ
ఆశావిశ్వాసాల ఆనందం జీవనదిలో
లాహిరి సాగుతూనే వుండాలి.

■ సుధామ



రచన గుర్తున్నంతగా రచయిత గుర్తుండరు

చదువు ముచ్చట

శ్రీసుధ మోదుగు

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

చిన్నప్పుడు స్కూల్లో టీచర్ చెప్పిన కథలలో గుర్తున్న కథ గజేంద్రమోక్షం, భాగవతంలోనిది. ఆ సమయంలోనే ఇష్టంగా చదివిన పుస్తకం పంచతంత్రం. ఒక కథలోంచి మరో కథలోకి వెళ్లడం, కథలన్నీ ఒకదానితో ఒకటి అల్లుకొని ఉండడం... ఆ కనెక్టివిటీ అప్పట్లో బాగా ఆకర్షించింది. ఆ కథల్లో ప్రతి కథ చివర్లో నీతి ఉంటుంది. నీతి ఎందుకు చెప్పాలి, ఇదే నీతి ఎందుకు అవుతుందని మా టీచర్‌ని అడిగితే.. కథలో నువ్వు తెలుసుకున్న విషయం, అర్థం చేసుకున్న విషయం ఏంటి అని అడిగారు. అది కథలను నా దృష్టితో చూడటానికి తోడ్పడింది.

ఈమధ్య చదివిన పుస్తకాల్లో నచ్చినవి?

రచనా రంగం లోకి వచ్చి కవిత్వం, కథలు, నవలలు ఇలా అనేకంగా నన్ను నేను వ్యక్తీకరించుకుంటున్న క్రమంలో చదవడం కొంత తగ్గింది. ఈమధ్య చదువుతున్న వాటిలో రమణజీవి కథలు, త్రిపుర కథలు, అజయ్ ప్రసాద్ కథలు, చంద్ర కన్నెగంటి కథలు నాకు నచ్చిన వాటిలో ఉన్నాయి. అనువాదాల్లో తమిళ రచయిత జయమోహన్ కథలు నచ్చాయి.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

చాలా డ్రాస్టిక్‌గా మారింది. నేను మెడిసిన్ చదువుతున్నపుడే శరత్ సాహిత్యంతోపాటు స్పిరిచువల్ బుక్స్ కూడా చదివాను. అలాగే మొదటిసారి చార్లెస్ డికెన్స్ రాసిన చారిత్రక నవల 'ఏ టేల్ ఆఫ్ టూ సిటీస్' చదివాను. దాంతో అప్పటి వరకు క్లాసిక్ లిటరేచర్, ఇంగ్లీష్ నవలలపైన ఉన్న అభిప్రాయం మారిపోయింది. మరో పదేళ్ళకి ఒక స్నేహితురాలు పరిచయం చేసిన భగవద్గీత, డిసైపుల్స్ ఆఫ్ రామకృష్ణ లాంటి పుస్తకాలు చదివాను. అది క్రమంగా స్పిరిచువల్ అండ్ ఫిలసాఫికల్స్ పుస్తకాలు వైపు మళ్ళడానికి దోహదం చేసింది.


మీ నమ్మకాల్ని, దృక్పథాన్ని ప్రభావితం చేసిన రచయిత?

రచన గుర్తున్నంతగా రచయిత గుర్తుండరు నాకు. పెద్దయ్యాక నన్ను ఎక్కువ ప్రభావితం చేసిన పుస్తకం భగవద్గీత. అదేవిధంగా పాశ్చాత్య ప్రపంచానికి బుద్ధిజాన్ని పరిచయం చేసిన పాల్ కారస్ 'ద గాస్పెల్ ఆఫ్ బుద్ధ' పుస్తకం కూడా నా మీద ప్రభావం చూపింది. కవిత్వం విషయంలో బాలగంగాధర్ తిలక్ 'అమృతం కురిసిన రాత్రి', ఠాగూర్ 'గీతాంజలి' చాలా ఇష్టంగా చదివాను. మాయా ఎంజెలో, ఖలీల్ జిబ్రాన్‌ల కవిత్వం చదివిన కొద్దీ నచ్చేది.

సాహిత్యంలో మీకు బాగా నచ్చిన పాత్ర ఏది?

మార్క్ ట్వైన్ 'టామ్ సాయర్' చిన్నప్పుడు నన్ను నేను ఐడెంటిఫై చేసుకున్న పాత్ర. అది తొమ్మిదో తరగతిలో నాన్ డీటెయిల్‌గా వచ్చిన పుస్తకం. 'మర్చెంట్ ఆఫ్ వెనిస్'లో షైలాక్ పాత్ర కూడా చాలా రోజులు వెంటాడింది. పెద్దయ్యే కొద్దీ పాత్రల కంటే బాగా, నచ్చిన పుస్తకంతో ప్రయాణించడం అలవాటయింది. అలా వచ్చిన అనుభూతి చాలా రోజులు నన్ను అంటిపెట్టుకొనే ఉండటం గమనించాను.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?



బాగా ఇష్టం రచనలే, రచయితల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ ఒక్కసారి గాంధీ గారి ఆత్మకథ 'ద స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' చదివినప్పుడు డిస్టర్బ్ అయ్యాను. ఆయనను ఒక్కసారి కలిసి కొన్ని ప్రశ్నలు అడిగి నిజాలు తెలుసుకోగలిగితే బావుండేదనిపించింది. ఆయన పూర్తి చేయకుండా వదిలివేసిన ఖాళీల వల్ల ఆ పుస్తకం పాక్షికమైన నిజాయితీతో రాసినట్లు అనిపించడం వల్లనేమో.

రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా, మీరు ఎప్పుడూ పాటించేది?

నాకు నచ్చిన మంచి సలహా– మన పాదముద్రలు ఈ భూమ్మీద నుంచి ఎంత త్వరగా మాయమైతే అంత మంచిది. రచన విషయంలో కచ్చితంగా పాటించేది ఒక్కసారి రచన అయిపోయాక దానిని డిస్టెన్స్ చేసుకోవడం. రచనలో నా ప్రమేయం లేకుండా చూసుకోవడం.

(శ్రీసుధ మోదుగు కవి, రచయిత. ఆమె కవిత్వ సంపుటాలు 'అమోహం', 'విహారి', 'గొంగళి పురుగుల సామ్రాజ్యం'; కథా సంపుటాలు 'రెక్కల పిల్ల', 'డిస్టోపియా', 'జాగ్రత స్వప్నం'; నవల 'అంతర్హిత'.)

అనుభూతి కవిత్వ చర్చల మధ్య అస్తిత్వ ఒరిపిడి

నా మొదటి పుస్తకం

అఫ్సర్

'I came here not to give peace but to war' - Matthew 10:34

ఎలా దొరికిందో దొరికింది బైబిల్. స్కూల్లో వున్నప్పుడు పాఠ్య పుస్తకాల మీద తిరుగుబాటు బావుటా ఎగరేసి ఖమ్మం లైబ్రరీ లోనో, బెజవాడ ట్రిప్ వేసి ప్రబోధ బుక్ సెంటర్ లోనో, ఖాదర్ బాబాయ్ ఇంట్లోనో దొరికిన ప్రతి పుస్తకం చదివే కాలంలో. అందులో Psalms చదివి, వాటి ప్రేమలో పడిపోయి, కొన్ని బట్టీ కొట్టడం అలవాటైంది. అలా బట్టీ కొట్టిన వాక్యాల్లో ఇదొకటి.



అదే 1990 కవిత్వ సంపుటి 'ఇవాళ'కి టాగ్‌లైన్‌గా మారింది. అట్లా మతప్రతీకల్ని తీసుకొని, సమకాలీన వాస్తవికత గురించి, స్వానుభవాల గురించీ రాయడం ఎక్కువమందికి నచ్చింది. అనుభూతి కవిత్వం గురించి చర్చలు జరుగుతున్న కాలంలో 'ఇవాళ'లో ఈ అస్తిత్వ ఒరిపిడి చాలామందికి కొత్తగా అనిపించింది. అంతకు నాలుగేళ్ల కిందట సీతారాం, ప్రసేన్‌తో కలిసి 'రక్తస్పర్శ' అచ్చయినా, అన్నివిధాలుగా నా తొలి పుస్తకం అనదగ్గది 'ఇవాళ'.

ఇస్మాయిల్ తరచూ ఉత్తరాలు రాసే కాలం అది. "మీరు తెలుగు కవిత్వం చట్రాలు బద్దలు కొడుతున్నారు. విమర్శకులు ఏం అనబోతున్నారో నేను ఇవాళే చెప్పేస్తున్నా వాళ్లందరి మొదటి వాక్యం ఇది 'తెలుగు కవిత్వం' కానే కాదు!" ఆయన అన్నదానికి భిన్నంగా ఏమీ జరగలేదు. అయితే, ఆ మాట పాజిటివ్ కోణం నుంచి అనడం మొదలు పెట్టారు. కవిత్వ అభిమానులు పుస్తకాన్ని హాయిగా అందుకున్నారు. వెంటవెంటనే సమీక్షలు వచ్చాయి. ఫ్రీ వర్స్ ఫ్రంట్ తో సహా ఆ రెండేళ్లలో కనీసం పదిహేను అవార్డులు 'ఇవాళ'కి దక్కాయి.


ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్న తొలిరోజుల నుంచీ పొనుగోటి కృష్ణారెడ్డికి నేనంటే అవ్యాజమైన ప్రేమ. "నీ కవిత్వం పుస్తకం రావాల్సిందే!" అని వెంటాడి మరీ ఈ పుస్తకం వేయించాడు. ఈ పుస్తకానికి స్నేహపూర్వక ప్రూఫ్ రీడర్ కొండేపూడి నిర్మల. పుస్తకంలో ఒక్క అచ్చుతప్పు లేదంటే కారణం ఆమె శ్రద్ధ మాత్రమే. ఇందులో కవితలు తొలిసారిగా విన్నవాళ్లు అప్పటి నా రూమ్మేట్ సౌదా, ఆంధ్రజ్యోతిలో కొత్తగా చేరిన వంశీకృష్ణ, అల్లం నారాయణ.

పుస్తకం వచ్చేసింది అని తెలియగానే వేగుంట మోహన ప్రసాద్, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, టీయల్ కాంతారావు పరుగుపరుగున ప్రెస్‌కి వచ్చి, తొలి ప్రతులు రెండేసి కొనుక్కున్నారు. ఆ తరవాతి కాపీ బెజవాడ మొగల్రాజపురంలో మా పక్కింట్లో వున్న చిరకాల మిత్రుడు వేణుగోపాల్‌కి అందింది. ఆవిష్కరణల హడావుడి ఏమీ చేయలేదు. కానీ, 1992 తరవాత ఈ పుస్తకానికి ఉమ్మడిశెట్టి అవార్డుతో మొదలుపెట్టి మద్రాస్ తెలుగు అకాడెమీ పురస్కారం దాకా రావడంతో అటు ప్రొద్దుటూరు నుంచి మద్రాస్ దాకా, మళ్ళీ హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా సత్కార సభలు జరిగాయి. నా ప్రమేయం ఏమీ లేకుండానే అప్పటి ప్రసిద్ధులు ఈ సభల్లో అతిథులుగా వచ్చి 'ఇవాళ' గురించి మాట్లాడారు.

ఇందులోని 'ఇదే నా జాతీయ గీతం' కవితను కొన్ని వందల సభల్లో సినారె వినిపించేవారు. అదే సమయంలో కవిత్వంలో ఇంత సంక్లిష్టత అవసరమా అంటూ త్రిపురనేని మధుసూదన రావు గారు ఈ పుస్తకం మీదే దాదాపు 15 పేజీల విమర్శ రాశారు. కెకె రంగనాథా చార్యులు 'సమాంతర వేదిక మీద మొట్టమొదటిసారి "సంక్లిష్టత" అన్న అంశంపై హైదరాబాద్ పిలిపించి మరీ నా చేత ఉపన్యాసం ఇప్పించారు. ఇంకోవైపు "అఫ్సర్ బ్రాండ్ కవిత్వం" అంటూ రాజీవ్ ఆంధ్రజ్యోతిలో రాసిన సగం పేజీ వ్యాసం అనేక చర్చలకు దారితీసింది. కొత్త కవిత్వానికి ఇది కొండగుర్తు అని కేవీయార్ ప్రతి సభలో ఈ కవిత్వ శిల్పాన్ని, అందులోని ప్రతిఘటన తత్వాన్ని చెప్పేవారు.



"రక్తస్పర్శతో పాటు ఇది నా బెడ్ సైడ్ బుక్" అని వీవీ అన్నారు. 1992 ఫ్రీ వర్స్ ఫ్రంట్ అవార్డు వచ్చినప్పుడు మొట్టమొదటిసారిగా శీలా వీర్రాజు గారు అవార్డు మెమెంటోని ఆస్కార్ ఫలకం మోడల్లో చేయడం కూడా అప్పుడు సాహిత్య వార్తగా మారింది. ఆ విధంగా 'ఇవాళ' అనేక కొత్తదనాలకు నాంది పలికి, అనిర్వచనీయమైన తృప్తినిచ్చింది, నాకూ నా నిజమైన మిత్రులకు!



ఈ నదిని దాటాలి...

ఇది రక్త నది
ఋతువు ఏదైనా ఎండిపోని రుధిర ఝరి

విశ్వాసాలు విఘాతాలై
విచ్చుకుంటున్న కత్తుల విన్యాసంలో
కుత్తుకలు తెగి
వెల్లువెత్తుతున్న ఆగని నెత్తుటి ప్రవాహాల తడి

దీని పుట్టుక ఏ పర్వత సానువుల్లోనో కాదు
పరాయి నీడను పడగ నీడగా తలచే
అసహన అరాచక ఆలోచనల సుడుల్లో..

ఈ నదిని దాటాలి
రక్తపు జాడలు లేని దరిని చేరాలి

మతాలు మానవత్వపు తడి లేని మరీచికలు
మనుషులను విడదీసి ఆడించే
మాయా జలతారు తెరలు

అధికార దండానికై ఆరాటపడే
దండ నాయకుల దహన క్రీడలో
గుండెల్లో గుణపాలు దించుకుంటున్న
గుళ్ళు.. మసీదులు

మనిషి రంగు రుచి వాసన మతమే అయ్యి
వికర్షిత ధ్రువాలై విస్ఫోటిస్తున్న విపత్కర కాలమిది

ఎండి ఎడారై పొడిబారిన ఏ ఎదలోనూ
చిగురించని ప్రేమ మొలకలు

గుహలు వీడి.. గహనాంతర గండాలు దాటి
నడిచిన నాగరికతా దారుల్లో
ఉన్మాద ఉత్పాతాలను ఎదిరించి నిర్మించిన
లౌకిక సౌధాలను సమాధి చేసే
వ్యతిరిక్త వ్యూహాలు

ఇది హృదయాలను అంటుకట్టాల్సిన సమయం
సామరస్య సహజీవన నినాద సందర్భం

మాటలు నేర్వకముందు
మతం వాసన పీల్చకముందు
ఆకలికి అమ్మ చన్ను అన్నమై చప్పరించిన
చనుబాల తీపిని తలుచుకోవాలి
మానవ సమూహాల సమైక్యజాడలు
తడిగా తగులుతాయి


మక్సద్ అలగ్ అలగ్
మగర్ అబ్ హమ్ భీ యెహీ బోలేంగే..

'ఏక్ హై తో సేఫ్ హై'

వెలివాడలు.. అగ్రహారాల మధ్య
రాకపోకల రహదారులేయాలి
మందిర్ మస్జిదులు అలయ్ బలయ్ తీసుకోవాలి
బతుకమ్మ సద్దులు.. బక్రీద్ ఖీర్లు
చర్చిలో కలిసి ప్రేమగా పంచుకోవాలి

'ఏక్ హై తో సేఫ్ హై'
హమ్ ఏక్ హీ రహేంగే!

■ గాజోజు నాగభూషణం
✆ 98854 62052





అందెల రవమిక ముగిసినది

మూడు రోజులుగా కూచిపూడిలో నిర్వహిస్తున్న కూచిపూడి నాట్య స్వర్ణోత్స వాలు ఆదివారంతో ముగిశాయి. ఒకే వేదికపై 2 వేల మంది కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ఔరా అనిపించాయి. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూచిపూడి నాట్యమనే దీపాన్ని దేదీప్యమానంగా వెలుగొందేలా అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరో మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ముగిసిన కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు

ఒకే వేదికపై 2 వేల మంది కళాకారుల ప్రదర్శన





ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ముగింపు సభలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

మురిసిన తెలుగు సందడి

ముగిసిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ● 18 తీర్మానాలకు ఆమోదం ● ఆసక్తిగా 'తెలుగులో న్యాయపాలన'

తెలుగు రచయితల సందడి ముగిసింది. వన్‌టౌన్ కేబీఎన్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల 6వ మహాసభలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. మాతృభాషతో ముడిపడిన వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించారు. విద్యార్థుల్లో రచనా సామర్థ్యం, భాషా నైపుణ్యం పెంచడానికి యువకవి సమ్మేళనాలు నిర్వహించారు. భాష పరిరక్షణకు అడుగులు పడాల్సిన మార్గాలను విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు స్పష్టం చేశారు. మొత్తంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ప్రాథమిక విద్య నుంచి తెలుగు తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన తెలుగు మాధ్యమాన్ని తిరిగి పునరుద్ధరించాలని వక్తలు, ప్రతినిధులు పట్టుబట్టారు. ముగింపు సభలో మొత్తం 18 తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించారు. అన్నింటిలో న్యాయపాలనపై తెలుగులో సాగిన సదస్సు ఆసక్తికరంగా ఉంది. తెలుగు భాషను పదిలం చేసుకోవడానికి ప్రజలు, రాజకీయ నేతలు, ప్రభుత్వాలు, రచయితలు, మేధావులు చేయిచేయి కలిపి అడుగులు వేయాలని ఈ మహాసభలు దిశానిర్దేశం చేశాయి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

6



మెగా అభిమానులు విజయవాడలో ఏర్పాటు చేసిన రామ్‌చరణ్ 256 అడుగుల భారీ కటౌట్‌కు ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డ్ సాధించింది. దీంతో అభిమానులు హెలీకాప్టర్ నుంచి పూలవర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు.

రేపు రాత్రి నగరంలో ఆంక్షలు

● ఫ్లై ఓవర్లు, పశ్చిమ బైపాస్, ఎంజీ, ఏలూరు, బీఆర్టీఎస్ బంద్

విజయవాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరానికి ఆహ్వానం, ప్రస్తుత సంవత్సరానికి వీడ్కోలు పలికే 31న రాత్రి నగరంలో ఆంక్షలు విధిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాలు జారీ చేశారు. వేడుకలు నిర్వహించుకునే వారు పశ్చిమ బైపాస్ పైకి వెళ్లవద్దని స్పష్టం చేశారు. నగరంలోని బెంజ్‌సర్కిల్ రెండు ఫ్లై ఓవర్లు, పీసీఆర్ వద్ద ఉన్న ఫ్లై ఓవర్, కనకదుర్గ ఫ్లై ఓవర్‌ను పూర్తిగా మూసివేస్తారు. అలాగే ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డు, బీఆర్టీఎస్ రహదారులను మూసివేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

- రహదారులపై అర్ధరాత్రి వేడుకల నిర్వహణపై నిషేధం
- రాత్రి 11 గంటల తర్వాత వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా వ్యవహరించాలి
- ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించకూడదు
- మద్యం తాగి వాహనాలు నడపకూడదు
- గుంపులుగా రహదారులపైకి చేరి కేక్‌లు కట్ చేయడం నిషేధం
- డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా ఉంటాయి.
- ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసి అధిక శబ్దాలు చేసుకుంటూ ప్రమాదకర విన్యాసాలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

హెల్మెట్ లేకుంటే ప్రకాశం బ్యారేజీపైకి నో ఎంట్రీ

హెల్మెట్ లేకుండా వాహనదారులను ప్రకాశం బ్యారేజీపైకి అనుమతించబోమని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ నిబంధన సోమవారం నుంచి అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. హెల్మెట్ లేక అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.



బెజవాడకు మెట్రోహారం

ఖరారైన స్టేషన్లు!

- కారిడార్ - 1లో 22, కారిడార్ - 2లో 12
- పీఎన్‌బీఎస్ వద్ద ప్రధాన స్టేషన్
- అమరావతిలో విస్తరించే కారిడార్-3కి పీఎన్‌బీఎస్ అనుసంధానం
- నిడమానూరు నుంచి రామవరప్పాడు వరకు కారిడార్-1లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్
- ఒక్క డబుల్ డెక్కర్‌కు రూ. 1000 కోట్లు

విజయవాడ నగరానికి మరో మణిహారం రూపుదిద్దుకుంటోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. నగరానికి మెట్రో స్టేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముందుగా రెండు కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. ఒకటి గన్నవరం బస్టేషన్ నుంచి పీఎన్‌బీఎస్ వరకు, రెండోది పెనమలూరు సెంటర్ నుంచి పీఎన్‌బీఎస్ వరకు నిర్మిస్తారు. అయితే కారిడార్ -1లో గన్నవరం నుంచి రామవరప్పాడు రింగ్ వరకు వీఐపీ కారిడార్‌ను డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌గా నిర్మించనున్నారు. తర్వాతి దశలో రాజధాని అమరావతికి విస్తరించే కారిడార్-3ని నగరంలోని పీఎన్‌బీఎస్‌కు అనుసంధానం చేయనున్నారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ



విజయవాడ మెట్రో రైల్ స్టేషన్లు ఖరారయ్యాయి. తొలి దశలో గన్నవరం నుంచి ఏలూరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-1, పెనమలూరు సెంటర్ నుంచి పీఎన్‌బీఎస్ సెంటర్ వరకు కారిడార్-2ను చేపట్టబోతున్న సంగతి తెలిసిందే. ఈ రెండు కారిడార్లకు సంబంధించి మెట్రో రైళ్లలో ప్రయాణించటానికి వీలుగా మొత్తం 34 మెట్రో స్టేషన్లకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీఎల్) ఖరారు చేసింది. ఇందులో కారిడార్ - 1లో 22 మెట్రో స్టేషన్లను ఖరారు చేయగా.. కారిడార్ - 2 లో 12 మెట్రో స్టేషన్లను ఖరారు చేసింది.

కారిడార్ - 1 ఎన్‌హెచ్ - 16 మీదుగా వీఐపీ కారిడార్‌లో గన్నవరం నుంచి రామవరప్పాడు రింగ్ వరకు సాగుతుంది. అక్కడి నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వే స్టేషన్, పీఎన్‌బీఎస్‌కు చేరుకుంటుంది. ఈ కారిడార్‌లో గన్నవరం బస్టాండ్, గన్నవరం సెంటర్, యోగాశ్రమం, విజయవాడ ఎయిర్‌పోర్టు, కేసరపల్లి, వేల్పూరు, గూడవల్లి, శ్రీ చైతన్య కాలేజీ, నిడమానూరు రైల్వేస్టేషన్, నిడమానూరు, ఎనికేపాడు, ఎంటీటీ సెంటర్, ప్రసాదంపాడు, రామవరప్పాడు రింగ్, గుణదల, పడవలరేవు, మాచవరం డౌన్, సీతారామపురం సిగ్నల్, బీసెంట్ రోడ్డు, రైల్వేస్టేషన్ ఈస్ట్, రైల్వేస్టేషన్ సౌత్, పీఎన్‌బీఎస్ దగ్గర మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మెట్రో స్టేషన్లు పూర్తిగా ఎలివేటెడ్ విధానంలో ఉంటాయి.

తొలిదశలో చేపట్టే మరో కారిడార్-2లో పెనమలూరు సెంటర్, పోరంకి, తాడిగడప, కానూరు సెంటర్, కృష్ణానగర్, అశోక్‌నగర్, ఆటోనగర్, బెంజ్‌సర్కిల్, టిక్కిల్ రోడ్, మునిసిపల్ స్టేడియం, విక్టోరియా జూబిలీ మ్యూజియం, పీఎన్‌బీఎస్ వద్ద ఈ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇవన్నీ బందరు రోడ్డు మధ్య భాగంలో ఎలివేటెడ్ విధానంలో ఏర్పాటు చేస్తారు. పండిట్ నెహ్రూ బస్టేషన్ వద్ద పీఎన్‌బీఎస్ తరహాలో ప్రధాన మెట్రోస్టేషన్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రధాన మెట్రో స్టేషన్ భవిష్యత్తులో అమరావతికి విస్తరించే మెట్రో కారిడార్ - 3 కు అనుసంధానంగా ఉంటుంది. ప్రధాన మెట్రో స్టేషన్‌ను ఎన్‌హెచ్ - 65 పై ఎలివేటెడ్ విధానంలో నిర్మిస్తారు. పీఎన్‌బీఎస్‌లో కొంత మేర భూమిని ఇప్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని మెట్రో కార్పొరేషన్ కోరబోతోంది.

కారిడార్ -1లో నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు నాలుగున్నర కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ఏర్పాటు కానుంది. నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఎన్‌హెచ్ నేతృత్వంలో 6.50 కిలోమీటర్ల ఫ్లై ఓవర్ మంజూరైన సంగతి తెలిసిందే. ఇదే మార్గంలో మెట్రో కారిడార్ రామవరప్పాడు రింగ్ వరకు వెళుతున్న నేపథ్యంలో ఇక్కడి వరకు దీన్ని డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌గా నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన డిజైన్‌ను కూడా మెట్రో రైల్ కార్పొరేషన్ చేపడుతోంది. కేవలం ఒక్క డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికే రూ.1000 కోట్లు వ్యయం అవుతుందని తెలుస్తోంది.



ఉమ్మడి కృష్ణాజిల్లాలో గతంలో జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ(జైకా) నిర్దేశించిన అలైన్‌మెంట్ పరిధిలోనే ప్రస్తుత అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్ కూడా కొనసాగనున్నట్లు తెలిసింది. దీనిపై డీపీఆర్ తయారవుతున్న నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అలైన్‌మెంట్ పలుచోట్ల స్వల్పంగా మారే అవకాశం ఉన్నా.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మాత్రం మార్పులు లేకపోవచ్చని సమాచారం. కృష్ణాజిల్లాలో ఈస్ట్ బైపాస్, ఓఆర్ఆర్ సమాంతరంగా వెళ్లనున్న నేపథ్యంలో వాటి మధ్యన ఉన్న భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. అదేవిధంగా ఈ ఓఆర్ఆర్‌తో ఉమ్మడి కృష్ణాజిల్లా మరింత అభివృద్ధి చెందనుంది.

యథాతథం

ఉమ్మడి కృష్ణాలో మారని అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్!



- ఎన్టీఆర్ జిల్లాలో పొట్టిపాడు నుంచి కంచికచర్ల వరకు..
- కృష్ణా జిల్లాలో పొట్టిపాడు నుంచి చినపులిపాక వరకు..
- సమాంతరంగా కృష్ణాజిల్లాలో వెళ్లనున్న ఈస్ట్ బైపాస్, ఓఆర్ఆర్
- మధ్యలో భూముల ధరలకు రెక్కలు
- ఓఆర్ఆర్‌తో ఉమ్మడి కృష్ణా అభివృద్ధి

ఆంధ్రజ్యోతి, విజయవాడ: గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనే 189 కిలోమీటర్ల మేర నాటి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను జైకా సంస్థ రూపొందించింది. జైకా అందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో పొట్టిపాడు నుంచి కంచికచర్ల వరకు, పొట్టిపాడు నుంచి వుయ్యూరు వరకు అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు వెళ్తోంది. అప్పట్లో సీఆర్‌డీఏ నేతృత్వంలో ఈ ప్రాజెక్టును చేపట్టాలని భావించారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ ప్రాజెక్టును జాతీయ రహదారుల సంస్థ ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎన్‌హెచ్ నేతృత్వంలో ఓఆర్ఆర్ అలైన్‌మెంట్, డిజైన్లకు సంబంధించిన డీపీఆర్ తయారవుతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పునూ సూచించటం లేదని తెలుస్తోంది.

ఓఆర్ఆర్ వెళ్లే గ్రామాలు ఇలా..

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల దిగువన మున్నలూరు, కునికనపాడు మధ్య నుంచి ప్రారంభమవుతుందని సమాచారం. మోగులూరు, కంచికచర్ల, పెరకలపూడి, పొన్నవరం, జగన్నాథపురం, చెన్నారావుపాలెం, తిమ్మాపురం, పేత్రంపాడు, గుర్రాజుపాలెం, నందిగామ, కోడూరు, బూదనపల్లె, గరికపాటివారి కండ్రిక, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి, ఆగిరిపల్లి, నరసింగపాలెం, సగ్గూరు అమాని, సగ్గూరు, సూరవరం, బండారుగూడెం, అంపాపురం - బల్లిపర్రు మధ్యన, తేలప్రోలు - తెంపల్లె మధ్యన, పొట్టిపాడు వరకు వస్తుంది. కృష్ణాజిల్లా పరిధిలో పొట్టిపాడు నుంచి ఆత్కూరు, తుట్టగుంట, వెన్నూతల, నాగవరప్పాడు - బూతుమిల్లిపాడు మధ్యన, వెల్దిపాడు, వెల్దిపాడు కండ్రిక, తరిగొప్పుల ఎగువన, వేంపాడు, మారేడుమాక, బొకినాల, నెప్పల్లి, దావులూరు, చలివేంద్రపాలెం, బోడపాడు, చినపులిపాకల వరకు అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కొనసాగుతోంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కృష్ణాజిల్లాలో ఈస్ట్ బైపాస్‌తో అత్యంత దగ్గరగా వెళుతుంది. ఈస్ట్ బైపాస్, అవుటర్ రింగ్ రోడ్డు మధ్యన ఉన్న గ్రామాలు, పట్టణాలలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవటానికి అవకాశం ఉంది. విజయవాడ ఈస్ట్ బైపాస్, ఓఆర్ఆర్‌లు రెండూ కూడా కృష్ణాజిల్లాలో పొట్టిపాడు నుంచి చినపులిపాక వరకు సమాంతరంగా కొనసాగుతాయి. దీంతో కృష్ణాజిల్లా అటు వుయ్యూరు, పామర్రు వరకు, మరోవైపు ఏలూరు వరకు, ఇంకో వైపు నందిగామ వరకు అభివృద్ధి చెందటానికి అవకాశాలు ఏర్పడనున్నాయి.

పేర్ని గోడౌన్‌లో బియ్యం మాయం కేసులో

దర్యాప్తు వేగవంతం

పోలీసుల అదుపులో పేర్ని నాని గోడౌన్‌ల మేనేజర్ మానస్ తేజ!

» 100 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బందితో విచారణ

ఆంధ్ర జ్యోతి - మచిలీపట్నం: మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ల నుంచి పీడీఎస్ బియ్యం మాయం కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గోడౌన్ రికార్డులను పౌరసరఫరాలశాఖ అధికారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీటి ఆధారంగా పేర్ని నాని లారీలు ఎక్కడకు తరలిపోయాయనే అంశాలపై విచారణ చేస్తున్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది వంద మందికిపైగా ప్రత్యేక బృందాలు ఏర్పడి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లాలోని టోల్‌గేట్‌ల వద్ద లారీల నంబర్ల ఆధారంగా ఎటు ప్రయాణించాయనే వివరాల్లో కాకినాడ వైపు వెళ్లాని తేలినట్లు సమాచారం.



హైదరాబాద్‌లో అదుపులోకి..

మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ల మేనేజర్ ఏ-2 నిందితుడిగా ఉన్న మానస్ తేజను పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు అతడిని మచిలీపట్నం తరలించి రహస్య ప్రాంతంలో విచారణ చేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఇతడి బ్యాంకు ఖాతాలో జమ అయినట్లుగా తేలినట్లు సమాచారం. అయితే మానస్ తేజను అదుపులోకి తీసుకోలేదని, పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

పేర్ని నానికి సంబంధించిన గోడౌన్‌ను ప్రభుత్వం అద్దెకు తీసుకున్న నాటి నుంచి పౌరసర ఫరాల శాఖలో పనిచేసిన అధికారులకు పోలీసులు విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు.

పేర్ని నాని గోడౌన్ అగ్రిమెంట్ ఈ ఏడాది జనవరి నెలలో రెన్యువల్ చేశారు. ఈ పత్రాలను జంక్షన్ సమీపంలోని కానుమోలు నుంచి తీసుకువచ్చి సంతకాలు చేయించడం గమనార్హం. వీటిపై ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి నిజాలు నిగ్గుతేల్చాలని టీడీపీ నేతలు డిమాండ్ చేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నేడు తుది తీర్పు

పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఈ నెల 10వ తేదీన గోడౌన్ యజమానిగా ఉన్న పేర్ని జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆమె జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో బెయిల్ పిటిషన్ పలుమార్లు వాయిదా పడింది. సోమవారం తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఒకవైపు బియ్యం మాయం కేసులో పోలీసులు విచారణ చేస్తున్నారు. పేర్ని జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనే అంశంపై చర్చ జరుగుతోంది.

మువ్వల సవ్వడి.. మురిసె కూచిపూడి

ముగిసిన కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు ● ఒకే వేదికపై 2 వేల మంది ప్రదర్శన



కూచిపూడిలో నాట్యాంశాలు ప్రదర్శిస్తున్న నృత్యకారిణులు

కూచిపూడి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కూచిపూడి నాట్య స్వర్ణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఒకే వేదికపై 2 వేల మంది కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు మయూరాలు పురివిప్పి నాట్యమాడిన అనుభూతిని కలిగించాయి. మువ్వల సవ్వడికి..కూచిపూడి గ్రామం మురిసి, పులకించిపోయింది. వందే వందే వాణీ భవానీ, రాజగోపాలం..రాధాలోలం అంశాలను 2 వేల మంది కళాకారులు ముందుగా ప్రదర్శించారు. అనంతరం వేదవల్లి ప్రసాద్ బృందం ఆధ్యాత్మిక రామాయణ కీర్తన, కృష్ణజనన శబద్దం, బుడి బుడి నడకల అంశాన్ని ప్రదర్శించి ఆద్యంతమూ భక్తిభావంలో ముంచెత్తారు. కనకదుర్గ బృందం థిల్లానా అంశాన్ని ప్రదర్శించి మెప్పించారు. అన్నమయ్య మ్యూజికల్ అండ్ డ్యాన్స్ కళాశాల బృందం బ్రహ్మాంజలి, దశవతారం అంశాలు ప్రదర్శించి ఔరా అనిపించారు. కరణం శ్రీనివాస్ బృందం వినాయక స్తుతి, వసంత స్వరజతి అంశాలు ప్రదర్శించగా, చివరిగా సరితా నెహ్రూ బృందం కథన కుతూహల థిల్లానా, పంచాక్షరీ అంశాల్లో చూపిన హావభావాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాకారులను, అతిథులను ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకటా చలపతి జ్ఞాపికలు అందించి సత్కరించారు.

ప్రపంచాన్ని కూచిపూడి ఆకర్షిస్తున్నా..
రాష్ట్రంలో ఆదరణ కొరవడడం బాధాకరం

- కూచిపూడి నాట్యకళ అభివృద్ధికి కృషి చేద్దాం..
- స్వర్ణోత్సవ ముగింపు వేడుకల్లో మంత్రి కందుల దుర్గేశ్

కూచిపూడి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ చరిత్రలో ఊరు పేరుపై ఉన్న ఏకైక నాట్యకళ కూచిపూడి. ప్రపంచ దేశాలను కూచిపూడి నాట్యం ఆకట్టుకుంటోంది. ఏపీలో ఈ కళకు ఆదరణ కొరవడడం బాధకరం.' అని సాంస్కృతిక, పర్యాటక శాఖ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవ ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 50 వసంతాల పతాక స్వర్ణోత్సవాల సందర్భంగా 50 అడుగుల ఏకశిల పతాక స్థూపాన్ని ఏర్పాటు చేయడం అద్భుతమని మంత్రి పేర్కొన్నారు. కూచిపూడి నాట్యానికి ఆదరణ పెంచేందుకు కళాకారులు కార్యాచరణతో ముందుకు వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో చర్చిద్దామని ఆయన సూచించారు. కూచిపూడి నాట్యం అనే దీపాన్ని దేదీప్యమానంగా వెలుగొందేలా అందరూ చేయీచేయీ కలిపి కృషి చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు.

ప్రతి గ్రామంలో కళాక్షేత్రం ఉండాలి: మంత్రి కొల్లు రవీంద్ర

ప్రతి గ్రామంలో కూచిపూడి కళాక్షేత్రం ఉండాలని, కూచిపూడి నాట్యకళపై మక్కువ పెంచుకునేలా పిల్లలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. కూచిపూడి కళాకారులకు ఉద్యోగాల్లో అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తదనంతో కూచిపూడిని ముందుకు తీసుకెళ్తానన్నారు. కూచిపూడి అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చిస్తానని మంత్రి రవీంద్ర హామీ ఇచ్చారు.

భాషను, సంస్కృతినీ అంతం చేసే ప్రభుత్వాన్ని చూశాం

- వైసీపీకి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు చురకలు

ఇంతకు ముందు భాషను, సంస్కృతిని అంతం చేసే ప్రభుత్వాన్ని చూశామని గత వైసీపీ ప్రభుత్వానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు చురకలు వేశారు. నేడు కళను ఆదరించే ప్రభుత్వం అధికారంలో ఉందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కూచిపూడి మరింత అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాట్య పతాక స్థూపం ఆవిష్కరించటం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. తెలుగువారి జీవనాడి కూచిపూడి అని, సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ నాట్యకళ నేటికీ సజీవంగా ఉండడం మంచి పరిణామమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఈ సంస్కృతిని నిలబెడుతూ భావితరాలకు అందిస్తున్న కళాకారులు అభినందనీయులన్నారు. అంతకు ముందు శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ గ్యాలరీని మంత్రులు తిలకించారు. కళాపీఠం ఆవరణలో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కళాపీఠం సమీపంలో ఏర్పాటు చేసిన నాట్య పతాక స్థూపాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆవిష్కరించారు.



ఫొటో ఎగ్జిబిషన్ గ్యాలరీని ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



మాదిగల పారిశ్రామిక అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

- అందుకోసం కసి, పట్టుదలతో పనిచేయండి
- మాదిగలకు కేంద్ర మంత్రి 'పెమ్మసాని' పిలుపు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'మాదిగలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉద్యోగాలు చేయడమే కాదు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి. అందుకు ఎవరైతే సామాజికంగా, ఆర్థికంగా తక్కువగా చూశారో కసితో వారినే స్ఫూర్తిగా తీసుకోవాలి. పట్టుదల, లక్ష్యంతో పనిచేయాలి.' అని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. ఆదివారం హనుమాన్‌జంక్షన్‌లో ఇంటెలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్, ఇంటర్నేషనల్ మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో 7వ ప్రపంచ మాదిగ దినోత్సవం సందర్భంగా మాదిగల వ్యాపార పారిశ్రామిక రంగ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పెమ్మసాని మాట్లాడారు. మాదిగలు పారిశ్రామికంగా ఎదగడానికి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ద్వారా అనేక పథకాలను అమలు చేస్తున్నామని ఔత్సాహిక మాదిగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు సూచించారు. ఇంటర్నేషనల్ మాదిగ చాంబర్ అండ్ ట్రేడ్ ఇండస్ట్రీ సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాసరావు, బుర్ల రామాంజనేయులు, ఇంటిలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్టా విద్యార్థి, ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం బాపిరాజు, ఐఎంసీటీఐ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రాజేంద్రప్రసాద్, ఫోరం కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు బీఆర్ మునిరాజ్, బెంగుళూరు రిటైర్డు జడ్జి కినికేరి మల్లికార్జుడి పాల్గొన్నారు.

గుణదల ఉత్సవాలకు ప్రభుత్వ సహకారం

- ఎంపీ కేశినేని చిన్ని



ఎంపీ కేశినేని చిన్నికి ఆశీర్వాద ప్రార్థన చేస్తున్న మేరీమాత పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు

గుణదల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో నిర్వహించే మేరీమాత ఉత్సవాలకు ప్రభుత్వ సహకారం ఉంటుందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై చర్చ్ కౌన్సిల్ సభ్యులతో ఆదివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. పలు సమస్యలు కౌన్సిల్ సభ్యులు తన దృష్టికి తీసుకొచ్చారని వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. అభివృద్ధి పనులపై ప్రభుత్వ సహకారం కావాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. మేరీమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు ప్రత్యేక ప్రార్థన చేసి ఎంపీని ఆశీర్వదించారు. గుణదల చర్చి అధ్యక్షుడు నువ్వుల విజయబాబు, ఉపాధ్యక్షుడు చెరుకూరి జోసఫ్, కోశాధికారి గోలి విజయానంద్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నలుగురు అరెస్టు

- పోక్సో కేసు నమోదు: డీఎస్పీ అబ్దుల్ సుభాన్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో బాలిక(13)పై అత్యాచారానికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఆదివారం ఇనకుదురు పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ సుభాన్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. 'రోడ్డుపై ఉన్న బాలికను చంపేస్తామని బెదిరించి కాసానిగూడెం పావురాలగూడు సెంటర్ నుంచి మహమ్మద్ సలేహా(21), సాదం బాలశంకరసాయి(19) బలవంతంగా నోరుమూసి బైక్‌పై మధ్యలో కూర్చోబెట్టుకుని పంపులచెరువు వెనుక వాటర్ హౌస్ వద్ద ఖాళీ ప్రదేశానికి తీసుకొచ్చారు. అక్కడ ఉన్న వారి స్నేహితులు రామాని అశోక్(19), వేముల వెంకట పవన్(20)తో కలిసి నలుగురూ ఆ బాలికను చేతులతో చెంపలపై కొడుతూ శరీరంపై తాకకూడని ప్రదేశాల్లో తాకారు. ఒకరి తరువాత ఒకరు ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశారు. దీంతో బాలిక కేకలు పెడుతూ పారిపోయింది. ఇంటికి వచ్చి తల్లికి చెప్పగా, తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.' అని డీఎస్పీ తెలిపారు. దర్యాప్తు చేసి నలుగురిని అరెస్టు చేసి, గ్యాంగ్‌రేప్, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపామన్నారు. కాలేఖాన్‌పేట చెక్‌పోస్టు వద్ద నిందితులను అరెస్టు చేశామన్నారు.

బాలిక సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే: మంత్రి రవీంద్ర

బాలిక సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని తల్లిదండ్రులకు మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను ఆదివారం ఆయన పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలతతో మాట్లాడారు.

విజేతల స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు చేరండి

- చెస్ క్రీడాకారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



చదరంగం పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు గడ్డపై నుంచి ఎందరో చెస్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్టేట్ ర్యాంకింగ్ చదరంగం పోటీలకు కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన 60 మంది విజేతలకు కలెక్టర్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

ఘంటసాల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మన ఊరు - మన సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎన్ఆర్ఐ గొర్రెపాటి నవనీతకృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో జనవరి 13, 14 తేదీల్లో ఘంటసాలలో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల పూటీ లాగుడు బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకుడు బండి పరాత్పరరావు తెలిపారు. 13న 200 కేజీల న్యూ జూనియర్స్ విభాగం, 14న 250 కేజీల జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు. ఒంగోలు జాతి ఆవుల అందాల పోటీలు నిర్వహిస్తామన్నారు. న్యూ జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి రూ.30వేలు, రెండోది రూ.25 వేలు, మూడోది రూ.20 వేలు, నాలుగోది రూ.15 వేలు, ఐదోది రూ.10 వేలు, ఆరోది రూ.5 వేలు, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మొదటిబహుమతి రూ.50 వేలు, రెండోది రూ.40 వేలు, మూడోది రూ.30 వేలు, నాలుగోది రూ.20వేలు, ఐదోది రూ.10 వేలు, ఆరోది రూ.5 వేలు, ఎంట్రీ ఫీజు రూ.1000 అని తెలిపారు. వేమూరి రాజేంద్రప్రసాద్ 99124 30945, బండి పరాత్పరరావు 8919155334, కన్నెగంటి లక్ష్మీనారాయణ 99 49319062, రాధాకృష్ణప్రసాద్ 9490920887ను సంప్రదించాలన్నారు.

విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలి

- ప్రపంచ తెలుగు రచయితల మహాసభల భాషోద్యమ సదస్సులో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎన్.ముక్తేశ్వరరావు



మహాసభలో చేసిన తీర్మానాల ప్రతిని మంత్రి కందుల దుర్గేశ్‌కు అందిస్తున్న ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యదర్శి జీవీ పూర్ణచందు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రంలో మాతృభాషను తొలగించి ఇంగ్లీష్ మీడియంలో బోధనా పద్ధతులు ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యం దృష్ట్యా నేరమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎన్.ముక్తేశ్వరరావు అన్నారు. ఆవంత్స సోమసుందర సభా వేదికపై నిర్వహించిన భాషోద్యమ సదస్సులో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. పిల్లలకు విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలన్నారు. రాష్ట్రంలో ఇంగ్లిష్ మీడియంలో విద్యను బోధించే విధానాన్ని ప్రభుత్వం బేషరతుగా రద్దు చేయాలన్నారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు గారపాటి ఉమామహేశ్వరరావు, మండల వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకుడు మునిరత్నం నాయుడు, హైదరాబాద్‌కు చెందిన రచయిత సగిలి సుధారాణి, గుంటూరు చెందిన డాక్టర్ బడికల్లు జమదగ్ని, అమ్మనుడి సంపాదకుడు డాక్టర్ సామల రమేశ్ బాబు మాట్లాడారు. తమ సంస్థ నుంచి బాలల పోటీలు నిర్వహిస్తూ 1.10 లక్షల పుస్తకాలు పంపిణీ చేశామని గంగవరానికి చెందిన పైనేని తులసీనాథం నాయుడు ఈ సదస్సులో తెలిపారు.

కవులు, భాషావేత్తల స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయాలి

- ముగింపు సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

'రాష్ట్రంలో తెలుగు భాష కోసం పనిచేసిన కవులు, భాషావేత్తల స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయాలి. వైసీపీ ప్రభుత్వం కళాకారులకు రూ.5కోట్లు బకాయిలు పెట్టింది. వాటిని విడుదల చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కళాకారులకు ఇచ్చే పెన్షన్‌ను పెంచాలి. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలి.' అని ముగింపు సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. నన్నయ 11వ శతాబ్దంలో తెలుగులోకి భారతాన్ని అనువదించేటప్పుడు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నాడో అదే పరిస్థితి ఇప్పుడు ఉందని, పదసంపద సృష్టికి తగినంత కృషి జరగాలని సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకుడు విజయభాస్కర్ అన్నారు. పూర్వం గ్రామాల్లో ప్రదర్శించిన నాటకాల్లో ప్రయోగించిన పద్యాలు నేటికీ ప్రజల నాలుకలపై ఆడుతున్నాయని, ఇప్పుడు సామాజిక ఇతివృత్తంతో పద్య నాటకాలను తీసుకొస్తే భాష సజీవంగా నిలుస్తుందని నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ పేర్కొన్నారు. ముగింపు సభలో కొలకలూరి ఇనాక్, అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు, సిలికానాంధ్ర ప్రతినిధి చామర్తి రాజు, ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి జీవీ పూర్ణచందు తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్య లేమి తొలగాలి

- బాలసాహిత్య ప్రతినిధుల సదస్సులో రచయిత దాసరి వెంకటరమణ

'ఉమ్మడి కుటుంబాలు, బాలసాహిత్య పత్రికలు లేకపోవడం వల్లే బాలలు నైతిక విలువలకు దూరమవుతున్నారు. బాల సాహిత్యం మాతృభాష సంపదను పిల్లలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. బాల సాహిత్య లేమి తొలగాలి.' అని హైదరాబాద్‌కు చెందిన రచయిత దాసరి వెంకటరమణ ఆకాంక్షించారు. తెలుగు రచయితల మహాసభల్లో బాలబంధు బీవీ నరసింహారావు సభా వేదికపై నిర్వహించిన బాలసాహిత్య ప్రతినిధుల సదస్సులో ఆయన మాట్లాడారు. చిత్రకారుడు తిప్పాని వెంకటరావు, హైదరాబాద్‌కు చెందిన చెంగల్వ కామేశ్వరి, నెల్లూరుకు చెందిన గంగిశెట్టి శివకుమార్, గోవిందరాజు సుభద్రనాయుడు, సాలూరుకు చెందిన కిలపర్తి దాలినాయుడు తదితరులు పేర్కొన్నారు. బాలబాట బాలసాహిత్యపు పత్రిక సంపాదకులు కేవీఎస్వీ రమణమ్మ పాల్గొన్నారు.

డాక్టరేట్లు అమ్ముకుంటున్నారు

- పరిశోధనారంగ ప్రతినిధుల సదస్సులో వక్తలు

విజయవాడ కల్చరల్: తెలుగు రచయితల మహాసభల్లో కావలి బొర్రయ్య వేదికపై పరిశోధనా రంగ ప్రతినిధుల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత చరిత్ర ఉపన్యాసకుడు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడారు. 'మాతృభాషకు తగిన గుర్తింపు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఈ తరుణంలో పరిశోధనా రంగానికి సంబంధించిన డాక్టరేట్లు అమ్ముతున్నారు. గౌరవ డాక్టరేట్ ఇచ్చినందుకు రేట్ కడుతున్నారు. అందుకే అది డాక్టరేటు అయింది. వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పరిశోధన పదోన్నతి కాదు.. భవితకు మార్గదర్శకం చేసే వెలుగు బాటకావాలి.' అని సవరం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

శోధనే మిగిలింది

భవానీపురం: తెలుగు పరిశోధనల్లో స్థాయి దిగజారడంతో పరిశోధనలో శోధనే మిగిలిందని, మూలాలు మర్చిపోయి తెలుగు పునర్జీవం రావాలంటే అది సాధ్యం కాదని రచయితలు అభిప్రాయపడ్డారు. పరిశోధనా రంగ ప్రతినిధుల సదస్సులో ఆత్మీయ అతిథిగా విచ్చేసిన మన్నవ సత్యనారాయణ(దుగ్గిరాల) మాట్లాడారు. ఒకప్పుడు పరిశోధనలకు అవకాశాలు చాలా తక్కువగా ఉండేవన్నారు. ఇప్పుడు సాంకేతిక అందుబాటులోకి వచ్చినా పరిశోధనా స్థాయి పెరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత డాక్టర్ ప్రభల జానకి(న్యూఢిల్లీ), రామన్నపేటకు చెందిన కృష్ణ కౌండిన్య, నంద్యాలకు చెందిన డాక్టర్ సి.గురుప్రసాద్, మచిలీపట్నానికి చెందిన డాక్టర్ గురజాడ రాజేశ్వరి, చలపాక ప్రకాశ్, సీహెచ్‌వీఎన్ఎస్ శర్మ పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు జట్లను తీసుకెళ్లేందుకు నిధులివ్వండి

- సీఎం చంద్రబాబుకు ఏపీవోఏ అధ్యక్షుడు పురుషోత్తం అభ్యర్థన

విజయవాడ స్పోర్ట్సు/ధర్నాచౌక్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జనవరి 28 నుంచి నిర్వహించే జాతీయ క్రీడల్లో రాష్ట్రానికి చెందిన క్రీడా జట్లను తీసుకెళ్లేందుకు రూ.31.50 లక్షలు అవసరమని, నిధులను చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసి ఆర్థికంగా భరోసా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం అభ్యర్థించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడల ప్రారంభానికి 26 రోజులే ఉన్నా ఇంకా శాప్, ప్రభుత్వం ఆర్థిక సాయం ఊసెత్తడం లేదన్నారు. సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలన్నారు. చంద్రబాబు దగ్గరకెళ్లి నిధులు అడిగే అవసరం తమకు లేదన్నారు. తమవెంట వచ్చే 17 క్రీడా సంఘాల ఆధ్వర్యంలో జట్లను తాము తీసుకెళ్తున్నామని, డీ చెఫ్ మిషన్‌గా బడేటి వెంకట్రామయ్య, డిప్యూటీ డి చెఫ్ మిషన్‌గా రామిరెడ్డిలను నియమించామన్నారు. జనవరి 3లోగా జట్ల వివరాలను అధికారికంగా క్రీడల పోర్టల్‌లో నమోదు చేయాలని, ఈలోగా అథ్లెటిక్స్, ఆర్చరీ, ఖోఖో, రోయింగ్ క్రీడలకు ఆయా సంఘాలు కలిసి వస్తే తీసుకెళ్తామని, లేకపోతే వారిని కలిసి తీసుకెళ్లేది లేదన్నారు. రాష్ట్రంలో క్రీడలను బతికించాలని సీఎంకు మొరపెట్టుకుంటున్నామన్నారు.

జాతీయ క్రీడలకు జట్లను ప్రభుత్వమే తీసుకెళుతుంది

- నిధుల కోసం ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయడం సిగ్గుచేటు
- అధ్యక్షుడిగా పురుషోత్తమ్‌కు గుర్తింపులేదు: ఏపీవోఏ సెక్రటరీ కేపీ రావు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ జట్లను తీసుకెళ్లాలని ప్రభుత్వాన్ని కోరామని, కొద్దిరోజుల్లో శాప్‌కు తగు ఉత్తర్వులు వస్తాయని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ 175/1961 కార్యదర్శి కేపీ రావు వెల్లడించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో విలేకరుల సమావేశంలో కేపీ రావు ఆదివారం మాట్లాడారు. జాతీయ క్రీడలప్పుడే ప్రత్యక్షమై తానే ఏపీవోఏ అధ్యక్షుడినంటూ పురుషోత్తం నిధుల కోసం ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయడం సిగ్గుచేటన్నారు. ఆయనకు ఐవోఏ వెబ్‌సైట్‌లోనే గుర్తింపు లేదని, అధ్యక్షుడిగా గుర్తించలేదని, ఇప్పటికీ మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పేరే ఉందని తెలిపారు. పురుషోత్తం చెన్నైవాసి అని, క్రీడాజట్లను తీసుకెళ్లే అర్హత లేదని తెలిపారు. గుజరాత్, గోవాల్లో జరిగిన జాతీయ క్రీడలకు నేరుగా ప్రభుత్వమే టీఏ,డీఏలు ఇతర ఖర్చుల కింద నిధులను క్రీడా సంఘాలు, క్రీడాకారుల ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. అవినీతి అలవాటుపడిన పురుషోత్తం ఐవోఏ రూల్స్‌కు వ్యతిరేకంగా వెళుతున్నాడని, చట్టపరంగా ఆయనను అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వం సమకూర్చే డబ్బులతో ఇబ్బంది లేకుండా క్రీడాజట్లను జాతీయ క్రీడలకు తీసుకుని వెళతారని అన్నారు. పురుషోత్తం మాటలకు ప్రజాప్రతినిధులు స్పందించ వద్దన్నారు. ఆయన ఏపీవోఏలోకి ప్రవేశించాకే క్రీడారంగం భ్రష్టు పట్టిందని కేపీ రావు ఆరోపించారు.

బీజేపీ ఫాసిస్ట్ విధానాలను తిప్పికొట్టాలి

- వామపక్ష నేతల పిలుపు

ధర్నాచౌక్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హిందూ రాజ్యమే బీజేపీ లక్ష్యమని, మనువాద బీజేపీని తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. 'ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-మనువాద ఫాసిస్ట్ కార్పొరేట్ శక్తుల ప్రమాదం-కమ్యూనిస్ట్-వామపక్ష సామాజిక శక్తుల కర్తవ్యం' అనే అంశంపై ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దాసరిభవన్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్ట్ విధానాన్ని అమలు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌పై హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని రాజ్యాంగంపై దాడిగా భావించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాటం నాగభూషణం అన్నారు. అదానీ కోసం పేదలపై కరెంట్ చార్జీల భారాన్ని వేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత పోలారి, ఎస్‌యూసీఐ(సీ) నేత సుధీర్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నేత ఎస్కే గౌస్ పాల్గొన్నారు.



పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎన్జీవో సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్

పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ సంఘ ఎన్నిక ఏకగ్రీవం

ధర్నాచౌక్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్(వర్క్ అకౌంట్స్) ఎంప్లాయిస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర సంఘం ఎన్నికల్లో 15 మంది రాష్ట్ర కార్యవర్గసభ్యులతో కూడిన ఆర్.ఎస్.హరినాథ్ బాబు, రమణారెడ్డి ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్జీవో సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ ప్రకటించారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా విద్యాసాగర్ వ్యవహరించారు. 15 పదవులకు హరినాథ్ ప్యానల్‌కు చెందిన సభ్యులు నామినేషన్ దాఖలు చేయడం వల్ల ఎన్నిక ఏకగ్రీవం అయిందని ఆయన ప్రకటించారు. ఎన్నికైన సభ్యులతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. సహాయ ఎన్నికల అధికారిగా డి.సత్యనారాయణరెడ్డి, పరిశీలకుడిగా టి.గోపాలకృష్ణ వ్యవహరించారు. తొలుత నిర్వహించిన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్సీ, మాజీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌బాబు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి, కృష్ణానదిలో పవిత్రస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా అయ్యేందుకు ఈవో రామారావు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు.



కిటకిటలాడుతున్న క్యూలైన్లు

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

న్యాయవాదులపై దాడులు దుర్మార్గం : ఐలూ

విజయవాడ లీగల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, న్యాయవాది జల్లా సుదర్శనరెడ్డిపై అనంతపురం జిల్లా లక్కిరెడ్డిపల్లి ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి దురుసు ప్రవర్తన దుర్మార్గమని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.కుమార్, ఎస్.మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. సీఎం చంద్రబాబు, హోం మంత్రి, డీజీపీలు న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యాలపై తగు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో న్యాయవాదులు తమ వృత్తిని కొనసాగించడానికి కావాల్సిన పరిస్థితులను, కల్పించవలసిందిగా ఐలూ కోరుతున్నట్లు తెలిపారు.





మధు జంక్షన్ బస్టాప్ వద్ద ఉదయం పరిస్థితి

రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన నూడుల్స్ బండి

మలుపులో ప్రమాదకరంగా డ్రెయిన్

ఆక్రమణల చెరలో మధు జంక్షన్

- సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్
- రోడ్డుమీదే కళాశాలల బస్సుల పార్కింగ్

మొగల్రాజపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం మధుజంక్షన్‌లో ఆక్రమణల దెబ్బకు వాహనాలు, జనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ ప్రాంతంలోని రెండు కార్పొరేట్ పాఠశాలలు, రెండు కళాశాలల బస్సులు ఉదయం , సాయంత్రం వేళ విద్యార్థుల వచ్చే సమయం, స్థానికులు ఉద్యోగాలకు వెళ్లే సమయం ఒకటే కావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సాయంత్రం అయితే మరీ దారుణంగా ఉంటోంది. కళాశాలలు వదిలే ముందు కళాశాలల బస్సులన్నీ వరుసగా రోడ్డుమీద బారులు తీరి ఉంటాయి. రోడ్డులో ప్రయాణించే వాహనాలు, ఆర్టీసీ బస్సులు ఆగిపోవడం వెనుక వచ్చే ట్రాఫిక్ నిలిచిపోవడం ఒకేసారి జరుగుతోంది. ప్రవీణ్ కార్డియాక్ ఆసుపత్రి మలుపులో రోడ్డుమీదకు చిరువ్యాపారుల బండ్లను పెడుతున్నారు. బస్‌స్టాప్‌లో చిరువ్యాపారులు వ్యాపారాలు చేస్తుంటారు. ఆర్టీసీ బస్సు ఎక్కడం కోసం వచ్చే ప్రయాణీకులు, విద్యార్థులు రోడ్డమీద వాహనాల మధ్య వేచి చూడాల్సిన పరిస్థితి. ఇక్కడ రాంగ్ రూట్‌లో ప్రయాణించే వాహనాలు మరో సమస్య. మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మధు జంక్షన్ బస్టాప్‌ను ఆక్రమించిన వ్యాపారులు



లయోలా కళాశాల మెయిన్‌గేట్ వద్ద వాకర్స్ శాంతియుత నిరసన

కొనసాగుతున్న లయోలా వాకర్స్ నిరసన

భారతీనగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలయోలా కళాశాల యాజమాన్యం వైఖరిని వ్యతిరేకిస్తూ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతిని కోరుతూ లయోలా వాకర్స్ అమరావతి వాకర్స్ సభ్యులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆదివారం మద్దతుగా బీజేపీ స్టేట్ పబ్లిక్ గ్రీవాన్స్ సెల్ ఇన్‌చార్జి కిలారు దిలీప్ పాల్గొన్నారు. లయోలా కళాశాల మెయిన్ గేట్ వద్ద కళాశాల యాజమాన్య వైఖరిని నిరసిస్తూ రెండు గంటల పాటు కళాశాలలోకి ఎటువంటి వాహనాలను వెళ్లకుండా అడ్డుకున్నారు. 11రోజులుగా శాంతియుత నిరసన చేస్తున్నా కళాశాల యాజమాన్య అనుమతులు ఇవ్వక పోవడంతో వారి తీరును వ్యతిరేకిస్తూ జనవరి 2వ తేదీన తప్పనిసరిగా కళాశాల గ్రౌండ్‌లో నడుస్తామని వాకర్ల సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వాకర్ల సంఘం అధ్యక్షుడు రూప్ కుమార్, సభ్యులు, సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల వాకర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై విషం కక్కడం సరికాదు

బెజవాడ నజీర్

పటమట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేయాల్సిన తప్పులన్నీ చేసి ఇప్పుడు శుద్ధ పూసలా కూటమి ప్రభుత్వంపై విషం కక్కడం సరికాదని జగన్‌పై టీడీపీ నాయకులు బెజవాడ నజీర్ విమర్శించారు. విలేకర్లతో ఆదివారం సమావేశంలో మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను పీడించుకున్నతిన్నారన్నారు. అధికారం నుంచి దిగిపోయే ముందు రూ.12,849 కోట్ల ఎఫ్‌పీసీసీఏ చార్జీల వసూలుకు అనుమతి తీసుకున్నాడని, 2022లోనూ 8113.60 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల కోసం ఈఆర్‌సీకి ప్రతిపాదనలు పంపాడన్నారు.



విజేతలతో సిప్ అబాకస్ యాజమాన్యం

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి సిప్ అబాకస్ పోటీలు

పటమట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సిప్ అబాకస్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సిప్ అబాకస్ అర్థమెటిక్ జీనియస్ పోటీలు ఆదివారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఉత్సాహభరితంగా సాగాయి. ఈ పోటీకు రాష్ట్రవ్యాప్తంగా 30 స్కూల్స్ నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్టేట్ హెడ్ మాకినేని గోపాలకృష్ణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి తాము ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణితంపై ఆసక్తి, జిజ్ఞాస పెంచే లక్ష్యంగా సిప్ అకాడమీ అబాకస్‌పై శిక్షణ ఇస్తున్నార ని తెలిపా రు. ఈ పోటీల్లో చిత్తూరు, పీలేరు, హిందూపూర్, గుంటూరు, విజయవాడల నుంచి విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన 15 మంది విద్యార్థులు జనవరి 19 నుంచి చెన్నైలో జరిగే నేషనల్ లెవెల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

దుర్గగుడిలో అలరించిన కూచిపూడి నృత్యం

వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి కళావేదికలో ఆదివారం హైదరాబాద్, కోకపేటకు చెందిన అపర్ణ దూళిపాళ్ల బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. ఈ సందర్భంగా కళాకారులు జయము జయము, జయ జయ దుర్గే - తరంగం, నాట్యహేలకం జదళాయతాక్షి, తిల్లాన ఇంకా పలు కీర్తనలకు కూచిపూడి నృత్యం చేశారు. అనంతరం ఈవో కె.ఎస్. రామారావు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



కళాకారిణుల నృత్య ప్రదర్శన

నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రెడీ

ఎంపీ కేశినేని శివనాథ్ ,
ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో విజయవాడ నగరం మరింత విస్తరణ కాబోతుందని, దానికి సంబంధించి మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజక వర్గ పరిధిలోని నాల్గవ డివిజన్‌లోని సుబ్బారావు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు సమస్యల వినతి పత్రం వారికి అంద జేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయంలో ప్రజా సమస్యలను అస్సలు పట్టించుకోలేదన్నారు. డ్రైన్లలో పూడిక తీయక పోవడం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు మట్టిని తొలగించక పోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్లు అన్ని చెరువులుగా మారుతున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి పనులు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, స్ట్రామ్ వాటర్ నిధులను కేంద్రం నుంచి నిధులు మళ్లీ మంజూరు చేయించుకుని పనులు చేపట్టనున్నామన్నారు. తూర్పు నియోజక వర్గంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. విజయవాడ నగరాన్ని హైద్రాబాద్ నగరానికి దీటుగా తీర్చిదిద్దుతామన్నారు. కాలనీ అధ్యక్షుడు వెలగపూడి సుబ్బారావు మాట్లాడుతూ అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలన్నారు. కాలనీలోకాలుష్యం లేకుండా చూడాల్సిందిగా ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, కాలనీ పెద్దలు జే.రాజారావు, చిట్టిబాబు, రామచంద్ర రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

రాజధాని అమరావతి నిర్మాణంలో మేమూ భాగస్వామ్యం అవుతాం

- డాక్టర్ పెండాల్య హరినాథ్‌బాబు

పటమట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంలో తాము కూడా భాగస్వామ్యులవడానికి కృత నిశ్చయంతో ఉన్నామని సూర్య ఇంటర్నేషనల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పెండ్యాల హరినాథ్‌బాబు తెలిపారు. విజయవాడ వెన్యూ కల్యాణ మండపంలో ఆదివారం సూర్య ఇంటర్నేషనల్, జాగ్వార్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నారెడ్కో-2025 డైరీ ఆవిష్కరణ సభలో ఆయన పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన జాగ్వార్ ఉత్పత్తులు స్టాల్‌ను ముఖ్యఅతిథి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యేలు బొండా ఉమా, యార్లగడ్డ వెంకట్రావులు సందర్శించారు. ఈ సందర్భంగా హరినాథ్‌బాబు మాట్లాడుతూ సూర్య ఇంటర్‌నేషనల్ సంస్థ గత 64 సంవత్సరాల నుంచి వినియోగదారులకు నమ్మకంగా, మన్నిక, నమ్మకం కలిగిన ఉత్పత్తులను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామన్నారు. వేర్‌హౌస్‌లు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో ఉన్నాయని,త్వరలో కడపలో నూతన వేర్‌హౌస్‌ని ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగ్వార్ ఏపీ, తెలంగాణ బ్రాంచ్ హెడ్ అభిజిత్ సింగ్, జాగ్వార్ సంస్థ ఏపీ హెడ్ సాయికుమార్ నారెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.



అమ్మవారి చిత్రపటాన్ని హైకోర్టు న్యాయమూర్తి భానుమతికి అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె.ఎస్.రామారావు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీస్సులు అందించారు. అనంతరంఈవో వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్.భానుమతి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.



హాజరైన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శారద కళాశాల గోల్డెన్ జూబ్లీ

ధర్నాచౌక్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శారద కళాశాల గోల్డెన్ జూబ్లీ మహోత్సవాల సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. గత యాభై ఏళ్లలో ఈ కాలేజ్‌లో చదువుకున్నవారు అధిక సంఖ్యలో పాల్గొని తమ విద్యార్థిదశలోని మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి సి.ఎ.రామనారాయణ మాట్లాడుతూ కళాశాలలో కోర్సు పూర్తైన తర్వాత ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్ సెల్ ప్రారంభించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కళాశాల పూర్వ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులకు జ్ఞాపికను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు ఆర్.డి.షా, ఉపాధ్యాక్షుడు లింగమూర్తి, శారద డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరశర్మ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, శారద స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.ఎల్.ఎన్.మూర్తి, కోశాధికారి ఎస్.వి.ఎన్.వరప్రసాద్ పాల్గొన్నారు.



ఆలయ ఈవో రామారావుకు వెండి అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కనకదుర్గమ్మకు మూడు కిలోల వెండి కానుక

వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతం వినుకొండకు చెందిన ఎం.వి.ఫణీంద్ర ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దుర్గామల్లేశ్వర దేవస్థానానికి విచ్చేసి మూడు కిలోల 5 వెండి కడ్డీలను ఆలయ ఈవో కె.ఎస్.రామారావుకు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఆలయ ఈవో చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథాకానికి చిత్తూరు జిల్లా, మదనపల్లికి చెందిన వి.మురళీధర్ కుటుంబ సభ్యులు ఆదివారం దుర్గగుడి ఈవో రామరావుకు రూ.లక్ష విరాళం, 1,009 గ్రాముల వెండి కడ్డీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనంతోపాటు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం ఈవో అందజేశారు.



సైనిక పాఠశాలల్లో ప్రవేశాలు

త్రివిధ దళాలకు అవసరమైన అధికారులను పాఠశాల స్థాయి నుంచే సిద్ధం చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం 33 సైనిక పాఠశాలలు ఏర్పాటు చేసింది. ఇక్కడ విద్యార్థులకు సీబీఎస్‌సీ విద్యతోపాటు, క్రమశిక్షణ, భౌతిక నైపుణ్యాలు పెరిగేలా శిక్షణ ఇస్తారు. ఈ పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆరు, తొమ్మిది తరగతుల ప్రవేశాల నోటిఫికేషన్(ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్-2025) వెలువడింది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవీ అకాడమీ, ఇతర అకాడమీల్లో చేరడానికి సిద్ధం అవుతారు. 'ఏఐఎస్ఎస్ఈఈ' దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయాల్సి ఉంటుంది.

చివరి తేదీ 2025 జనవరి 13.

6వ తరగతి: 10 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సు (2013 ఏప్రిల్ 1 నుంచి 2015 మార్చి 31లోపు జన్మించి) ఉండాలి.

9వ తరగతి: 13 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు (2010 ఏప్రిల్ 1 నుంచి 2012 మార్చి 31లోపు జన్మించి) ఉండాలి.

పరీక్షా విధానం: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ద్వారా నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా రాత విధానంలో ఉంటుంది. ఆరో తరగతి పరీక్ష అన్ని ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. దీనిని రెండున్నర గంటల్లో రాయాలి. తొమ్మిదో తరగతి పరీక్ష ఇంగ్లీషులో మాత్రమే నిర్వహిస్తారు. దీనిని విద్యార్థులు మూడు గంటల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తు విధానం: https://aissee.nta.nic.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుల, నివాస, జనన ధృవీకరణ సర్టిఫికెట్‌లతోపాటు పాస్‌పోర్ట్ ఫోటో అవసరం అవుతాయి. జనరల్, ఓబీసీ, డిఫెన్స్ కేటగిరీ వారికి రూ.800/- ఫీజు, ఎస్‌సీ, ఎస్టీ విద్యార్థులకు 650/- ఫీజు ఉంటుంది.

సైనిక్ స్కూల్స్: తెలుగు రాష్ట్రాల విద్యార్థుల కోసం రెండు సైనిక పాఠశాలలు ఉన్నాయి. ఒకటి విజయనగరం జిల్లాలోని కోరుకొండ, చిత్తూరు జిల్లాలోని కలికిరి. దీనిలో 65 స్థానిక విద్యార్థులకు, మిగిలిన 35 శాతం జాతీయ కోటాలోకి వెళుతుంది. అంటే తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడి స్కూల్స్‌తోపాటు జాతీయ కోటా 35 శాతం(అంటే దాదాపు 400 సీట్ల)కి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

కౌన్సెలింగ్ ప్రాసెస్: ప్రవేశ పరీక్ష పూర్తయిన 45 రోజుల లోపు స్కోర్ కార్డు ఇంటికి వస్తుంది. ఇందులో అర్హత పొందిన విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. ఇది దాదాపు 8 రౌండ్లుగా ఉంటుంది.

కలికిరి స్కూల్ - మొత్తం సీట్లు 105

స్థానిక కోటా	బాలురు	బాలికలు
ఎస్సీ	10	1
ఎస్టీ	04	1
ఓబీసీ	18	1
డిఫెన్స్	08	1
జనరల్	26	1



(మిగిలిన సీట్లు జాతీయ కోటా కిందకు వెళతాయి)

కోరుకొండ స్కూల్ - మొత్తం సీట్లు 93

స్థానిక కోటా	బాలురు	బాలికలు
ఎస్సీ	08	1
ఎస్టీ	04	1
ఓబీసీ	16	1
డిఫెన్స్	07	1
జనరల్	22	1



(మిగిలిన సీట్లు జాతీయ కోటా కిందకు వెళతాయి)

ప్రిపరేషన్: ఆరో తరగతి: ప్రధానంగా ఐదో తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవాలి. మొత్తం మార్కులు 200(మేథ్స్: 50, జనరల్ నాలెడ్జ్: 50, ఇంగ్లిష్: 50, జనరల్ ఇంటెలీజెన్స్: 50)

తొమ్మిదో తరగతి: మొత్తం మార్కులు 400(మేథ్స్: 200, సైన్స్: 50, ఇంగ్లిష్: 50, ఇంటెలీజెన్స్: 50, సోషల్: 50) (ప్రతీ సబ్జెక్టులో కనీసం 25 శాతం మార్కులు రావాలి. టోటల్‌గా కనీసం 40 శాతం మార్కులు రావాలి)

తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరంల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి.

- ఎస్.కళ్యాణి

ప్రిన్స్‌పాల్, కాంత్రి కీన్ అకాడమి, హైదరాబాద్

నాల్కోలో టెన్త్, ఐటీఐ వారికి ఉద్యోగాలు

ప్రభుత్వ రంగ సంస్థ 'నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో) నుంచి 518 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం నోటిఫికేషన్ వెలువడింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి జూనియర్ ఆపరేటివ్ ట్రైనీలుగా నియమిస్తారు.

లాబొరేటరీ: 37 పోస్టులు- కెమిస్ట్రీ సబ్జెక్టుగా బీఎస్‌సీ ఆనర్స్ చదివి ఉండాలి.

ఆపరేటర్: 226 పోస్టులు. టెన్త్, ఐటీఐ చేసి ఎలక్ట్రానిక్స్, మెకానిక్స్, టెక్నీషియన్ మెకట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ఏదో ఒకటి చేసి ఉండాలి.

ఫిట్టర్: 72 పోస్టులు-టెన్త్, ఫిట్టర్ ట్రేడ్‌లో ఐటీఐ అప్రెంటిస్‌షిప్ చేసి ఉండాలి.

ఎలక్ట్రికల్: 63 పోస్టులు-టెన్త్, ఐటీఐ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ సర్టిఫికెట్ ఉండాలి

ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్: 48 పోస్టులు- టెన్త్, మెకానిక్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల ఐటీఐ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉండాలి.

మైనింగ్ మేట్: 15 పోస్టులు - టెన్త్, మైనింగ్ మేట్ సర్టిఫికెట్

మోటార్ మెకానిక్: 22 పోస్టులు-టెన్త్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల ఐటీఐ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్.

నర్స్(గ్రేడ్-3): 7 పోస్టులు- ఇంటర్‌తోపాటు, మూడు సంవత్సరాల జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఉండాలి. లేదా డిప్లొమా/బీఎస్సీ నర్సింగ్, ఒక సంవత్సరం అనుభవం ఉండాలి.

ఫార్మసిస్ట్: 6 పోస్టులు- సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్, ఫార్మసీ డిప్లొమా ఉండాలి. కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉంటే ప్రాధాన్యం.

లాబొరేటరీ, ఫస్ట్‌ఎయిడ్ తదితరాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారి వయసు 35 సంవత్సరాలు నిండి ఉండరాదు. మైనింగ్‌కు 28, ఇతర పోస్టులకు 27 సంవత్సరాలు దాటరాదు. అభ్యర్థులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. 2024 డిసెంబరు 31 నుంచి 2025 జనవరి 21 తేదీలోపు దరఖాస్తులు స్వీకరిస్తారు. పూర్తి వివరాలకు https://nalco-india.com/ వెబ్‌సైట్ చూడొచ్చు.

దిక్సూచి DIKSUCHI



ఎస్‌బీఐలో పీఓలు 600

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 600 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 జనవరి 16 తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవాలి. అభ్యర్థులను ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఆఫీసర్ 600 పోస్టులు (ఎస్సీ-87, ఎస్టీ-57, ఓబీసీ-158,ఈ డబ్ల్యూఎస్-58, యూఆర్-240)

అర్హతలు: ఏదైనా సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయస్సు: 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి(2024 ఏప్రిల్ 1 నాటికి) (1994 ఏప్రిల్ 2 - 2003 ఏప్రిల్ 1 మధ్యలో జన్మించి ఉండాలి). వివిధ వర్గాల వారికి కేటగిరీలను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఫీజు: రూ.750/- (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు చెల్లింపులో కొంత మినహాయింపు ఉంది)

చివరి తేదీ: 2025 జనవరి 16

ప్రిలిమినరీ పరీక్ష: మార్చి 8, 15న నిర్వహిస్తారు.

ఎంపిక విధానం

ప్రిలిమినరీ: వంద మార్కులకు వంద ప్రశ్నలుంటాయి. ఒక గంట సమయంలో పూర్తి చేయాలి. ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. ఇంగ్లీషు 40 ప్రశ్నలు, క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు, రీజనింగ్ ఎబిలిటీ 30 ప్రశ్నలు

మెయిన్స్: మొత్తం 200 మార్కులకు 170 ప్రశ్నలు ఉంటాయి. మూడు గంటల్లో పూర్తి చేయాలి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్(40 ప్రశ్నలు-60 మార్కులు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్(30 ప్రశ్నలు-60 మార్కులు), జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ/ బ్యాంకింగ్ నాలెడ్జ్(60 ప్రశ్నలు, 60 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు, 20 మార్కులు). డిస్క్రిప్టివ్ పేపర్ 50 మార్కులకు ఉంటుంది. దీనిని 30 నిమిషాల్లో పూర్తి చేయాలి.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం.

వివరాలకు bank.sbi/web/careers/current-openings వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

Dr. A.P.J.Abdul Kalam Young Research Fellowship

Description: Dr. A. P. J. Abdul Kalam Young Research Fellowship 2024 is an opportunity provided by the Technology, Education, Research and Rehabilitation for the Environment (TERRE) Policy Center to students pursuing or have completed undergraduate, postgraduate or Ph.D. degree in any field related to environmental research.

Eligibility: Applicants must be Indian citizens pursuing or having completed an undergraduate or postgraduate degree (M.Sc., M.E., M.A.) or Ph.D. degree in any field related to environmental research. They must be between the age group of 18 and 25 years old as of December 31st, 2024, and demonstrate outstanding research contributions made in India towards environmental protection or improvement.



Prizes & Rewards: A fellowship of up to 25,000 and a certificate

Last Date to Apply: 15-02-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/APJF1

Deakin India Postgraduate Bursary

Description: The Deakin India 20% Postgraduate Bursary 2024 is an opportunity provided by Deakin University, Australia to Indian graduates. This bursary aims to financially assist deserving students with their university fees and all study costs.

Eligibility: Open for Indian citizens with a valid Indian passport and residing in India at the time of application. They must also apply through a Deakin Authorised Agent based in India and have an overall score of 55% – 74.99% in their undergraduate degree.

Prizes & Rewards: A 20% reduction in tuition fees

Last Date to Apply: 31-01-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/DIPB4

SCHOLARSHIP ALERT

Kotak Suraksha

Description: Kotak Securities Limited (KSL) invites applications from students pursuing general/professional graduation.

Eligibility: Open to PwD applicants across India who are currently pursuing general or professional graduation courses. Applicants must have secured at least 55% marks in their previous academic year, and their annual family income must not exceed INR 3,20,000.

Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year

Last Date to Apply: 23-01-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSP3

buddy4study.com

చిత్రజ్యోతి


SINCE 1965

యాక్షన్ హంగామా



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా తమిళ దర్శకుడు ఏ.ఆర్. మురుగదాస్ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'సికందర్'. రష్మిక మందన్న కథానాయిక. సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో సల్మాన్ లుక్, సంభాషణలు, యాక్షన్ హంగామాతో పాటు విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ టీజర్ చూసిన అభిమానులు.. ఈ సారి సల్మాన్‌కు హిట్ పక్కా అని ఆనందపడుతున్నారు. వచ్చే ఏడాది రంజాన్ కానుకగా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. అయితే, ఈ టీజర్ సల్మాన్ పుట్టినరోజున విడుదల కావాల్సి ఉండగా.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ ఒక రోజు వాయిదా వేశారు. కాగా, ఇటీవలే విడుదలైన 'బేబీ జాన్', 'సింగమ్ అగైన్' చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించిన సల్మాన్ అభిమానులను అలరించారు.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్



కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్. విశ్వకరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సినిమా టీజర్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. జనవరి 3న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. 'ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. లవ్, రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'క' సూపర్ హిట్ తరువాత కిరణ్ అబ్బవరం చేస్తున్న చిత్రంగా 'దిల్ రూబా'పై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి' అని చిత్ర బృందం పేర్కొంది.



ఇక దబిడి దిబిడే

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డాకు మహారాజ్'. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌లో బాలకృష్ణతో కలసి స్టెప్పులేశారు బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా. ఈ పాట ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. 'అమెరికాలో జనవరి 4న, ఇండియాలో జనవరి 5న 'డాకు మహారాజ్' సినిమాలోని మూడో పాటను విడుదల చేయనున్నాం. ఇక దబిడి దిబిడే' అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పేర్కొంది.

మలయాళ సినిమాకు రూ.700 కోట్ల నష్టం

ప్రతీ ఏడాది విభిన్న తరహా చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది మలయాళ చిత్ర పరిశ్రమ. కానీ ఈ ఏడాది మలయాళ చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయినట్లు కేరళ చిత్ర నిర్మాతల సంఘం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ ఏడాది రూ. 1000 కోట్లు పెట్టి 199 సినిమాలు నిర్మించగా.. కేవలం 26 చిత్రాలు మాత్రమే విజయతీరాలకు చేరాయని తెలిపింది.

పారితోషికమే పెద్ద సమస్య

"సినిమాల బడ్జెట్ అదుపులో ఉంటే ఉండాలి. తక్కువ బడ్జెట్‌తో సినిమాలు తీయాలి. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో ఎక్కువగా ఫ్లాప్ అయ్యినందున ప్రొడక్షన్ ఖర్చుల్లో కోత విధించాలి. నటీనటుల పారితోషికం ఒక పెద్ద సమస్యగా మారింది. నటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోవడానికి సిద్ధపడాలి. ఈ విషయాన్ని పలుసార్లు నటీనటులతో ప్రస్తావించాం. కానీ వారు తగ్గించుకోకపోగా మరింతగా పారితోషికాన్ని పెంచుకుంటున్నారు. నటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోకుంటే తీవ్ర సంక్షోభం తప్పదు. పక్క రాష్ట్రాల్లో తగిన మార్కెట్ లేకుండా ఏడాదికి దాదాపు 200 చిత్రాలు నిర్మించడం దీర్ఘకాలంలో పరిశ్రమ మనుగడకు చేటు చేస్తుంది. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో స్టార్ హీరోలు నటించిన వాటికంటే మోస్తరు బడ్జెట్‌తో నిర్మించినవే హిట్ అవ్వడాన్ని మేకర్స్ గమనించాలి. అందుకు తగ్గట్లు సినిమాల నిర్మాణంలో మార్పులు చేసుకోవాలి. థియేటర్లకు ప్రజలని రప్పించే సినిమాలపై దృష్టి పెట్టాలి. ఈ ఏడాది మొత్తం 199 చిత్రాలు విడుదలయ్యాయి. అందులో కేవలం 26 చిత్రాలు విజయవంతం అయ్యాయి. రూ.1000 కోట్ల పెట్టుబడి పెడితే కేవలం రూ.300 కోట్లు మాత్రమే తిరిగి పొందగలిగాము. రూ.700 కోట్ల నష్టం వచ్చింది" అని రిపోర్ట్‌లో కేరళ చిత్ర నిర్మాతల సంఘం పేర్కొంది.



జనవరి 1న ట్రైలర్

దిల్ రాజు

హీరో రామ్‌చరణ్ 256 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటుచేసి మెగా అభిమానులు వరల్డ్ రికార్డు సాధించారని నిర్మాత దిల్ రాజు కొనియాడారు. విజయవాడలోని వజ్రా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కటౌట్‌కు ఆదివారం హెలికాప్టర్ ద్వారా పూలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దిల్ రాజు మాట్లాడుతూ సినీ రాజధాని, తెలుగు సినిమా పుట్టినిల్లుగా పేరొందిన విజయవాడలో ఈ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జనవరి 1న గేమ్‌చేంజర్ ట్రైలర్ విడుదల చేస్తున్నామని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చే సమయాన్ని బట్టి జనవరి 4, 5 తేదీల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కటౌట్‌ను ఏర్పాటు చేసినందుకు గాను ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డ్స్‌ను ఆ సంస్థ ప్రతినిధులు దిల్ రాజుకు అందజేశారు.

విజయవాడ (లబ్బీపేట),(ఆంధ్రజ్యోతి)



ప్రియాంక రీ ఎంట్రీ

బాలీవుడ్ ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రా తిరిగి భారతీయ చిత్రాల్లో నటించనున్నారా? అంటే అవుననే అంటోంది బాలీవుడ్ మీడియా. ఎనిమిదేళ్ల క్రితం హాలీవుడ్‌కి వెళ్లిన ప్రియాంక 'సిటాడెల్', 'ద మ్యాట్రిక్స్ రిసరెక్షన్స్' వంటి వెబ్‌సిరీస్, సినిమాలతో పాపులర్ అయ్యారు. కాగా, బాలీవుడ్ డైరెక్టర్ ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించనున్న 'జీ లే జరా' చిత్రంలో ప్రియాంక నటించనున్నారనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను ప్రియాంక గానీ, నిర్మాణ సంస్థ గానీ ధృవీకరించలేదు. దాంతో ఆమె రీ ఎంట్రీ ఇచ్చే సినిమా ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో మరో వార్త బాలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. మహేశ్ బాబు హీరోగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి తెరకెక్కించే ఎస్ఎస్ఎమ్‌బీ29 సినిమాలో ప్రియాంక ఛాన్స్ కొట్టేశారనే వార్తలు బాలీవుడ్ మీడియాలో వెలువడుతున్నాయి. దీంతో భారతీయ చిత్రాల్లోకి ప్రియాంక చోప్రా ఎంట్రీ ఇచ్చే మూవీ ఇదేనని ఆమె అభిమానులు చర్చించుకుంటున్నారు.


చక్కని ఆదరణ లభిస్తోంది



శివ రెడ్డి హీరోగా ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. లయన్ శ్రీరాం దత్తి నిర్మించారు. రీసెంట్‌గా విడుదలైన ఈ చిత్రం మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ 'కుటుంబ విలువలతో 'ఓ తండ్రి తీర్పు' చిత్రాన్ని నిర్మించారు. ఆస్తులపై ఉన్న ప్రేమ తల్లిదండ్రులపై లేకపోవడం ఎంతో మానసిక క్షోభకు గురిచేస్తుంది అనే ఇతివృత్తంతో తీసిన ఈ చిత్రానికి చక్కని ఆదరణ లభిస్తోంది. మంచి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి రుజువు అయ్యింది. చక్కటి సందేశం ఉన్న ఈ సినిమాను ప్రతి కుటుంబం చూడాలని కోరుతున్నా' అని అన్నారు.

మార్చిలో సెట్స్‌పైకి షారుక్ చిత్రం

షారుక్ ఖాన్ సుజయ్ ఘోష్ దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'కింగ్'. రెడ్ చిల్లీస్ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాలో అభిషేక్ బచ్చన్ నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో నటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు



జరుగుతున్నాయి. ఇందులోని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం అంతర్జాతీయ స్టంట్ డైరెక్టర్లు పనిచేయనున్నట్లు బాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో షారుక్ కుమార్తె సుహానా ఖాన్ కూడా నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



మరోసారి నువ్వే కావాలయ్యా

రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్' చిత్రంలో 'నువ్వే కావాలయ్యా' అంటూ ప్రత్యేక గీతంలో నర్తించి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేశారు తమన్నా భాటియా. సినిమా విజయంలో ఆ గీతం సైతం కీలకపాత్ర పోషించింది. ఇప్పుడు మరోసారి జైలర్‌తో కలసి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారట తమన్నా. 'జైలర్ 2'లోనూ తమన్నా ప్రత్యేక గీతంలో మెరవనున్నారని కోలీవుడ్ టాక్. అంతేకాదు దర్శకుడు నెల్సన్ రెండో భాగంలో ఆమె పాత్ర నిడివిని పెంచారనీ, కథలో కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. అలాగే 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి కూడా ఈ చిత్రంలో నటించబోతున్నారని తెలుస్తోంది. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మార్చిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.

నిన్నటి ఘనతలు 2024
2025 రేపటి ఆశలు

రెండు రోజుల్లో కొత్త సంవత్సరం వచ్చేస్తోంది. 2025 మీద తమ ముద్ర వేయడానికి సిద్ధమవుతున్న ఎందరో మహిళల్లో... ఒకరు నెలసరి సమయంలో మహిళల ఇబ్బందులను పరిష్కరించే సాధనాన్ని దేశమంతా విస్తరించే ప్రయత్నంలో ఉన్నారు. మరొకరు ఈ ఏడాది 'కేన్స్'లో పురస్కారం సాధించి... 'గోల్డెన్ గ్లోబ్' రేసులో ఉన్నారు. ఆ సంగతులివి..

ప్రముఖ అమెరికన్ పత్రిక 'ఫోర్బ్స్' ఏటా వ్యాపారం, వినోదం, రాజకీయాలు, దాతృత్వం వంటి విభిన్న రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతినార్జించిన వ్యక్తుల జాబితాలను విడుదల చేస్తూ ఉంటుంది. ఈ ఏడాది విడుదల చేసిన వందమంది అత్యంత శక్తిమంతులైన మహిళల జాబితాలో ముగ్గురు భారతీయ మహిళలు చోటు దక్కించుకున్నారు.



నిర్మలా సీతారామన్

ఈ జాబితాలో భారత ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ 28వ స్థానంలో నిలిచారు. ఆమె 2019 మేలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎంతో క్లిష్టమైన ఆర్థిక శాఖను పూర్తిస్థాయిలో నిర్వహించిన మొదటి మహిళగా గుర్తింపు పొందారు. 2024 సార్వత్రిక ఎన్నికల తరవాత తిరిగి అదే శాఖకు నియమితురాలయ్యారు. ఆమె సారథ్యంలో భారత్ దాదాపు నాలుగు ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే అయిదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. 2027 నాటికి దేశ జీడీపీ జర్మనీ, జపాన్‌లను దాటి... భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆమె గర్వంగా చెబుతున్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం అక్షరాస్యత, వ్యవస్థాపకత కార్యక్రమాలు రూపొందించి విజయవంతంగా అమలు చేశారు. నిర్మలా సీతారామన్ రాజకీయాల్లోకి రాకముందు యూకెలోని అగ్రికల్చరల్ ఇంజనీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వహించారు. భారత జాతీయ మహిళా మిషన్ సభ్యురాలిగా కూడా పనిచేశారు.



రోష్నీ నాడార్ మల్హోత్రా

దేశంలోని ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో 81వ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆమె హెచ్‌సీఎల్ కార్పొరేషన్ సీఈఓ కూడా! తండ్రి శివ్ నాడార్ స్థాపించిన 12 బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని పర్యవేక్షిస్తూ, అంచెలంచెలుగా అభివృద్ధి చేసి... తనకు సాటిలేదనిపించుకున్నారు. ఎంఎస్ మల్హోత్రా- శివ్ నాడార్ ఫౌండేషన్ ధర్మకర్తగా కూడా వ్యవహరిస్తున్నారు. ట్రాన్స్‌ఫర్మేటివ్ ఎడ్యుకేషన్ ఆవశ్యకతను చాటిచెబుతూ ఎన్నో సంస్థలు స్థాపించారు. స్వదేశీ జాతుల పరిరక్షణకు 'ది హాబిటాట్స్ ట్రస్ట్'ను నెలకొల్పారు. కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఎంబీఏ పూర్తిచేసిన రోష్నీ నాడార్‌కు జర్నలిజంలో కూడా ప్రవేశం ఉంది.



కిరణ్ మజుందార్ షా

● బయోకాన్ బయోఫార్మాస్యూటికల్ కంపెనీ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా 82వ స్థానంలో నిలిచారు. 1978లో ఆ సంస్థ స్థాపన నుంచి దాని అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేస్తూ ఎన్నో విజయాలు సాధించారు, అంతర్జాతీయ మార్కెట్లో స్థానం సంపాదించారు. ఆసియాలోనే అతిపెద్ద ఇన్సులిన్ తయారీ కేంద్రాన్ని మలేసియాలో నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం వయాట్రిస్ గ్లోబల్ హెల్త్ కంపెనీకి 3.3 బిలియన్ డాలర్లు చెల్లించి బయోసిమిలర్స్ వ్యాపారాన్ని సొంతం చేసుకున్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలోని బికారా థెరప్యూటిక్స్ విలువ నాస్డాక్‌లో 362 మిలియన్ డాలర్లకు చేరడం ఆమె సాధించిన ఘన విజయంగా చెప్పవచ్చు. క్యాన్సర్ పరిశోధనల కోసం గ్లాస్గో విశ్వవిద్యాలయానికి 7.5 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చారు. మొదట కిరణ్ వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనుకున్నారు. కానీ విభిన్నమార్గాన్ని ఎంచుకుని దేశం గర్వించదగ్గ వ్యవస్థాపకురాలిగా ఎదిగారు. ప్రస్తుతం బయోకాన్ సంస్థ కరోనా వైరస్ వేరియంట్‌ల కోసం యాంటీ బాడీ థెరపీ విధానాలపై పనిచేస్తోంది. ఫోర్బ్స్- భారతదేశంలోని అత్యంత సంపన్నుల జాబితా-2024లో కిరణ్ మజుందార్ షా 91వ స్థానంలో నిలిచారు.



హర్షనిశా పరేజన్

ఆరోగ్యంతోనే సాధికారత సాధ్యం... ఇది హర్షనిశా పరేజన్ నినాదం. ఆమె బెంగళూరు కేంద్రంగా 'టక్కిన్' అనే సంస్థను స్థాపించి... మహిళల రుతుక్రమ సమస్యలకు పరిష్కారాలను చూపడానికి కృషి చేస్తున్నారు. "మా కుటుంబంలో మొదటి గ్రాడ్యుయేట్‌ను నేనే. పేదరికం కారణంగా ఎదురయ్యే సవాళ్ళను ప్రత్యక్షంగా చూశాను. చదువు పూర్తి చేసుకొని, ఆరోగ్య రంగంలోకి అడుగుపెట్టిన తరువాత... సమాజంలో అర్థవంతమైన మార్పును సృష్టించడానికి నా వంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నాను. అందుకే 'టక్కిన్'ను ఏర్పాటు చేసి, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాను అంటున్నారు హర్షనిశా. "మహిళలు సాధికారత సాధించాలంటే.. ఆరోగ్యంగా ఉండాలి. ప్రత్యేకించి రుతుసంబంధమైన ఇబ్బందులు దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాదు... మహిళల పురోగతికి కూడా అవరోధాలు నిలుస్తాయి. అందుకే ఈ క్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు స్థిరమైన పరిష్కారాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను" అని చెబుతున్నారు. సైకాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆమెకు నిధుల సేకరణ, విద్యా కార్యక్రమాల రూపకల్పన తదితరాల్లో అనుభవం ఉంది. పలు అంతర్జాతీయ సంస్థల్లో, పలు ఐక్య రాజ్య సమితి ప్రాజెక్టుల్లో పని చేశారు. ఆ తరువాత 'టక్కిన్'ను ఏర్పాటు చేసి... మహిళలకు, బాలికలకు నెలసరి ఆరోగ్యం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నారు. సురక్షితమైన పద్ధతులు పాటించేలా చేస్తున్నారు. ప్రతి ఒక్కరితోనూ స్వయంగా సంభాషించి వారి సమస్యలు తెలుసుకోవడానికి, వాటిని నివారించుకొనే మార్గాలు చూపడానికి ఈ సంస్థ ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటివరకూ గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 5 వేల మందికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు... అట్టడుగు వర్గాలకు చెందిన సుమారు 2 వేల మందికి 'మెన్‌స్ట్రువల్ కప్స్' ఉచితంగా అందజేసింది. 2025ను తన ప్రయాణంలో ప్రతిష్ఠాత్మకమైన సంవత్సరంగా హర్షనిశా భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా మెన్‌స్ట్రువల్ కప్స్ లాంటి దీర్ఘకాలికంగా వినియోగించగలిగే, చవకయిన, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాల గురించి మరింత విస్తృతంగా ప్రచారం చెయ్యడం, అవసరమైనవారికి అందజేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. "నెలసరి గురించి ధైర్యంగా మాట్లాడే పరిస్థితి ఇప్పటికీ చాలా చోట్ల లేదు. ఈ పరిస్థితిలో మార్పు కోసమే నా ప్రయత్నం" అంటారు హర్షనిశా.



పాయల్ కపాడియా

గోల్డెన్ గ్లోబ్... సినీ, టెలివిజన్ రంగాలకు ఇచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ అంతర్జాతీయ పురస్కారం కోసం ప్రపంచవ్యాప్తంగా ఎందరో కలలుకంటారు. 1943లో ప్రారంభమైన ఈ అవార్డులకు భారతదేశం నుంచి గతంలో ఏడుసార్లు నామినేషన్స్ ఆమోదం పొందగా, నాలుగు పురస్కారాలు లభించాయి. అయితే ఈ అవార్డు గ్రహీతలైన భారతీయుల్లో మహిళలు ఎవరూ లేరు. మీరానాయర్ రెండుసార్లు నామినేట్ అయినా... పురస్కారం అందుకోలేకపోయారు. 2025లో... పాయల్ కపాడియా 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రం ఆ లోటు తీరుస్తుందని సినీ అభిమానులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది 'కేన్స్ చలనచిత్రోత్సవం'లో... రెండవ అతి పెద్ద అవార్డ్ 'గ్రాండ్ ప్రిక్స్'ను పాయల్ అందుకున్నారు. చిత్రకారిణి అయిన తల్లి నళినీ మాలిని ప్రోత్సాహంతో కళలపై అభిమానం పెంచుకున్న పాయల్ విద్యాభ్యాసం ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో ఉన్న రుషీ వ్యాలీ స్కూల్‌లో సాగింది. ఆ తరువాత 'పుణే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా' (ఎఫ్‌టిఐఐ)లో ఫిల్మ్ డైరెక్షన్ కోర్సు చేశారు. ప్రకటనలు, వీడియో చిత్రాలను రూపొందించారు. బిజెపి నాయకుడైన నటుడు గజేంద్ర చౌహాన్‌ను ఎఫ్‌టిఐఐకి చైర్మన్‌గా నియమించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన 139 రోజుల సుదీర్ఘ సమ్మెకు నాయకత్వం వహించినవారిలో ఆమె ఒకరు. దీంతో ఒక వర్గం ఆమెను 'దేశద్రోహి'గా ముద్ర వేసింది. ఎఫ్‌టిఐఐ కేసు కూడా పెట్టింది. ఇలాంటి అవరోధాలు ఎదుర్కొంటూనే 'ది లాస్ట్ మ్యాంగో బిఫోర్ మాన్‌సూన్' చిత్రం తీశారు. అది 'ఒబెర్హాసెన్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం'లో ప్రత్యేక జ్యూరీ పురస్కారం సాధించింది. తరువాత తీసిన 'ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్' లఘు చిత్రం 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'కు భారతదేశం నుంచి అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. అలాగే మరో చిత్రం '...అండ్ వాట్ ఈజ్ ది సమ్మర్ సేయింగ్' కూడా అనేక అంతర్జాతీయచలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. ఆమె కొత్త చిత్రం 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' ఈ ఏడాది 'కేన్స్'లో మెరిసింది. వచ్చే ఏడాది 'గోల్డెన్ గ్లోబ్'ను లక్ష్యంగా చేసుకుంది. అది ముంబాయిలోని ఒక నర్సింగ్ హోమ్‌లో పని చేస్తున్న ఇద్దరు నర్సుల కథ. వారిద్దరూ చేపట్టిన ఒక ప్రయాణంతో వారి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయో పాయల్ ఆసక్తికరంగా మలిచారు. 82వ 'గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్' కోసం బెస్ట్ డైరెక్టర్, ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీల్లో రెండు నామినేషన్లు ఈ చిత్రానికి లభించాయి. 2025 జనవరి మొదటివారంలో పురస్కార వేడుక జరుగుతుంది. 'గోల్డెన్ గ్లోబ్' సాధించిన తొలి భారతీయ మహిళగా పాయల్ చరిత్ర సృష్టిస్తారా? తెలుసుకోవాలంటే కొన్నాళ్ళు ఆగాల్సిందే...

వీరిది విజయ పథం

కొందరి విజయాలు లక్షల మందిలో స్ఫూర్తిని నింపుతాయి. సామాన్య కుటుంబాల నుంచి వచ్చినా పట్టుదల ఉంటే సాధించలేనిదేమి లేదనే ఆశను రేకెత్తిస్తాయి. 2024లో ఈ విధంగా కొన్ని లక్షల మందిలో స్ఫూర్తిని నింపిన మహిళలెవ్వరో ఒక్కసారి చూద్దాం..



శీతల్‌దేవి

వైకల్యం శరీరానికే కానీ మెదడుకు కాదని నిరూపించిన వ్యక్తి శీతల్‌దేవి. చేతులు లేని విలువిద్యా క్రీడాకారిణి. 2024 సమ్మర్ పారా ఒలింపిక్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పడమే కాకుండా కాంస్య పతకం కూడా గెలుచుకుంది. అతి సామాన్య కుటుంబానికి చెందిన శీతల్‌దేవి- భారతీయ సైన్యం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు- ఆమెలో ఏదో ఒకటి సాధించాలనే తపన వేళ్లూనుకుంది. అనేక కష్టనష్టాలకు ఎదురొడ్డి ప్రపంచ రికార్డు సాధించేలా చేసింది. దివ్యాంగులకే కాకుండా కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలిచింది.



మనూ బాకర్

ఇంటిపక్క అమాయకంగా కనిపించే అమ్మాయిలా ఉండే మనూ బాకర్ ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో మూడు మెడల్స్ సాధించింది. ఒలింపిక్స్‌లో ఒకే తరహా గేమ్‌లో ఎక్కువ మెడల్స్ సాధించిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. ఒకప్పుడు మహిళా క్రీడాకారిణిలు అథ్లెట్స్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ మొదలైన క్రీడల్లో మాత్రమే రాణించేవారు. మనూ బాకర్ ఇతర క్రీడల్లో కూడా మన వాళ్లు రాణించగలరని నిరూపించింది.



మోహనా సింగ్ జితర్‌వాల్

శత్రువులతో యుద్ధాలు కేవలం పురుషులకు మాత్రమే అనేది ఒకప్పటి మాట! ప్రస్తుతం భారతీయ సైనిక దళాలలో మహిళలు కూడా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. మన భారతీయ సరిహద్దుల్లోని ఇతరులు చొచ్చుకురాకుండా కాపలాకాసే 'ఫ్లైయింగ్ బులెట్స్'లో చేరిన తొలి ఫైటర్ పైలట్‌గా మోహనా సింగ్ ఈ ఏడాది చరిత్ర సృష్టించింది. ఒకప్పుడు వైమానిక దళంలో ఫైటర్ పైలెట్స్ ఉండేవారు కారు! కేవలం పురుషులకు మాత్రమే ఆ అవకాశం లభించేది. 2016లో మోహనా సింగ్ తొలిసారి మహిళా ఫైటర్ పైలెట్ అయింది. ఆ తర్వాత ఆమె ఎప్పుడూ వెనక్కి తిరిగి చూడలేదు.



రేచల్ గుప్తా

అందంతో పాటుగా సమాజానికి ఏదో చేయాలనే తపన ఉన్నవారు అతి తక్కువ ఉంటారు. అలాంటి వారిలో ఒకరు రేచల్ గుప్తా. ఈ ఏడాది మిస్ గ్రాండ్ ఇంటర్నేషన్‌ను గెలుచుకొంది. ఈ పోటీ ఫైనల్స్‌లోని ప్రశ్నలకు రేచల్ ఇచ్చిన సమాధానాలు అనేక మందిని ఆకట్టుకున్నాయి. మోడలింగ్‌తో పాటుగా ఒక స్వచ్ఛంద సంస్థను నడుపుతున్న రేచల్ అనేక సామాజిక కార్యక్రమాల్లో కూడా పాల్గొంటోంది.

దివ్యా దేశ్‌ముఖ్

చెస్‌లో మన దేశానికి ప్రత్యేక స్థానముంది. దీనిని ఈ ఏడాది మరో ఎత్తుకు తీసుకువెళ్లిన వారిలో దివ్యా దేశ్‌ముఖ్ ఒకరు. ఈ ఏడాది అండర్ 20 మహిళా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకొంది. 2025లో దివ్య మరిన్ని ఛాంపియన్‌షిప్‌లు గెలుస్తుందని చెస్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.





సాద్నా సక్సేనా నాయర్

సైనిక దళాలలో డైరక్టర్ జనరల్ ఆఫ్ మెడికల్ సర్వీసస్ (ఆర్మీ)కి ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ ఏడాది ఈ స్థానానికి సాద్నా సక్సేనా నాయర్ చేరుకొని చరిత్ర సృష్టించారు. సైనిక దళాల చరిత్రలో ఈ స్థానాన్ని చేరుకొన్న తొలి మహిళా అధికారి సాద్నా కావటం ఒక విశేషం.

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్ పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70,
హుడా హైట్స్, జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

23 చుక్కలు వరుస వచ్చేవరకు ఎదురెదురు



పి. జ్యోతి,
పలాస,
శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్



హంపి కొత్త చరిత్ర

భారత గ్రాండ్‌మాస్టర్, తెలుగమ్మాయి కోనేరు హంపి అంతర్జాతీయ వేదికపై మరోసారి మెరిసింది. ప్రపంచ ర్యాపిడ్ చెస్ మహిళల విభాగం చాంపియన్‌గా నిలిచింది. తద్వారా ప్రపంచ చెస్‌లో ఈ టైటిల్‌ను రెండుసార్లు అందుకున్న తొలి భారత మహిళగా.. ఓవరాల్‌గా రెండో క్రీడాకారిణిగా సరికొత్త చరిత్ర సృష్టించింది.

తెలుగు తేజానికి వరల్డ్ ర్యాపిడ్ చెస్ కిరీటం

- రెండోసారి టైటిల్‌తో రికార్డు
- పురుషుల విజేత ముర్జిన్


ముర్జిన్

న్యూయార్క్: ఎన్నాళ్ల కెన్నాళ్లకు..కోనేరు హంపి ఓ ప్రపంచ టైటిల్‌తో సత్తా చాటింది. తాను అద్భుతంగా రాణించే ర్యాపిడ్ చెస్‌లో విశ్వవిజేతగా ఆవిర్భవించింది. ఇక ఈ టోర్నమెంట్ పురుషుల విభాగంలో రష్యా టీనేజర్ వొలొదార్ ముర్జిన్ చాంపియన్‌గా నిలిచాడు. ఏడాదిగా ఎన్నో టోర్నమెంట్లలో పేలవ ప్రదర్శనతో నిరాశ పరుస్తున్న 37 ఏళ్ల హంపి ఎట్టకేలకు ట్రోఫీతో ఆనంద డోలికల్లో మునిగింది. వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో టైటిలే లక్ష్యంగా బరిలో దిగిన ఆమె అనుకున్నది సాధించింది. ఆదివారం జరిగిన 11వ, ఆఖరి రౌండ్‌లో ఇండోనేసియాకు చెందిన సుకందర్‌ను హంపి చిత్తు చేసింది. తద్వారా మొత్తం 8.5 పాయింట్లతో తెలుగుతేజం టైటిల్ దక్కించుకుంది. అంతేకాదు..ఈ టైటిల్‌ను రెండోసారి అందుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. 2019లో జార్జియాలో జరిగిన టోర్నీలో హంపి తొలిసారి ర్యాపిడ్ టైటిల్ సొంతం చేసుకుంది. భారత్‌కు చెందిన నెం.1 హంపి..చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ తర్వాత ఈ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌ను ఒకటికంటే ఎక్కువసార్లు కైవసం చేసుకొని రికార్డు సృష్టించింది. కాగా హంపి గతేడాది రజతం అందుకుంది. ఈ విజయంతో హంపికి రూ. 51.2 లక్షల ప్రైజ్‌మనీ లభించింది. ఇక ఇదే టోర్నీలోని బ్లిట్జ్ చాంపియన్‌షిప్ ఓపెన్, మహిళల విభాగం పోటీలు మంగళ, బుధవారాల్లో జరుగుతాయి. నాకౌట్ పోటీలన్నీ బుధవారమే ఉంటాయి.

ఈసారి తొలి రౌండ్ పరాజయంతో టోర్నీని ఆరంభించిన హంపి ఆపై పుంజుకొని తదుపరి రెండు గేమ్‌ల్లో విజయం సాధించింది. నాలుగో రౌండ్‌ను డ్రా చేసుకున్న ఆమె..ఆ తర్వాత వరుసగా నాలుగు రౌండ్‌లలో జయకేతనం ఎగుర వేయడం విశేషం. జు వెన్‌జున్ (8) రజతం, కాటరినా లగ్నో (రష్యా, 8) కాంస్య పతకం సాధించారు. టైటిల్ రేసులో నిలిచిన మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక చివరి రౌండ్‌ను డ్రా చేసుకుంది. దాంతో ఎనిమిది పాయింట్లతో ఆమె ఐదో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 21వ స్థానం, వైశాలీ (5.5) 52వ, వంతిక అగర్వాల్ (5) 67వ స్థానంలో నిలిచారు.

ఓపెన్ విజేత ముర్జిన్: ర్యాపిడ్ ఓపెన్ విభాగంలో రష్యాకు చెందిన వొలొదార్ ముర్జిన్ టైటిల్ దక్కించుకున్నాడు. 13 రౌండ్ల ద్వారా ముర్జిన్ 10 పాయింట్లు సాధించాడు. రష్యాకే చెందిన గ్రిష్‌చుక్ (9) రజతం, నెపోమ్నియాచి (9.5) కాంస్య పతకాలు నెగ్గారు. 18 ఏళ్ల ముర్జిన్ పిన్నవయస్సులో వరల్డ్ ర్యాపిడ్ టైటిల్ అందుకున్న రెండో ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ అబ్దుసతొరోవ్ 17 ఏళ్ల వయస్సులో ర్యాపిడ్ టైటిల్ సాధించి తొలిస్థానంలో ఉన్నాడు.

ప్చ్..అర్జున్: టైటిల్ రేసులో నిలిచిన అర్జున్ ఇరిగేసి ఐదో స్థానంతో నిరాశ పరిచాడు. శనివారం..తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి అగ్రస్థానంలో ఉన్న అర్జున్ ఆదివారం జరిగిన ఆఖరి నాలుగు రౌండ్లలో..ఒక విజయం మరో పరాజయంతో పాటు మిగిలిన రెండు గేమ్‌లను డ్రాగా ముగించాడు. దాంతో.. ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం ద్వారా 2026 క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాలన్న అర్జున్ ఆశలు నెరవేరలేదు. మరో భారత ఆటగాడు ప్రజ్ఞానంద (8.5) 17వ స్థానంలో నిలిచాడు.



15 ఏళ్లకే గ్రాండ్‌మాస్టర్.. మూడు దశాబ్దాలకు పైగా చెస్ కెరీర్‌లో ఎన్నో విజయాలు.. మరెన్నో మైలురాళ్లను అధిగమించిన ఘన చరిత్ర.. అర్జున, పద్మశ్రీ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు.. దేశ మహిళా చెస్ రారాణిగా నీరాజనాలు.. చెస్ ప్రపంచంలో తిరుగులేని దిగ్గజ గ్రాండ్‌మాస్టర్‌గా పేరు. అంతటి ప్రఖ్యాత క్రీడాకారిణికి 2024 ఏడాది కఠిన సవాళ్లను విసిరింది. రెండు టోర్నీల్లో వరుస పరాజయాలతో నిద్రలేని రాత్రులు గడిపింది. ఇక చెస్‌కు వీడ్కోలు పలుకుదామనుకున్న మానసిక స్థితి నుంచి ఒక్కో విజయంతో మరోసారి మునుపటి హంపిను మరిపిస్తూ ప్రపంచ ర్యాపిడ్ చెస్ కిరీటాన్ని సగర్వంగా రెండోసారి అందుకొని చరిత్ర సృష్టించింది. ఏడేళ్ల బిడ్డకు తల్లిగా ఒక పక్క కుటుంబాన్ని చూసుకుంటూనే మరో పక్క ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన హంపి విశేషాలు ఆమె మాటల్లోనే..

నిద్రలేని రాత్రులు.. కఠిన సవాళ్లు

కెరీర్‌కు గుడ్‌బై చెబుదామనుకున్నా

'ఆంధ్రజ్యోతి'తో హంపి

నిద్ర లేని రాత్రులు.. ఓటమి భారం.. ఇక చెస్ ఆడగలనా అనే ప్రశ్నలు.. వీటన్నింటికి ఈ విజయం సమాధానం చెప్పింది. నా వయసు ఇప్పుడు 37 ఏళ్లు. ఈ దశలో సాధారణంగా క్రీడాకారులు ఆటలో ప్రభ కోల్పోతుంటారు. ఈ ఏడాది రెండు టోర్నీల్లో ఎదురైన పరాభవాలు నా మదిలో ఆటపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యేలా చేశాయి. ఇకపై నేను చెస్ ఆడగలనా? లేక ఆటకు వీడ్కోలు పలుకుదామా? అనే మానసిక స్థితి నుంచి మరోసారి ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉంది. మరి కొంతకాలం చెస్‌తో నా ప్రయాణం కొనసాగించేందుకు ఈ ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ ఉత్ప్రేరకాన్ని అందించింది. భగవద్గీతలోని కొన్ని శ్లోకాలు కూడా నాలో నూతన ఉత్తేజాన్ని నింపాయి. అంత:కరణ శుద్ధితో మన పని మనం చేస్తూ ఉంటే ఫలితాలు కచ్చితంగా వస్తాయనేది నా జీవితంలో ఈ విజయంతో రుజువైంది.

తాడో పేడో..

2019లో మాస్కోలో జరిగిన వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ గెలవాలన్న పట్టుదలతో తలపడి విజయం సాధించా. కానీ, ఈసారి మాత్రం కెరీర్ కొనసాగించాలా? లేక రిటైర్ వ్వాలా అన్న విషయమై ఓ నిర్ణయానికి రావాలన్న ఆలోచనతో బరిలోకి దిగా. టోర్నీ ప్రారంభంలో ఎదురైన ఓటములు నాలో మరింత కసి పెంచాయి. తాడో పేడో తేల్చుకుందామనే ధోరణిలో మిగిలిన గేమ్‌ల్లో ఆడి గెలిచా. ఈ విజయం నా కెరీర్‌లోనే అత్యుత్తమమైనది.

కొవిడ్ తర్వాత చాలా మార్పులు

మాస్కోలో జరిగిన పోటీల్లో నేను ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్‌ను తొలిసారి గెలిచినప్పటికి, ఇప్పటికి ఆటలో చాలా మార్పులు వచ్చాయి. గ్రాండ్‌మాస్టర్ల ఎత్తుల్లో వేగం, వ్యూహాత్మకత పెరిగింది. ఆన్‌లైన్ చెస్ సాహిత్యం పెరగడంతో విభిన్న ప్రారంభ ఎత్తులను ప్లేయర్లు భయం లేకుండా ప్రయోగిస్తున్నారు. ఆన్‌లైన్ చెస్ పోటీలు పెరగడంతో సాధనకు అవకాశాలు అధికమయ్యాయి. కాలానుగుణంగా వచ్చిన మార్పులను గమనించి, నేను నా ఆటకు పదును పెట్టడంతో మళ్లీ విజయాల బాట పట్టా. ఈ టోర్నీ కోసం ఆన్‌లైన్ చెస్ ప్రాక్టీసు పోటీల్లో ఎక్కువ పాల్గొన్నా. చెస్ పజిల్స్‌ను వేగంగా పరిష్కరించే సాధన కూడా బాగా ఉపకరించింది.

ర్యాపిడ్ కఠినమైనది


క్లాసికల్‌లో మేటి చెస్ క్రీడాకారిణిగా నాకు పేరు ఉంది. ఈ ఆధునిక చెస్‌లో క్లాసికల్‌లో సాధించిన ఫలితాలు ర్యాపిడ్‌లో లభించడం కష్టంగా మారింది. ర్యాపిడ్ ఫార్మాట్ అంత వైవిధ్యంగా, కఠినంగా ఉంటుంది. అలాంటి ర్యాపిడ్‌లో కూడా రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉంది. ఇక.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఫిడే గ్రాండ్ ప్రీ టోర్నీ కోసం సన్నద్ధమవ్వాలనుకుంటున్నా.

చంద్రబాబు అభినందన

హంపి సాధించిన విజయంతో భారత చెస్‌కు అత్యద్భుత గౌరవం దక్కిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'ఎక్స్'లో పేర్కొన్నారు. హంపి నిజమైన భారత చెస్ దిగ్గజమని మంత్రి నారా లోకేష్ కొనియాడారు. హంపి విజయాలు రాబోయే తరాలు స్ఫూర్తినిచ్చేవిగా ఉన్నాయని ప్రశంసించారు.

అటూ.. ఇటూ?

ఓవైపు నితీశ్ తన శతక పోరాటంతో బాక్సింగ్ డే టెస్టులో భారత్‌ను పోటీలోకి తీసుకురాగా.. మరోవైపు 105 పరుగుల ఆధిక్యంతో బరిలోకి దిగిన ఆసీస్‌కు మన పేస్ త్రయం పదునైన బంతులతో ముకుతాడు వేసింది. ఫలితంగా ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 91 రన్స్‌కే 6 వికెట్లను కోల్పోయింది. ఇక మిగిలిన వికెట్లు తీయడం ఎంతసేపు.. భారత్ ముందు ఓ మాదిరి ఛేదనే ఉండొచ్చు? అని అనుకున్న వేళ లబుషేన్-కమిన్స్ పోరాట బాధ్యతను టెయిలెండర్లు తీసుకున్నారు. లియోన్-బోలాండ్ ఆఖరి వికెట్‌కు అజేయంగా 55 రన్స్ జోడించి బుమ్రా బృందానికి చుక్కలు చూపించారు. దీనికి తోడు మన ఫీల్డింగ్ వైఫల్యం కూడా ఆసీస్‌కు కలిసొచ్చింది. ఈ నేపథ్యంలో ఆఖరి రోజు ఆటపై అంతటా ఆసక్తి నెలకొంది.



- లబుషేన్ అర్ధసెంచరీ
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 228/9
- ప్రస్తుత ఆధిక్యం 333
- బుమ్రాకు నాలుగు వికెట్లు
- భారత్ తొలి ఇన్నింగ్స్ 369
- 200 వికెట్ల క్లబ్‌లో జస్‌ప్రీత్

1 అతి తక్కువ సగటు (19.38)తో టెస్టుల్లో 200 వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా బుమ్రా. 44 మ్యాచ్‌ల్లో తను మొత్తంగా 202 వికెట్లు తీశాడు. అలాగే ఆసీస్ గడ్డపై అన్ని ఫార్మాట్లలో కలిపి ఎక్కువ వికెట్లు (75) తీసిన భారత బౌలర్‌గా కపిల్ (72)ను అధిగమించాడు.

టెస్టుల్లో భారత తరపున వేగం (44 టెస్టుల్లో)గా 200 వికెట్లు పూర్తి చేసిన రెండో బౌలర్‌గా జడేజా సరసన నిలిచిన బుమ్రా. అశ్విన్ (37 టెస్టుల్లో) ముందున్నాడు.

2 ఆసీస్ గడ్డపై 8 అంతకంటే తక్కువ స్థానాల్లో వచ్చి ఎక్కువ స్కోరు (114) సాధించిన రెండో పర్యాటక జట్టు బ్యాటర్‌గా నితీశ్. మ్యాట్ ప్రియర్ (118, ఇంగ్లండ్) ముందున్నాడు.

మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్టు రసకందాయంలో పడింది. నాలుగో రోజు ఆదివారం భారత బౌలర్ల అద్భుత ప్రదర్శనకు.. ఆసీస్ టెయిలెండర్ల పోరాటానికి మధ్య ఆసక్తికర పోరు జరిగింది. ఈకారణంగా ఆఖరి రోజు సోమవారం ఇరుజట్ల మధ్య విజయం దోబూచులాడే పరిస్థితి నెలకొంది. చివరి వరుస బ్యాటర్లు లియోన్ (41 బ్యాటింగ్), బోలాండ్ (10 బ్యాటింగ్) మొండిగా క్రీజులో నిలవడంతో ఆతిథ్య జట్టు ఇప్పటికే 333 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండడంతో ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయకుండా కొనసాగించింది. దీంతో ప్రస్తుతం 9 వికెట్లకు 228 పరుగులతో నిలిచింది. లబుషేన్ (70) అర్ధసెంచరీ సాధించగా, కమిన్స్ (41) అండగా నిలిచాడు. బుమ్రాకు నాలుగు, సిరాజ్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకు ముందు 358/9 ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన భారత్ పోరాటం 21 బంతుల్లోనే ముగిసింది. సెంచరీ హీరో నితీశ్ (114)ను లియోన్ అవుట్ చేయడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 369 పరుగులకు ఆలౌటైంది. బోలాండ్, కమిన్స్, లియోన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఒకవేళ భారత్ ముంగిట 350 పరుగుల లక్ష్యమేర్పడితే రోజంతా దీటుగా ఆడి చరిత్రాత్మక విజయంపై కన్నేస్తుందా? లేక డ్రా కోసం ఆడుతుందా? అనేది నేడు చూడాల్సిందే.


లబుషేన్ (70)

కాన్‌స్టాస్‌పై ప్రతీకారం: 105 పరుగుల ఆధిక్యంతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించగా.. పేసర్ బుమ్రా వారినేమాత్రం కుదురుకోనీయలేదు. అతడికి తోడు సిరాజ్, ఆకాశ్ సైతం కట్టుదిట్టమైన బంతులతో దాడికి దిగారు. దీంతో ఆసీస్ పరుగుల వేటలో వెనుకబడి వికెట్లను కోల్పోయింది. అయితే జైస్వాల్ మూడు క్యాచ్‌లను వదిలేయడం ఆసీస్‌కు బాగా కలిసివచ్చింది. లేకుంటే ఈపాటికి భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభమయ్యేది. ముందుగా అరంగేట్రంలోనే హాఫ్ సెంచరీ బాదిన ఓపెనర్ కాన్‌స్టాస్ (8)పై ఈసారి బుమ్రా ప్రతీకారం తీర్చుకున్నాడు. ఏడో ఓవర్‌లో అతడి లెంగ్త్ బాల్.. సామ్ బ్యాట్, పాడ్ మధ్య నుంచి వెళ్లి మిడ్ వికెట్‌ను ఎగరగొట్టింది. దీంతో బుమ్రా ప్రేక్షకుల వైపు చూస్తూ ఇంకా అరవండి అంటూ సైగలు చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. అటు సిరాజ్ ఈసారి క్రమశిక్షణగా బౌలింగ్ చేస్తూ ఖవాజా (21), స్మిత్ (13) వికెట్లను తీశాడు. మరోవైపు వన్‌డౌన్ బ్యాటర్ లబుషేన్ మాత్రం పట్టుదలగా క్రీజులో నిలిచాడు. మరో ఎండ్‌లో బుమ్రా వికెట్ల వేట మాత్రం ఆగలేదు. 34వ ఓవర్‌లో హెడ్ (1), మార్ష్ (0)లతో పాటు తన తర్వాతి ఓవర్‌లో క్యారీ (2)ని అవుట్ చేయడంతో ఆసీస్ 91/6 స్కోరుతో తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో 150 రన్స్ చేయడం కూడా కష్టమే అనిపించింది. కానీ లబుషేన్‌కు కెప్టెన్ కమిన్స్ జత కలిసి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. మరోవైపు ఈ ఇద్దరి క్యాచ్‌లను జైస్వాల్ వదిలేశాడు. ఆ తర్వాత లబుషేన్ అర్ధసెంచరీ పూర్తి చేయడంతో పాటు కమిన్స్‌తో కలిసి ఏడో వికెట్‌కు 57 పరుగులు జోడించాడు. చివరి సెషన్‌లో లబుషేన్‌ను సిరాజ్ ఎల్బీ చేసి జట్టుకు ఉపశమనం కలిగించాడు. ఆ తర్వాత కాసేపటికే స్టార్క్ (5) రనౌట్ కాగా కమిన్స్‌ను జడేజా పెవిలియన్‌కు చేర్చాడు.

చివర్లో పోరాటం: ఆసీస్ స్కోరు 173/9 దగ్గర వారి ఆధిక్యం 278 పరుగులు. క్రీజులో ఉన్నది లియోన్, బోలాండ్. దీంతో చివరి వికెట్ తీయడం ఎంతో సేపు పట్టదన్న అంచనాలో భారత్ ముందు 300 పరుగుల్లోపే లక్ష్యం ఉంటుందని అంతా భావించారు. కానీ ఈ 'తోక' జోడీ బౌలర్లకు చుక్కలు చూపించింది. వారెంత ప్రయత్నించినా నాలుగో రోజు ఆసీస్‌ను ఆలౌట్ చేయలేకపోయింది. లియోన్ 5 పరుగుల వద్ద ఉన్నప్పుడు సిరాజ్ అతడి రిటర్న్ క్యాచ్‌ను వదిలేశాడు. ఆ చాన్స్‌ను వినియోగించుకుంటూ చూస్తుండగానే ఆధిక్యాన్ని 300కు చేర్చాడు. ఇప్పటికే ఈ జోడీ పదో వికెట్‌కు అజేయంగా 55 పరుగులు జోడించగా.. సంయుక్తంగా 119 బంతులను ఎదుర్కోవడం విశేషం.

స్కోరుబోర్డు

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 474; భారత్ తొలి ఇన్నింగ్స్: 369

ఆసీస్ రెండో ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (బి) బుమ్రా 8; ఖవాజా (బి) సిరాజ్ 21; లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 70; స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 13; హెడ్ (సి) నితీశ్ (బి) బుమ్రా 1; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 0; క్యారీ (బి) బుమ్రా 2; కమిన్స్ (సి) రోహిత్ (బి) జడేజా 41; స్టార్క్ (రనౌట్) 5; లియోన్ (బ్యాటింగ్) 41; బోలాండ్ (బ్యాటింగ్) 10; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 82 ఓవర్లలో 228/9. వికెట్ల పతనం:** 1-20, 2-43, 3-80, 4-85, 5-85, 6-91, 7-148, 8-156, 9-173. **బౌలింగ్:** బుమ్రా 24-7-56-4; ఆకాశ్ 17-4-53-0; సిరాజ్ 22-4-66-3; జడేజా 14-2-33-1; నితీశ్ 1-0-4-0; సుందర్ 4-0-7-0.

మూడు క్యాచ్‌లు వదిలేసిన జైస్వాల్

ఆదివారం ఆటలో యువ బ్యాటర్ జైస్వాల్‌ను దురదృష్టం వెంటాడింది. అతడెక్కడ ఉంటే అక్కడికి క్యాచ్‌లు రాగా, వచ్చిన మూడింటినీ అతను నేలపాలు చేశాడు. ఆసీస్ ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే ఖవాజా క్యాచ్‌ను గల్లీలో ఉన్న జైస్వాల్ అందుకోలేకపోయాడు. ఆ తర్వాత అదే స్థానంలో లబుషేన్ ఇచ్చిన క్యాచ్‌ను కూడా పట్టలేకపోయాడు. కమిన్స్ 20 రన్స్ దగ్గర ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను సిల్లీ పాయింట్‌లో ఉండి చేజార్చాడు. వీటన్నింటిని చూస్తూ తీవ్ర అసంతృప్తికి గురైన కెప్టెన్ రోహిత్ అతడికి కాస్త గట్టిగానే క్లాస్ పీకాడు. అయితే కెప్టెన్ ప్రవర్తన సరిగ్గా లేదని, క్యాచ్‌లను ఎవరూ కావాలని వదిలేయరని వ్యాఖ్యాత మైక్ హస్సీ స్పందించాడు. ఈ సమయంలోనే అతడిని ప్రోత్సహించాల్సిందిగా సూచించాడు.


జైస్వాల్‌తో రోహిత్

స్టీలర్స్..అదుర్స్

- ప్రొ. కబడ్డీ విజేత హరియాణా
- తొలిసారి టైటిల్ కైవసం
- ఫైనల్లో పట్నా పైరేట్స్ చిత్తు



పుణె: టోర్నీ ఆసాంతం అదరగొట్టిన హరియాణా స్టీలర్స్. ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్‌ను తొలిసారి ముద్దాడింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హరియాణా 32-23తో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌ను చిత్తు చేసింది. రైడర్ శివం పటారే 9 పాయింట్లు.. ఆల్‌రౌండర్ మహ్మద్రెజా (7 పాయింట్లు) హైలైట్‌గా నిలిచారు. పట్నా స్టార్ రైడర్ దేవాంక్ (5 పాయింట్లు)తోపాటు అయాన్ (3 పాయింట్లు)ను కట్టడి చేయడంలో హరియాణా డిఫెన్స్ విజయం సాధించింది. వీరిద్దరూ ఎక్కువ సేపు బెంచ్‌కే పరిమితం కావడం పట్నా స్కోరింగ్‌పై ప్రభావం చూపింది. పైరేట్స్ తరఫున గుర్‌దీప్ 6 టాకిలింగ్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆరంభం నుంచే వ్యూహాత్మకంగా ఆడిన హరియాణా.. ఏదశలోనూ పట్నాకు పుంజుకొనే అవకాశం ఇవ్వలేదు. ఫస్టాఫ్‌లో పైరేట్స్ ఓ మాదిరిగా పోరాడినా.. ద్వితీయార్థంలో హరియాణా జోరు ముందు నిలవలేక పోయింది. విజేత హరియాణా స్టీలర్స్‌కు రూ.3 కోట్లు, రన్నరప్ పట్నా పైరేట్స్‌కు రూ. 1.8 కోట్లు ప్రైజ్‌మనీగా లభించింది.

వజ్రాన్ని అందించారు


నితీశ్ తండ్రితో గవాస్కర్

మెల్‌బోర్న్: నితీశ్ కుమార్ తండ్రి ముత్యాలు భారత మాజీ కెప్టెన్, కామెంటేటర్ సునీల్ గవాస్కర్‌ను బ్రాడ్‌కాస్టర్ బాక్స్‌లో ప్రత్యేకంగా కలిశాడు. ఆ సమయంలో గవాస్కర్‌కు ముత్యాలు పాదాభివందనం చేయడంతో.. సన్నీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఈ సందర్భంగా 'మీ వల్లే ఈరోజు నాకళ్లలో నీళ్లు తిరిగాయి. మీ త్యాగం వల్లే దేశానికి ఓ వజ్రం లభించింద'ని గవాస్కర్ కొనియాడాడు. హృద్యమైన ఆ దృశ్యాన్ని చూసి నితీశ్ తల్లి కూడా ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకోలేక పోయింది. ఆ తర్వాత ముత్యాలు విలేకరులతో మాట్లాడుతూ.. నితీశ్ 99 రన్స్ వద్ద ఉన్నప్పుడు తానెంతో ఒత్తిడికి గురయ్యానని చెప్పాడు.

షూటర్ ముకేష్‌కు కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ ఎస్.ముకేష్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఆదివారం న్యూఢిల్లీలోని కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఈ పోటీల్లో 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ విభాగంలో ముకేష్ తృతీయ స్థానంలో నిలిచాడు. అభినవ్ చౌధురి (రాజస్థాన్) స్వర్ణం, సూరజ్ శర్మ (మధ్యప్రదేశ్) రజతం సాధించారు.

తీర్థ, సాయి పతకాల మోత

విజయవాడ (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ స్విమ్మర్లు తీర్థ, యజ్ఞ సాయి పతకాల మోత మోగించారు. ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో జూనియర్ కేటగిరీలో తీర్థ 4 స్వర్ణాలు, ఒక రజతం, టీమ్ ఈవెంట్లలో రెండు రజతాలు సొంతం చేసుకొని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాడు. సబ్ జూనియర్ విభాగంలో యజ్ఞ సాయి 4 పసిడి, ఒక రజత పతకం సాధించాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్లో దక్షిణాఫ్రికా

తొలి టెస్ట్‌లో పాక్‌పై థ్రిల్లింగ్ విక్టరీ


రబాడ (31 నాటౌట్) జెన్సన్ (16 నాటౌట్)

సెంచూరియన్: ఉత్కంఠభరితంగా సాగిన తొలి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా 2 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. మరో రోజు ఆట మిగిలుండగానే గెలిచిన సఫారీలు.. తొలిసారి వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు దూసుకెళ్లారు. 148 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు నాలుగో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 27/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా 8 వికెట్లకు 150 పరుగులు చేసి నెగ్గింది. మహ్మద్ అబ్బాస్ (6/54) దెబ్బకు.. ఆతిథ్య జట్టు 99/8తో ఓటమి అంచున నిల్చింది. అయితే, మార్కో జెన్సన్ (16 నాటౌట్), రబాడ (31 నాటౌట్) తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 51 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గట్టెక్కించారు. కెప్టెన్ బవుమా (40), మార్‌క్రమ్ (37) రాణించారు. పాకిస్థాన్ 211, 237 పరుగుల చేయగా.. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 301 రన్స్ సాధించింది. వచ్చే ఏడాది లార్డ్స్‌లో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్లో ఒక జట్టుగా దక్షిణాఫ్రికా ఖరారు కావడంతో.. రెండో బెర్త్ కోసం ఆస్ట్రేలియా, భారత్, శ్రీలంక మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

మళ్లీ తెలుగు వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాజమహేంద్రవరంలోని బేతిని గ్రంథాలయం, విశాఖలో ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయం మన భాషా వికాసానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో తోడ్పాటును అందించాయని, వాటిని సాహితీ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే నేటి తరం పిల్లలకు భాషపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఎకో టూరిజం, వైల్డ్‌లైఫ్ టూరిజంతో పాటు సాహితీ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాలు మాతృభాషకు ఇస్తున్న ప్రాధాన్యం మనం ఇవ్వలేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. భాషను పరిరక్షించడానికి ప్రభుత్వాలే కాకుండా పౌరసమాజం తగిన పాత్ర పోషించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో మునిగిపోతున్న విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. మాతృభాషను పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. మహాసభల్లో ఆమోదించిన తీర్మానాలతో పాటు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. రాజకీయ నాయకుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో తెలుగు భాష ఔన్నత్యాన్ని కోల్పోతోందన్నారు. అమృత భాషగా భావించే తెలుగుకు వైసీపీ తూట్లు పొడిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భాష వికాసాన్ని నాశనం చేశారని ఆరోపించారు. మాతృభాషకు, పరాయి భాషకు తల్లిపాలు తాగి ఎదిగిన బిడ్డకు, పోత పాలు తాగి పెరిగిన బిడ్డకు ఉన్నంత వ్యత్యాసం ఉంటుందని వ్యాఖ్యానించారు. మాతృభాషలో విద్యా బోధన జరిగినప్పుడు విద్యార్థుల్లో సంపూర్ణ మానసిక వికాసం పెంపొందుతుందని తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేస్తే తెలుగు భాష పరిస్థితి ఏమిటని మంత్రి దుర్గేష్ ప్రశ్నించారు.


ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

నేతల పిల్లలు సర్కారీ బడులకు

రాజకీయ నేతల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపినప్పుడు భాష దానికదే ఎదుగుతుంది. మనం, మన కుటుంబాలు ఎదిగి మిగిలిన వారంతా తెలుగు భాషం కోసం పనిచేయండని కూర్చుంటే పరిరక్షణ సాధ్యం కాదు. రాజకీయ నాయకులే తెలుగు భాషను చిన్నచూపు చూస్తున్నారు. తెలుగును జగన్ నాశనం చేశారు. ప్రపంచంతో పోటీ పడాలంటే తెలుగు పనికిరాదని నేరుగా చెబుతున్నారు. ప్రపంచంలో 15కోట్ల మంది తెలుగు మాట్లాడుతున్నారు. అటువంటప్పుడు భాష ఎలా నశిస్తుంది? తమిళనాడు, కర్ణాటక తరహాలో తెలుగు రాష్ట్రాల్లో కూడా మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

తెలుగు భాషకు ప్రత్యేకంగా ఓ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసింది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి తెలుగు మాధ్యమం ఉండాలని మేధావులు కోరుతున్నారు. దీనిపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయాలి.

- కొలనుకొండ శివాజీ, పీసీసీ ఉపాధ్యక్షుడు

ఏ భాషకూ రాని ప్రమాదం వచ్చింది

దేశంలో ఏ భాషకూ రాని ప్రమాదం తెలుగుకు వచ్చింది. అంతరించే స్థాయికి చేరింది. తెలుగులో మాట్లాడిన వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే స్థితికి సమాజం చేరుకుంది. దీనికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. వైసీపీ హయాంలో ఇంగ్లిష్ మీడియం బిల్లును అసెంబ్లీలో ఆమోదించి శాసన మండలికి పంపారు. నాడు మండలిలో నేను అడిగిన ప్రశ్నకు అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ సమాధానం చెప్పలేకపోయారు.

- పి.అశోక్‌బాబు, ఎమ్మెల్సీ

న్యాయవ్యవస్థలో తెలుగు తీర్పులకు 'ఏఐ'

» జస్టిస్ కృష్ణమోహనరావు



న్యాయవ్యవస్థలో తీర్పులను మాతృభాషలో ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పరంగా ఇవ్వడానికి ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.కృష్ణమోహనరావు తెలిపారు. ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో భాగంగా 'తెలుగులో న్యాయపాలన' అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు ఆంగ్ల పదాలకు సరిపోయే సమానార్థక పద సంపదను సృష్టించుకుని స్థిరీకరించుకోవాలని సూచించారు. తెలుగులో తీర్పును వెలువరించాలంటే ఇంగ్లిష్ తీర్పులను అనువదించడానికి అనువాదకులను నియమించుకోవాల్సి ఉంటుందని, ఈ స్థానాల్లో తెలుగుపై పట్టున్న వారిని ఎంపిక చేయాలని కోరారు. మాతృభాషను పరిరక్షించడానికి ఇళ్లల్లో వాడుక భాషను ఉపయోగిస్తే సరిపోదని, మాతృభాష మాధుర్యాన్ని పిల్లలకు చూపించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. తెలుగును ఒక పాఠ్యాంశంగా అమలు చేయడం కాదని, తెలుగు మాధ్యమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని జస్టిస్ కృష్ణమోహనరావు అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ ఆదేశాలు తెలుగులో..: సత్యకుమార్

రాజకీయంగా సిద్ధాంతాలు వేరైనప్పటికీ, వాటిని పక్కనపెట్టి మాతృభాష పరిరక్షణ కోసం కలసికట్టుగా ప్రయాణం చేద్దామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో భాగంగా రెండోరోజు ఆదివారం 'తెలుగు భాషాభివృద్ధి- తెలుగు భాష పరిరక్షణ- రాజకీయ నాయకుల పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణ యజ్ఞంలో తానూ భాగస్వామినవుతానని చెప్పారు. అధికారుల కోసం తెలుగు భాషపై ఓ సదస్సు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ శాఖల్లో ఆదేశాలు తెలుగులో వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మాతృభాష పరిరక్షణ కోసం త్యాగాలకు సిద్ధం కావాలి

సభకు అధ్యక్షత వహించిన సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణ కోసం త్యాగాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కొన్ని చట్టాలు చేసి భాషను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి రాజకీయ నేతలు ఉపయోగిస్తున్న భాషపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. భాష సంస్కృతిని పాటించని నేతలపై ఆయా పార్టీల అధినేతలు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంట్లో చందమామ, బంతి అని నేర్చుకున్న పిల్లలకు బడికి వెళ్లాక మూన్, బాల్ అన్న పదాలు నేర్పిస్తున్నారని, ఒకవిధంగా ఇది భ్రూణహత్య వంటిదని వ్యాఖ్యానించారు. పసితనంలోనే భాషను చంపేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. అండమాన్‌లోని ఒక దీవిలో నివసించే తెగలో 75మంది జనాభా మాత్రమే ఉంటారని తెలిపారు. సముద్రపు అల అనే పదానికి వారు 60 పర్యాయపదాలు సృష్టించుకున్నారని వివరించారు.

పదసంపద లేకే పరాయి పదాలు



తెలుగు భాషకు తగినంత పదసంపద లేదు. అందుకే ఆంగ్ల పదాలను తెలుగులోకి జోడిస్తున్నారు. తెలుగు పదసంపదను పెంచుకోవడానికి భాషా పండితులు నిఘంటువును తయారు చేయాలి. ఆ పదాలను పాటలు, కవిత్వాలు రాసే రచయితలకు పరిచయం చేయాలి. క్రియ, నామవాచకాల్లో ప్రస్తుత నేపథ్యానికి కావాల్సిన తెలుగు పదాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నాటినుంచి నేటి వరకు తెలుగులో ఎలాంటి మార్పులు రాలేదు. ఆదికావ్యం పుట్టిన గోదావరి ఒడ్డు నా సాహిత్యానికి ప్రేరణ. పండిత, పామరులకు రంజకంగా ఉండేలా రాయాలన్నది రచయితల అభిప్రాయం. పండితులను కాకపోయినా పామరులను రంజింప చేస్తే చాలన్న ధోరణి పెరిగింది.

- అనంతశ్రీరాం, సినీ గేయ రచయిత

ఆ ప్రేమ మనకెందుకు లేదు?

అమెరికాలో స్థిరపడిన తెలుగువారు తమ పిల్లలను వారానికి ఒకసారి తెలుగు బడులకు పంపుతారు. తెలుగు భాషను పరిచయం చేస్తారు. అమెరికాలో ఉన్నవారికి భాషపై అంత ప్రేమ ఉన్నప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మనకు ఎందుకు లేదు? తల్లిదండ్రులు పిల్లలను ఇంగ్లిష్ మీడియంలోనే ఎందుకు చేర్పిస్తున్నారు? ఈ ధోరణి మారాలి.

- అంబికా కృష్ణ, సినీ నిర్మాత

ఇంగ్లిష్‌కు 6 రోజులు.. తెలుగుకు 40 రోజులు

ఆంగ్లంలో తీర్పులు రాయడానికి 6 రోజుల సమయం పడితే, తెలుగులో తీర్పును రాయడానికి 40 రోజులు పట్టింది. నేను ఇప్పటి వరకు 2 తీర్పులు తెలుగులో ఇచ్చాను. ఆ సమయంలో అనేక వ్యయప్రయాసలు ఎదురయ్యాయి. తెలుగు విభాగాధిపతిగా ఉన్న నా మిత్రుడిని పిలిపించుకుని సమానార్థక పదాలతో ఇంగ్లిష్ తీర్పును తెలుగులోకి అనువదించాను.

- జస్టిస్ కె.మన్మథరావు, హైకోర్టు న్యాయమూర్తి

చట్టాలను తెలుగులోకి అనువదించాలి

తెలంగాణ హైకోర్టులో ఇప్పటి వరకు 1,100 తీర్పులను, సుప్రీంకోర్టుకు సంబంధించి 2,500 తీర్పులను తెలుగులోకి తర్జుమా చేశాం. ఏపీలో 547 హైకోర్టు, 860 సుప్రీంకోర్టు తీర్పులను తెలుగులోకి అనువదించారు. దీనికోసం సుప్రీంకోర్టు రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తేనే అనువాదం చేసిన తీర్పులకు నిధులు విడుదల చేస్తుంది. తీర్పులు మాతృభాషలో వెలువరించాలంటే ముందుగా ప్రభుత్వాలు చట్టాలను తెలుగులోకి అనువదించాలి. ఇది న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆంగ్ల పదాలకు.. తెలుగులో సమానార్థక పదాలు 90వేలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటితో ఎన్ని తీర్పులను మాతృభాషలో ఇవ్వగలం?

- జస్టిస్ కె.లక్ష్మణ్, టీ. హైకోర్టు న్యాయమూర్తి

తెలుగు వల్లే న్యాయవాదినయ్యా

నేను న్యాయ విద్యను అభ్యసించడానికి, న్యాయవాదిగా మారడానికి తెలుగే కారణం రోబోలు ఒక కమాండ్ ఇస్తే సొంత భాషను తయారు చేసుకుని సంభాషించుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మాభిమానం ఉన్న తెలుగువారు పరాయి భాషలో సంభాషించడం ఆలోచించాల్సిన విషయం. న్యాయవ్యవస్థలో 95శాతం మంది తెలుగులోనే మాట్లాడతారు. కాగితాలు తెలుగులో ఉన్నప్పటికీ ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నామంటే మనం ఏ స్థాయికి దిగజారిపోయామో ఆత్మపరిశీలన చేసుకోవాలి.

- జస్టిస్ భీమపాక నగేష్, టీ-హైకోర్టు న్యాయమూర్తి

ఆంగ్లేయుల పాలనలోనే తెలుగు తీర్పులు

బ్రిటిషర్లు పరిపాలించేటప్పుడు న్యాయస్థానాల్లో తీర్పులు తెలుగులో వెలువరించేవారు. అప్పటి బ్రిటిష్ న్యాయమూర్తులు తీర్పులను తెలుగులోకి అనువాదం చేయించుకుని ఉత్తర్వులు ఇచ్చేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మాత్రం ఆంగ్లంలో తీర్పులు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని న్యాయస్థానాల్లో ఇప్పటికీ అక్కడి మాతృభాషల్లోనే తీర్పులు ఇస్తున్నారు. మాతృభాషను వదులుకుంటే కన్నతల్లిని వదులుకున్నట్టే. మాతృభాషపై పట్టు లేకపోతే ఇతర భాషల్లోనూ నైపుణ్యం సాధించలేం. తెలుగు పదిలంగా ఉండాలంటే విద్యావిధానంలో మార్పులు రావాలి. ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలుగు మాధ్యమాన్ని కచ్చితంగా అమలు చేయాలి.

- జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి

18 తీర్మానాలు ఆమోదం

ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో 18 తీర్మానాలను మహాసభల కార్యదర్శి జీవీ పూర్ణచందు ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అవి... ఇంటా, బయట అన్ని సామాజిక జీవన ప్రామాణికాల్లో తెలుగును ఉపయోగించాలి. కనుమరుగైన పదాలను వెలికితీసే బాధ్యతను రచయితలు తీసుకోవాలి. ఆంగ్ల పదాలకు సమానమైన పదాలను సృష్టించాలి. ప్రాథమిక విద్య వరకు మాతృభాషలో బోధన జరగాలి. డిగ్రీలో తెలుగును ఒక పాఠ్యాంశంగా బోధించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఇంజనీరింగ్, వైద్య విద్యను మాతృభాషలో బోధించాలనే కేంద్ర ప్రభుత్వ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జీవో 85ను హైకోర్టు కొట్టేయడంపై సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. హైకోర్టుల్లో వాద ప్రతివాదనలు, తీర్పులు తెలుగులో జరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను పటిష్ఠంగా నిర్మించి నిధులు కేటాయించాలి. పాలనావ్యవహారాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరిగేలా చర్యలు తీసుకోవాలి. వైసీపీ తెలుగు అకాడమీని తెలుగు, సంస్కృత అకాడమీగా మార్చి, దిగజార్చిన దాని ఔన్నత్యాన్ని పునరుద్ధరించాలి. రాష్ట్రంలో తెలుగు వర్సిటీని, కళల పరిశోధన, పరిరక్షణ కోసం సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. సమగ్ర లక్ష్యాలు, విధులు, నిధులతో వివిధ అకాడమీలను పటిష్ఠం చేయాలి. గ్రంథాలయ సంస్థలను పటిష్ఠం చేసి, పుస్తకాలు కొనుగోలు చేయాలి. రాష్ట్ర గ్రంథాలయం, రాష్ట్ర మ్యూజియం ఏర్పాటు చేయాలి. తెలుగులో చదివినవారికి ఉద్యోగాల్లో 5శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. తెలుగు భాషను పరిరక్షించడానికి, సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టడానికి, కళారూపాలను, దృశ్యకళలను కాపాడడానికి తెలుగు ప్రభుత్వాలు సాంస్కృతిక, భాషా విధానాలను రూపొందించి ప్రకటించాలి.

24,200 పైన బుల్లిష్

(డిసెంబరు 30-జనవరి 3 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,781-23,939 పాయింట్ల మధ్యన కదలాడి 225 పాయింట్ల లాభంతో 23,813 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,796, 23,874, 24,228, 24,154 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైకి రావడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,200 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,500
నిరోధ స్థాయిలు: 24,025, 24,125, 24,225 (23,925 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,700, 23,600,23,500 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	550
వరంగల్	552	గోదావరి	550
చిత్తూరు	583	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	106
వరంగల్	95	గుంటూరు	106
కరీంనగర్	95	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	94
కర్నూలు	95	నెల్లూరు	94
విశాఖపట్నం	105	అనంతపురం	94
గోదావరి	106		

ప్రైవేట్ బ్యాంకులకు తప్పని ఉద్యోగుల వలసలు

25 శాతానికి చేరిన అట్రిషన్


బ్యాంకుల నిర్వహణా కష్టాలు పెరుగుతున్నాయ్ : ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: దేశంలోని ప్రైవేట్ బ్యాంకులకు కొత్త కష్టాలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగుల్లో ఏటా 25 శాతం మంది ఈ బ్యాంకుల నుంచి వలస పోవటమో (అట్రిషన్) లేదంటే గుడ్‌బై చెప్పటమో జరుగుతోంది. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి. 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2023-24' పేరుతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయం తెలిపింది. ఉద్యోగులు ఇంత పెద్దఎత్తున వలస పోవటం ఈ బ్యాంకుల నిర్వహణకు పెద్ద సమస్యగా మారనుందని హెచ్చరించింది. కొన్ని ప్రైవేట్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్ఎఫ్‌బీ)ల్లో ఈ వలసల సమస్య మరింత ఎక్కువగా ఉంది.

పీఎస్‌బీలను మించిన సిబ్బంది: ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)తో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకుల్లో పని చేసే ఉద్యోగులే ఎక్కువ. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరాంతానికి పీఎస్‌బీల్లో 7,64,679 మంది పని చేస్తుంటే.. ప్రైవేట్ బ్యాంకుల్లో 8,46,530 మంది పని చేస్తున్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అప్పట్లో పీఎస్‌బీల్లో 8,42,813 మంది పనిచేస్తుంటే ప్రైవేట్ బ్యాంకుల్లో పని చేస్తున్న సిబ్బంది 3,03,856 మాత్రమే. పెద్దఎత్తున ఉద్యోగులు మానేయడం, ఒక్కో ఉద్యోగి ద్వారా సమకూరే సగటు టర్నోవర్‌ని దెబ్బతీస్తోంది. దీనివల్ల ఖాతాదారుల సేవలకూ ఇబ్బంది ఏర్పడుతోంది. దీనివల్ల ప్రైవేట్ బ్యాంకుల నియామకాల ఖర్చులూ పెరిగిపోతున్నాయి' అని ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది.

ఇవే నివారణ చర్యలు: ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రైవేట్ బ్యాంకులు తీసుకోవాల్సిన చర్యలూ ఆర్‌బీఐ నివేదిక సూచించింది. విస్తృత శిక్షణ, ప్రమోషన్ అవకాశాలు పెంచడం, ప్రత్యేక ప్రోత్సాహకాలు, సిబ్బంది అదే బ్యాంకులో దీర్ఘకాలం పాటు పనిచేసేందుకు అనువైన వాతావరణం కల్పించడం వంటి వ్యూహాత్మక చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ సూచించింది.

గోల్డ్ లోన్స్‌పై జర జాగ్రత్త: పసిడి రుణాల మంజూరు విషయంలో బ్యాంకులు ఇప్పటికీ కొన్ని తప్పిదాల చేయడాన్ని ఆర్‌బీఐ ఎత్తి చూపింది. ముఖ్యంగా థర్డ్ పార్టీలు ఈ రుణాల మదింపు, వాటిపై పర్యవేక్షణ సరిగా లేదని స్పష్టం చేసింది. నిర్ణీత కాల వ్యవధిలో బ్యాంకులు ఈ లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది.

బిజినెస్

ఐసీఐసీఐ ప్రు రూరల్ ఆపర్చునిటీస్ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ రూరల్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇది గ్రామీణ, అనుబంధ రంగాలతో కూడిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ప్రధానంగా ఈ ఫండ్ భారత గ్రామీణాభివృద్ధిలో పాలు పంచుకుంటున్న ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో పెట్టుబడులు పెడుతుంది. నిఫ్టీ రూరల్ ఇండెక్స్ ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉంటుంది. రూరల్ థీమ్‌తో నిఫ్టీ 500 ఇండెక్స్‌లో ప్రాతినిధ్యం కలిగి ఉన్న 75 స్టాక్స్‌లో మెరుగైన మార్కెట్ క్యాపిటలైజేషన్ కలిగిన లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ షేర్లను ఎంపిక చేసుకుని ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. 2025 జనవరి 9న ప్రారంభం కానున్న ఈ ఫండ్ అదే నెల 23న ముగుస్తుంది.

బజాజ్ ఫిన్‌సర్వ్ ఈఎల్ఎస్ఎస్ ట్యాక్స్ సేవర్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ).. ఈఎల్ఎస్ఎస్ ట్యాక్స్ సేవర్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ లింక్డ్ పొదుపు పథకం. ఇన్వెస్టర్లు.. ఈ ఫండ్ ద్వారా ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 80 సీసీ కింద పన్ను ప్రయోజనాలను పొందవచ్చు. ఈ పథకం లాకిన్ కాలపరిమితి మూడు సంవత్సరాలు. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించింది. ఈ ఫండ్‌కు బీఎస్ఈ 500 టోటల్ రిటర్న్ ఇండెక్స్ బెంచ్‌మార్క్ ఇండెక్స్ ఉండనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ జనవరి 22.

అభివృద్ధే మన తారక మంత్రం

అతి నియంత్రణలతో అనర్థమే
పోటీ సామర్థ్యం పెంచుకోవాలి


ఉదయ్ కోటక్

న్యూఢిల్లీ: వచ్చే సంవత్సరాని (2025)కి సుస్థిర అభివృద్ధే మన లక్ష్యం కావాలని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వెబ్‌సైట్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పోస్టు చేశారు. దేశాన్ని సుసంపన్న దేశంగా తీర్చిదిద్దాలంటే అభివృద్ధి ఒక్కటే మార్గమన్నారు. ఇందుకోసం ఆయన ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను సూచించారు. అతి నియంత్రణలను తొలగించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. అప్పుడే మన పారిశ్రామికవేత్తల అసలు సిసలు సామర్థ్యం బయట పడుతుందన్నారు.

పోటీ సత్తా పెంచుకోవాలి: కార్మికుల ఉత్పాదకత పెంచుకోవడం ద్వారా అంతర్జాతీయ పోటీకి తగ్గట్టు మన పరిశ్రమలు ఎదగాలని ఉదయ్ కోటక్ సూచించారు. వాణిజ్య రక్షణ విధానాలతో స్వల్పకాలిక లాభాలే తప్ప దీర్ఘకాలంలో ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఈ రక్షణ విధానాలు దీర్ఘకాలం కొనసాగితే మన పరిశ్రమల పోటీ సామర్థ్యమూ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆర్థిక స్థిరత్వం కోసం ద్రవ్యలోటుతో పాటు మూలధన ఖాతా లోటును (సీఏడీ) తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎస్‌బీఐ లైఫ్ స్మార్ట్ ప్లాటినా సుప్రీమ్

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్.. స్మార్ట్ ప్లాటినా సుప్రీమ్ పేరుతో నాన్-లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవింగ్స్ ప్లాన్‌ను విడుదల చేసింది. జీవిత బీమా రక్షణ, గ్యారంటీడ్ పే-ఔట్స్ కాంబినేషన్‌తో ఈ ప్లాన్‌ను తీసుకువచ్చింది. అన్ని వయసుల వారి అవసరాలకు తగ్గట్టుగా అనుకూలైన పాలసీ ప్రీమియం చెల్లింపులు, కస్టమైజ్డ్ ఫీచర్లతో దీన్ని రూపొందించింది. యాక్సిడెంటల్ బెనిఫిట్ రైడర్‌తో అదనపు రక్షణను కల్పించనుంది.

కన్సాలిడేషన్ కొనసాగింపు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. బెంచ్‌మార్క్ సూచీల్లో కన్సాలిడేషన్ కొనసాగనుంది. ఇప్పటికిప్పుడు సూచీలు మెరుగ్గా రాణించకపోవచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందితేనే సూచీలకు నిర్ణయాత్మక గమనం ఉంటుంది. ఎఫ్ఐఐలు వెళ్లిపోవటం, రూపాయి బలహీనపడటం ప్రతికూల అంశాలు.

స్టాక్ రికమండేషన్స్

క్యాంపస్ యాక్టివ్‌వేర్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం వాల్యూజోన్‌లో ట్రేడవుతోంది. టర్న్ అరౌండ్ కనిపిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారంఈ షేరు 4.17 శాతం లాభంతో రూ.315 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.310/300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.345/375 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.290 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లారస్ ల్యాబ్స్: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలక నిరోధ స్థాయికి చేరుకుంది. నెగటివ్ మార్కెట్లోనూ ఈ షేరు బలం ప్రదర్శించింది. చివరి నాలుగు సెషన్లలోనూ లాభపడింది. గత శుక్రవారం 2.82 శాతం లాభంతో రూ.586 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లుమాక్స్ ఆటో: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతోంది. దిద్దుబాటు జరగటతో డిమాండ్ పెరుగుతోంది. పైగా ప్రతి త్రైమాసికంలోనూ మెరుగైన ఫలితాలు విడుదల చేస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 2.73 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.630/610 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.670/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.575 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లూపిన్: ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కొనసాగుతోంది. పైగా 2016 నాటి నిరోధాన్ని బ్రేక్ చేసింది. హెడ్‌లైన్ సప్లయ్ ముగిసినట్టే కనిపిస్తోంది. గత శుక్రవారం 2.09 శాతం లాభంతో రూ.2,227 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,200/2,180 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,140 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అరబిందో ఫార్మా: ఈ ఏడాది ఆగస్టులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 30 శాతం వరకు కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. అక్యుములేషన్‌కు అవకాశం కనిపిస్తోంది. నిఫ్టీతో పోల్చితే బలం పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.1,269 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,250 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,360/1,380 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

తదుపరి నిరోధం 24,000

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మైనర్ పుల్‌బ్యాక్ రికవరీ సాధించి ముందు వారంతో పోల్చితే 225 పాయింట్లు లాభపడింది. అయితే గత వారం 24,000-23,600 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలోనే కదలాడింది. ప్రస్తుతం 23,800 వద్ద అప్రమత్త ధోరణిలో నిలిచి ఉంది. గత వారం మిడ్ క్యాప్-100 సూచీ 73 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 40 పాయింట్ల స్వల్పలాభంతో ఫ్లాట్‌గా ముగిశాయి. టెక్నికల్‌గా మార్కెట్ ఇటీవల సాధించిన గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన నిలిచి ఉండడం అనిశ్చిత ధోరణిని సూచిస్తోంది. ప్రస్తుత స్థితిలో మరింత కన్సాలిడేషన్ అవసరం. స్థూల ట్రెండ్ మాత్రం ఇంకా బలహీనంగానే ఉంది. గత శుక్రవారం గరిష్ఠ స్థాయిల్లో బలహీన ధోరణి ప్రదర్శించడం కూడా మరింత బలహీనత ఉండనేందుకు సంకేతం. శుక్రవారం అమెరికన్ స్టాక్‌మార్కెట్లో ఏర్పడిన బలహీన ట్రెండ్ కారణంగా ఈ వారంలో భారత మార్కెట్ అప్రమత్తంగా కదలాడే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి ప్రధాన స్వల్పకాలిక నిరోధం 24,000. ఇక్కడే గత కొన్ని వారాలుగా పలు ప్రయత్నాలు చేసి మార్కెట్ విఫలమవుతూ వస్తోంది. స్వల్పకాలిక సానుకూలత కోసం మార్కెట్ ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 24300, 24,550.

బేరిష్ స్థాయిలు: మార్కెట్‌కు 23,650 వద్ద మైనర్ మద్దతు ఉంది. ఇదే గత గురువారం ఏర్పడిన బాటమ్. ఈ స్థాయి కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,500. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ టెక్నికల్ బౌన్స్‌బ్యాక్ సాధించి 550 పాయింట్ల స్వల్ప లాభంతో 51,300 వద్ద ముగిసింది. సానుకూలత కోసం ప్రధాన నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 52,000. బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం ప్రధాన మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకుని పాజిటివ్ కన్సాలిడేషన్ సాధించాలి.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 200 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. సానుకూలత కోసం 24,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. 23,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు ఉంది. ఇక్కడ నిలదొక్కుకుంటే సానుకూల ధోరణి ఏర్పడుతుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,930, 24,000
మద్దతు	23,690, 23,650

బియ్యం బొక్కేసి నీతి కబుర్లా?

» భార్య పేరు చెప్పుకొని సానుభూతికి యత్నాలు

» పేర్ని నాని కేసుపై మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని బియ్యం దొంగగా మారాడని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 7,577 కేజీల బియ్యం బస్తాలు పేర్ని నాని గోడౌన్ నుంచి మాయంచేసి నగదుగా మార్చుకున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైందన్నారు. ఈ కేసుకు సంబంధించి తాను సీఎం చంద్రబాబు వద్దకు వెళ్లి.. పేర్ని జయసుధను అరెస్టు చేయాలని కోరినట్లు, అందుకు సీఎం అంగీకరించలేదన్నట్లు పేర్ని నాని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంగితజ్ఞానం ఉండే మాట్లాడుతున్నారా? ఇప్పుడు ఈ కేసులో పేర్ని నాని, ఆయన కొడుకు కిట్టు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. అసెంబ్లీలో వైసీపీ శాసనసభ్యులు చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అగౌరవంగా మాట్లాడితే అప్పుడు పేర్ని నాని ఎందుకు నోరుమెదపలేదని ప్రశ్నించారు. బియ్యం మాయం కేసుతో పాటు పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోలులో పేర్ని నాని చేసిన అక్రమాలపై విచారణ జరుగుతోందన్నారు. పొట్లపాలెం గోడౌన్ నుంచి కాకినాడకు పీడీఎస్ బియ్యం తరలిపోయినట్లు అధికారుల విచారణలో వెల్లడైందని, పూర్తి వివరాలు అందాక, తదుపరి చర్యలు ఉంటాయని మంత్రి తెలిపారు. కేసులతో సరిపెట్టమని, ఆస్తుల అటాచ్‌మెంట్ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

అప్పుడు నోరు మెదపలేదేం?!

» పేర్ని నానిపై బుద్దా వెంకన్న ఫైర్



విజయవాడ (వన్‌టౌన్), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సాక్షిగా భువనేశ్వరి, బ్రాహ్మణిలను అకారణంగా వైసీపీ కుక్కలు తిడితే నోరు మెదపని పేర్ని నాని.. నేడు తప్పు చేసి దొరికిపోయి.. తప్పించుకోవడానికి చిలకపలుకులు పలుకుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భార్య పేరుతో గోడౌన్ కట్టి, అక్కడ తప్పుడు పనులు చేయడం ద్వారా పేర్ని నానియే తన భార్యను కేసులో ఇరికించారని వెంకన్న విమర్శించారు. నాడు అసెంబ్లీ సాక్షిగా భువనేశ్వరి, బ్రాహ్మణిని వైసీపీ నాయకులు కొడాలి నాని, వల్లభనేని వంశీ తప్పుగా మాట్లాడారని, తాను వారిని సంకరజాతి కుక్కలు అని తిట్టినందుకు పేర్ని నాని తనపై కేసు పెట్టారని వెంకన్న గుర్తు చేశారు. పేర్ని నానీకి తన భార్యపై నిజంగా ప్రేమ ఉంటే గోడౌన్‌ను తన పేరున పెట్టుకునేవారని, పోనీ భార్య పేరున పెట్టినప్పుడైనా అక్కడ తప్పుడు పనులు చేయకుండా ఉండాల్సిందని చెప్పారు. తప్పుచేసి దొరికిపోయి, ఇప్పుడు భార్యను అడ్డం పెట్టుకుని దొంగ ఏడుపులు ఎందుకన్నారు. అప్పట్లో వైసీపీ నాయకులు మహిళలను నీచంగా మాట్లాడినదానికి పేర్ని నాని ఇప్పటికైనా లెంపలు వేసుకుంటారని భావించానని, అది చేయకుండా ఎదురు నీతులు చెబుతున్నారని విమర్శించారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌పై సినిమా తీయటానికి పేర్ని నానీని కలిసి రాంగోపాల్ వర్మ చర్చ జరపటం వాస్తవం కాదా? అని బుద్దా ప్రశ్నించారు.

నాడు లోకేశ్, వెంకన్నపై ఫిర్యాదు చేసిన పేర్ని నాని

యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ 2023, ఆగస్టులో గన్నవరం వచ్చారు. అక్కడ జరిగిన సభలో బుద్దా వెంకన్న తన ప్రసంగంలో భువనేశ్వరి, బ్రాహ్మణిని దూషించిన కొడాలి నాని, వల్లభనేని వంశీపై విరుచుకుపడ్డారు. దీనిపై పేర్ని నాని ఆత్కూరు పోలీసుస్టేషన్‌లో లోకేశ్, బుద్దా వెంకన్నపై ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు. ఈ కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను వెంకన్న ఆదివారం ప్రదర్శించారు.

ఇప్పుడు గుర్తుచ్చొరా ఆడోళ్లు..: జేసీ



అనంతపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'పేర్ని నాని మీడియాతో మాట్లాడేటప్పుడు ఆయన మొహంలో రక్తపు చుక్కలేదు. ఏం.. అధికారంలో ఉన్నపుడు ఏం మాట్లాడావో మరిచిపోయావా? మామీద కేసులు పెట్టినపుడు కనిపించలేదా? మా ఇంట్లో ఆడోళ్లు లేరా? ఇప్పుడు నీదాకా వస్తే ఆడోళ్లు గుర్తొచ్చారా? బియ్యం అమ్ముకున్ననివి ఇప్పుడు సుద్దులు చెప్తున్నావా?' అంటూ మాజీ మంత్రి పేర్నినానిపై తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఆయన ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ అధికారంలో ఉన్నపుడు చంద్రబాబు గురించి ఏం మాట్లాడావో గుర్తు లేదా? నువ్వు, ఆ జగన్ కూర్చొని చంద్రబాబును అరెస్టు చేయించింది వాస్తవం కాదా? కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడును ఇబ్బంది పెట్టి ఆ రోజు ఆనందించిన విషయాన్ని మరిచిపోయారా? నా మీద, నా కొడుకు, నా కోడలు, నా భార్య మీద కేసులు పెట్టారు కదా ఆరోజు కనబడలేదా? నన్ను అన్యాయంగా 120రోజులు జైలులో పెట్టించారు. ఈ పొద్దు నీ భార్య అంటున్నారని బాధొచ్చిందా... మా తల్లి భువనేశ్వరి ఎప్పుడూ బయటకు రాలేదు. అసెంబ్లీలో మీరు చేసినదానికి బయటికి రావాల్సి వచ్చింది. చేయాల్సిన తప్పులు చేసి దొరికిపోయావ్. ఇప్పుడు మీఇంట్లో ఆడోళ్లు ఉన్నారని గుర్తొచ్చిందా? మీ ఇంట్లో ఆడోళ్ల గురించి చెప్పాలంటే చాలా ఉంది. సభ్యత కాదు.. నీ బ్యాటరీ సరిగా లేదు. ఏం.. పవన్ కల్యాణ్ పెళ్లిళ్లు చేసుకుంటే నీకెందుకు? విడాకులిచ్చాడు.. లీగల్‌గానే చేసుకున్నాడు. పవన్ మంచోడు కాబట్టి ఊరుకున్నాడు తప్ప.. మిమ్మల్ని ఏమీ చేయలేక కాదు' అని హెచ్చరించారు.

బొకేలు తేవొద్దు: మంత్రి అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తనను కలిసేందుకు వచ్చే వారు బొకేలు, గజమాలలు, దుశ్శాలువాలు తీసుకురావద్దని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. వాటికి పెట్టే ఖర్చుతో చదువుకునే పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించాలని సూచించారు. తనకు శుభాకాంక్షలు చాలని ఆదివారం పేర్కొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ నెల కూడా సామాజిక పింఛన్లను ఒక రోజు ముందే పంపిణీ చేయనున్నారు. ఈ నెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు పల్నాడు జిల్లా నరసారావుపేట నియోజకవర్గం యల్లమంద గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 10.50 గంటలకు యల్లమంద గ్రామానికి చేరుకుని 11.30 గంటల వరకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. అనంతరం 12.35 గంటల వరకు లబ్ధిదారులతో చంద్రబాబు ముచ్చటిస్తారు.

సంధానానికి సై..

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఈ పథకానికి కేంద్రం నుంచి ఆర్థిక సాయాన్ని కోరినట్లుగా వెల్లడించారు. ఇందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

చురుగ్గా అడుగులు..

గోదావరి-పెన్నా అనుసంధానానికి కేంద్రం ఆర్థికంగా సహకారాన్ని అందించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆర్థిక సహకారంపై పలు ఆలోచనలు చేస్తున్న కేంద్రం... ఏషియా డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రూ.50,000 కోట్లు తీసుకుని .. అందులో రూ.40,000 కోట్లను గోదావరి - పెన్నా అనుసంధానం పథకానికి ఇచ్చే ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక శాఖ పరిశీలిస్తోంది. కాగా.. ఉన్నతస్థాయి సమావేశంలో .. నిధుల సమీకరణపై ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూశ్ కొన్ని సూచనలు చేశారు. వాటిన్నింటినీ పరిగణనలోనికి తీసుకుందామని, త్వరలోనే స్పష్టతకు వద్దామని అధికారులకు సీఎం చంద్రబాబు తెలిపారు.

దుర్భిక్ష జిల్లాలకు మహర్దశ

కృష్ణానదీ జలాలు రాష్ట్ర అవసరాలను పూర్తిగా తీర్చే పరిస్థితి లేదు. దీంతో గోదావరి జలాలను రాష్ట్రమంతటికీ తరలించడమే అత్యున్నతమైన ఆలోచనగా ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. గోదావరి జలాలను తరలించడం ద్వారా కరువును శాశ్వతంగా నివారించవచ్చునని భావిస్తున్నారు. రాష్ట్రంలో దుర్భిక్షం అనేదేలేకుండా పోతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ పథకం సాకారమైతే దుర్భిక్ష జిల్లాలకు మహర్దశ పట్టినట్టేనని వ్యాఖ్యానిస్తున్నారు.

అనుసంధానం ఇలా..

గోదావరి నుంచి కృష్ణానదికి ముందుగా జలాలను తరలిస్తారు. కృష్ణానదినుంచి బొల్లాపల్లి రిజర్వాయరుకు, అక్కడినుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు ఎత్తిపోస్తారు. అయితే, దూరాన్ని తగ్గించేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. తరలించిన నదీజలాలను నిల్వ చేసేలా రిజర్వాయర్లు నిర్మించడంపై దృష్టి సారించారు. మార్గమధ్యంలో ఎక్కడక్కడ రిజర్వాయర్లు అవసరమనేది కార్యాచరణను సిద్ధం చేయాలని జల వనరులశాఖను చంద్రబాబు ఆదేశించారు. రోజుకు 38,845 క్యూసెక్కుల చొప్పున 54 రోజుల్లో 215.5 టీఎంసీలను గోదావరి నుంచి తరలించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం ప్రస్తుత పోలవరం కుడి ప్రధాన కాలువను 25,000 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతారు. తాడిపూడి కెనాల్‌ను 1,500 నుంచి 5,000 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతారు. ఈ సమీక్షా సమావేశంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పీయూశ్, జలవనరులశాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు సీఈ నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు. అనుసంధానం పథకంపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

'కామన్ శాండ్ బో' పాము

» పట్టుకొని అడవిలో విడిచిపెట్టిన స్నేక్ క్యాచర్





'కామన్ శాండ్ బో' పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ ఓంకార్

పలాస, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నెహ్రూ నగర్‌లో ఆదివారం స్థానికులకు 'కామన్ శాండ్ బో' పాము కనిపించింది. రోడ్డు పనులు చేస్తుండగా.. మూడు అడుగుల పొడవు, నాలుగు అంగుళాల మందంతో శరీరంపై మచ్చలతో ఈ సర్పం కనిపించడంతో ఆందోళన చెందారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడి, అటవీ సిబ్బంది కృష్ణారావు, రాజు వచ్చి పరిశీలించారు. ఇది విషపూరితమైనది కాదని, కేవలం ఇసుక తిన్నెలు, అటవీ ప్రాంతాల్లో ఈ జాతి పాములు ఉంటాయని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇలాంటి పాము తారసపడడం ఇదే మొదటిసారన్నారు. తనకు హాని జరుగుతుందని పసిగట్టిన వెంటనే.. ఆ పాము ఆత్మరక్షణకు చుట్టుకొని తలను తోక వద్ద దాచుకుంటుందన్నారు. చూసేందుకు భయంకరంగా కనిపించినా ఇది చిన్న చీమలు, కప్పలు, ఎలుకలను తింటుందని, ఎవరికీ హాని తలపెట్టదని తెలిపారు. 'కామన్ శాండ్ బో' పామును పట్టుకుని కోసంగిపురం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

మొక్కు తీర్చుకున్న తెలుగు మహిళలు

» కూటమి విజయంతో గోదావరి మాతకు 1,008 బిందెల జలంతో అభిషేకం



గోదావరి మాతకు జలాభిషేకం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మహిళలు మొక్కు తీర్చుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కొంత మంది మహిళలు చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని.. ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి శ్రీనివాస్ భారీ మెజార్టీతో విజయం సాధించాలని అసెంబ్లీ ఎన్నికలకు ముందు మొక్కుకున్నారు. ఆ రెండూ నెరవేరడంతో ఆదివారం మొక్కు చెల్లించుకున్నారు. అంగన్‌వాడీ కమిటీ నగర అధ్యక్షురాలు బోను ఈశ్వరి, తెలుగు మహిళా పార్లమెంట్ కవిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో 1,008 బిందెల గోదావరి జలాలతో గోదావరి మాతకు అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, తెలుగు మహిళా నేతలు తురకల నిర్మల, గొర్రెల సత్యరమణి, మీసాల నాగమణి, మోతా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం బ్యాంకుల నుంచి ఫోన్లు

» వైసీపీ చేసిన అప్పులపై వడ్డీలకు ఒత్తిళ్లు

» ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆవేదన

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సర్వనాశనమైందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. రాష్ట్రంపై ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు మోపారని, వాటికి వడ్డీలు కట్టాలంటూ ప్రతి శుక్రవారం తనకు ఏదో ఒక బ్యాంకు నుంచి ఫోన్ వస్తోందని చెప్పారు. వైసీపీ చేసిన విధ్వంసంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకుని జాగ్రత్తగా పాలన సాగించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కొంచెం సమయం తీసుకున్నా చిన్న కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వారి బకాయిలను మార్చిలోపు ఎంతో కొంత చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కర్నూలు నగరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో స్టేట్ ఆఫ్ ఏపీ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) 2025-డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల మాట్లాడుతూ.. రాష్ట్రానికి వచ్చే ఆదాయం జీతాలకు, పెన్షన్లకే సరిపోతోందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా వస్తున్నాయని, దీనివల్ల ఆదాయం పెరుగుతుందని, దీంతో కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త పథకాలకు రూపకల్పన చేయవచ్చని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ.. జగన్ హయాంలో తనకు రావాల్సిన రూ.88 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. వాటిని చెల్లించమని పలుమార్లు విన్నవించగా.. పార్టీ మారితే బిల్లులు చెల్లిస్తామని ఒత్తిడి చేసినట్లు చెప్పారు. 250 మంది కాంట్రాక్టర్లు బిల్లుల కోసం విశాఖలో పార్టీ మారినా కూడా వారి బిల్లులు చెల్లించలేదన్నారు.



కానిస్టేబుల్ కొట్టిన లాఠీ దెబ్బలకు శరీరంపై ఏర్పడిన గాయాలు

బస్టాండ్‌లో ప్రయాణికుడిపై ఖాకీ క్రౌర్యం

» లాఠీతో చితకబాదిన అవుట్‌పోస్టు కానిస్టేబుల్

» చివరి బస్సు అందక అక్కడే విశ్రమించిన ఫలితం

» ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో దారుణం

» సోషల్ మీడియాలో వీడియో వైరల్

» ఘటనపై విచారణ చేస్తున్నామన్న డీఎస్పీ

ఒంగోలు (క్రైం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): చివరి బస్సు అందకపోవడంతో తెల్లవారేవరకూ బస్టాండ్‌లోనే విశ్రమించేందుకు ప్రయత్నించిన ప్రయాణికుడిని అవుట్‌పోస్టు కానిస్టేబుల్ లాఠీతో చితకబాదాడు. ప్రకాశం జిల్లా ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిందీ దారుణం. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆ కానిస్టేబుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరుకు చెందిన పిడతల మార్కు సొంత ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేస్తుంటారు. ట్రాక్టర్ మరమ్మతులకు గురవడంతో బాగు చేయించేందుకు శనివారం ఒంగోలులోని మెకానిక్ షెడ్డుకు తీసుకువచ్చారు. రాత్రి వరకూ మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ఇంటికి వెళ్లేందుకు మార్కు బస్టాండ్‌కు చేరుకున్నారు. అప్పటికే బస్సులన్నీ వెళ్లిపోవడంతో వేకువజామున తొలి బస్సుకు వెళ్దామని అక్కడే విశ్రమించేందుకు సిద్ధమయ్యారు. సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెట్టుకుంటుండగా అవుట్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ సురేశ్ వచ్చి మార్కును ప్రశ్నించారు. ఎవరు నువ్వు? ఎందుకు ఇక్కడ ఉన్నావు? అంటూ కానిస్టేబుల్ గద్దించగా, ఎందుకు గట్టిగా మాట్లాడుతున్నారంటూ మార్కు ఎదురు ప్రశ్నించారు. దీనిపై ఆవేశంతో ఊగిపోయిన కానిస్టేబుల్ లాఠీతో మార్కుపై విరుచుకుపడ్డారు. అక్కడ ఉన్న ప్రయాణికులు వారించేందుకు ప్రయత్నించినా కానిస్టేబుల్ వినిపించుకోలేదు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్‌కు చేరుకొని కానిస్టేబుల్‌ను అక్కడి నుంచి పంపించేశారు. మార్కును పోలీసుస్టేషన్‌కు తరలించారు. రాత్రంతా స్టేషన్‌లో ఉంచి ఉదయం కొంతమంది పెద్దమనుషులను పిలిపించి బాధితుడిని బుజ్జగించి పంపించారు. కాగా, బస్టాండ్‌లో ప్రయాణికుడిపై కానిస్టేబుల్ దాడి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో మార్కు మద్యం సేవించి పోలీసులకు ఎదురు తిరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికుడిని కానిస్టేబుల్ కొట్టిన విషయంపై విచారణ చేస్తున్నామని ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. కానిస్టేబుల్ పట్ల ప్రయాణికుడు దురుసుగా ప్రవర్తించాడని ఆయన పేర్కొన్నారు.



రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డుపై భారీ ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. సోషల్ మీడియాను మంచి కోసం వాడుకుందామంటూ, చెడును ప్రోత్సహించొద్దు అంటూ రాసి ఉన్న ఈ ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి.

చెప్పి చూద్దాం.. చేసి చూపిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ నేత జరిపిన దాడిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తక్షణం స్పందించారు. తిరుపతి రిమ్స్ ఆస్పత్రికి స్వయంగా వెళ్లి ఎంపీడీవోను ఆయన పరామర్శించారు. ఘటన జరిగిన వెంటనే పవన్ కదిలి రావడం ఉద్యోగుల్లో నైతిక స్థైర్యం కలిగించింది. ఉద్యోగులకు ప్రభుత్వం రక్షణగా ఉన్నదన్న భరోసా ఏర్పడింది. పవన్ పరామర్శతో ఉద్యోగులపై దాడులకు పాల్పడితే ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందన్న సంకేతాలు వెళ్లాయి. నిజానికి, జగన్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులపై జరిగిన దాడులపై అప్పటి ముఖ్యమంత్రి గానీ, మంత్రులుగానీ అంతగా స్పందించిన పరిస్థితుల్లేవు. పైగా డాక్టర్ సుధాకర్ లాంటి వారిపై విచక్షణారహితంగా పోలీసులే దాడులు చేసేలా పురిగొల్పారు. వైసీపీ పాలించిన ఐదేళ్లూ రాష్ట్రంలో సామాన్య ప్రజలతో పాటు ఉద్యోగుల్లోనూ అభద్రతా భావం రాజ్యమేలింది. అప్పట్లో వైసీపీ నేతల దెబ్బకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు విలవిలలాడిపోయేవారు. రూల్స్ అమలు చేయాలనుకునే ఉద్యోగులకు ఆ ప్రభుత్వ పాలనలో అడుగడుగునా చిక్కులే. ఎప్పుడెప్పుడు జగన్ నిరంకుశ పాలన పోతుందా అని ఉద్యోగులు ఎదురుచూశారు. తదనుగుణంగానే కూటమి ప్రభుత్వం చర్యలు ఉండటం, ఉద్యోగులపై దాడిని తీవ్రంగా తీసుకోవడం పట్ల ఉద్యోగ వర్గాలు ఊరట చెందాయి.

పాజిటివ్ పోస్టులపై ప్రచారం..

సోషల్ మీడియాలో అభ్యంతరకర, అసభ్య పోస్టులు పెట్టే సంస్కృతి కొన్ని చోట్ల పరాకాష్ఠకు చేరింది. నేతలపై దూషణలు, మహిళల చిత్రాలు నగ్నంగా పెట్టి వేధించడం లాంటి సంఘటనలు పోలీసులకు సైతం చికాకు కలిగిస్తున్నాయి. వైసీపీ హయాం నుంచీ వస్తున్న ఈ దుష్ట సంస్కృతికి ఫుల్‌స్టాప్ పెట్టాలని, అందుకు ముందుగా వార్నింగ్ ఇచ్చి ఆ తర్వాత చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. అంతకు ముందుగా ప్రజల్లో సోషల్ మీడియా దుష్ప్రభావంపై అవగాహన కల్పించి, మంచి పోస్టింగ్‌లకు మాత్రమే సోషల్‌మీడియాను వాడుకునేలా చర్యలు తీసుకోనున్నారు. ముందు చెప్పి చూద్దాం..ఆ తర్వాత కఠినంగా శిక్షిద్దామన్న సంకేతాలు ప్రభుత్వం పంపుతోంది.

నేడు ఉద్యోగులతో పవన్ కాన్ఫరెన్స్...

భౌతికదాడులను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యోగుల అభిప్రాయాలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులతో ఏపీ స్వాన్ ద్వారా ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి అధికారులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి హామీ పథకం డైరెక్టర్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీలు, పీఆర్, ఆర్‌డీ అడిషనర్ కమిషనర్లు, కన్సల్టెన్స్ జాయింట్ కమిషనర్‌తో పాటు జిల్లా స్థాయిలో జడ్పీ సీఈవో, డీపీవోలు, డ్వామా పీడీలు, పీఆర్ ఎస్ఈలు, డీఎల్‌డీవోలు, డీఎల్పీవోలు, పీఆర్ ఈఈలు, మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఈవోపీఆర్ అండ్ ఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ఆయన వర్చువల్‌గా సమావేశమవుతారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఉద్యోగుల అభిప్రాయాలను స్వీకరించనున్నారు. అనంతరం ప్రభుత్వపరంగా ఏం చేయాలన్న దానిపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి పాల్పడితే ప్రభుత్వంపై దాడి చేసినట్లేనని, పైగా విధి నిర్వహణలోని ఉద్యోగుల జోలికి వెళ్తే పర్యావసానాలు తీవ్రంగా ఉంటాయన్న హెచ్చరికలు వెళ్లాలని సూచిస్తున్నారు.

జగన్ 'పోరుబాట' రద్దు!

» ఇటీవల రెండు నిరసనలకు ప్రజల స్పందన అంతంతే

» సొంత కేడర్‌లోనే వ్యతిరేకత.. దీంతో రద్దు బాట

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారం విద్యుత్ చార్జీలు పెంచారు. విద్యార్థులకు బకాయిలు పెట్టారు. అధికారం పోయాక ఆ తప్పులను కూటమి ప్రభుత్వంపై వేస్తూ ఆందోళన బాటపట్టారు. వరుస పోరాటాలకు తేదీలను ప్రకటించిన జగన్... జనం నుంచి తగిన స్పందన రాకపోవడంతో వెనక్కి తగ్గారు. ఇటీవల రైతు పోరుబాట, విద్యుత్తు చార్జీలపై చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన కొరవడింది. దీంతో వచ్చే నెల 3న చేపట్టాలని నిర్ణయించిన 'ఫీజు రీయింబర్స్‌మెంటు' పోరుబాటను తాజాగా వాయిదా చేసుకున్నారు. అసలు విషయం చెప్పకుండా విద్యార్థుల పరీక్షల పేరిట వాయిదా వేస్తున్నట్టు కవరింగ్ ఇచ్చారు. అయితే నిరసన వాయిదా వేయడం కాదు రద్దు చేసుకున్నట్టేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. వైసీపీ చేపట్టిన నిరసనలకు ప్రజల నుంచి స్పందన రావడం లేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక కనీసం ఏడాదైనా గడువు ఇవ్వకుండా ప్రజాందోళనలకు పిలుపునివ్వడం ఏంటని వైసీపీ ముఖ్యనేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం ఏర్పడిన ప్రభుత్వం మెడపై కత్తిపెట్టినట్లుగా ఆందోళనలు చేస్తామంటే ప్రజల్లో చులకన అవుతామని వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే రైతు పోరుబాట కార్యక్రమం విఫలమైందని, రైతులెవరూ వైసీపీ పిలుపునకు స్పందించలేదని చెబుతున్నారు. మరోవైపు.. అధికారంలో ఉండగా విద్యుత్ చార్జీలను పెంచేసి, అధికారాన్ని కోల్పోయిన వెంటనే కరెంటు చార్జీలపై ఆందోళన నిర్వహించడాన్ని కూడా కొందరు వైసీపీ నాయకులు తప్పుబడుతున్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు బకాయిలు పెట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఆ విషయం మరిచిపోయి కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడం లేదంటూ మండలస్థాయిలో నిరసన కార్యక్రమానికి జగన్ పిలుపు ఇవ్వడాన్ని కూడా తప్పుపడుతున్నారు. వైసీపీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఇంకా పోలేదని సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాందోళనలు చేసేందుకు కేడర్ కూడా సహకరించడం లేదని చెబుతున్నారు. రైతు పోరుబాట, విద్యుత్ చార్జీలపై నిరసనలకు పట్టుమని పది జిల్లాల్లో కూడా చెప్పుకోదగ్గ కేడర్ పాల్గొనలేదని గుర్తు చేస్తున్నారు. మంత్రులుగా బాధ్యతలు నిర్వహించిన నేతలు కూడా నిరసన కార్యక్రమాలకు కనీసం వంద మందిని తీసుకురాలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మరో నిరసన కార్యక్రమమంటే ప్రజల్లో చులకనవుతామని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయాన్ని ఆ పార్టీ ముఖ్యనేతలు, కేడర్ ఆహ్వానించడం విశేషం.

అరబిందో 'అత్యవసర' అక్రమాలు!

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేశారు. చివరికి ఇంజన్ ఆయిల్ కూడా మార్చకుండా వాహనాలను తిప్పేశారు. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇచ్చిన దాఖలాలు కూడా లేవు. ఇన్ని తప్పులు చేసినా జగన్ ప్రభుత్వం అరబిందోపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పెనాల్టీలు కూడా విధించకుండా మరింత ప్రోత్సాహం అందించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అరబిందో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 108, 104 వాహనాల్లో ఉద్యోగుల భర్తీకి సంబంధించి వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెలుగుచూశాయి. దీనిపై గుంటూరు విజిలెన్స్ కార్యాలయంలో ఈ ఏడాది ఆగస్టులో ఫిర్యాదు నమోదైంది. ఈ క్రమంలో అరబిందో అత్యవసర వైద్య సేవల డైరెక్టర్ సంపత్ రెడ్డి, ఆపరేషన్స్ హెడ్ గంగాధర్, డాక్టర్ సునీల్‌ను విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నారు. మొత్తం డేటా బయటకు తీస్తున్నారు. ఉద్యోగాల భర్తీ, వాహనాల నిర్వహణ, ఎంవోయు ప్రకారం వాహనాలు తిప్పారా? లేదా? అన్న వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. దీనిపై ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ నుంచి విజిలెన్స్ అధికారులు సమాచారం సేకరించారు. ముఖ్యంగా 108 అంబులెన్సుల్లో పైలట్, ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్), 104 వాహనాల్లో డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్ పోస్టుల భర్తీకి ప్రతి ఒక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కానీ, వైసీపీ హయాంలో ఈ ఆరోపణలను ఎవరూ పట్టించుకోలేదు. దీనికి తోడు ఉద్యోగాల్లో చేరిన వారి నుంచి శిక్షణ పేరుతో రూ.10 వేలు చొప్పున వసూలు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పైలట్, ఈఎంటీ సర్టిఫికెట్‌కు రూ.15వేల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. ఈ మొత్తాన్నీ అరబిందో సంస్థ వసూలు చేసిందా? లేక మధ్యలో ఉండే ఉద్యోగులు తీసుకున్నారా? అనే విషయంపైనా విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు

రోగులను కూడా అరబిందో వదిలిపెట్టలేదు. రోగుల అత్యవసర సేవలను కూడా క్యాష్ చేసుకోవాలని ఉద్యోగులు చూశారు. 108 అంబులెన్సులను రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు వచ్చిన బాధితులు ఎక్కువగా ఉపయోగించుకుంటారు. ఇలాంటి రోగులే టార్గెట్‌గా సంస్థలోని కొంత మంది సరికొత్త ప్లాన్ చేశారు. అత్యవసర వైద్యం అవసరమైన రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలించేవారు. ఈ ప్రక్రియలో ప్రైవేటు ఆస్పత్రులతో ముందే బేరం కుదుర్చుకునేవారు. ప్రభుత్వ అంబులెన్సుల్లో రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి, ఆ రోగులు కట్టే బిల్లుల్లో 10 నుంచి 20 శాతం వీళ్లకు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నారు. పర్సంటేజ్ వసూలు చేయడానికి అరబిందో సంస్థ విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో ప్రత్యేకంగా ఉద్యోగులను కూడా నియమించిందన్న ఆరోపణలు గతంలో వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా విజిలెన్స్ అధికారులు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ నుంచి హాస్పిటల్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(హెచ్ఆర్ఎంఎస్) గురించి కూడా సమాచారం కావాలని కోరారు. అయితే, ఈ సమాచారాన్ని ట్రస్ట్ అధికారులు మళ్లీ అరబిందో సంస్థనే అడిగారు. విజిలెన్స్ పంపించిన లేఖను అరబిందోకు పంపించి సమాచారం ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. అరబిందో సంస్థ ఇలాంటివేమీ జరగలేదంటూ మూడు వేల పేజీలతో కూడిన నివేదికను ట్రస్ట్‌కు పంపింది. ట్రస్ట్ అధికారులు ఆ నివేదికను విజిలెన్స్‌కు పంపించి చేతులు దులుపుకొన్నారు. విజిలెన్స్ లేవనెత్తిన ప్రశ్నలపై గతంలో ఎప్పుడైనా ఫిర్యాదులు వచ్చాయా? వస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న కనీస విచారణ కూడా ట్రస్ట్ చేయలేదు.

జీతం పెంపుపై ఉద్యోగులు హర్షం

108 అంబులెన్సుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల జీతం రూ.4 వేలు పెంచాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. నాటి టీడీపీ హయాంలో 108 ఉద్యోగుల కష్టాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు 2017లో జీవో 49 ద్వారా నెలకు రూ.4 వేలు అదనంగా ఇచ్చారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం అదనపు మొత్తాన్నీ ఇవ్వలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం మళ్లీ జీవోను పునరుద్ధరించి ఉద్యోగులకు రూ.4 వేల వేతనం పెంచాలని నిర్ణయించడం హర్షణీయమని ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.